PRAJASAKTI Regd.No. 15795/68
సిటీ ◆
ప్రజాశక్తి
ప్రతి అక్షరం ప్రజల పక్షం
Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu
సంపుటి : 44 సంచిక : 277 | విజయవాడ, ఆదివారం 11 మే 2025 | 6 + 8 పేజీలు + స్నేహ వెల : 7.00
Vol No | Vijayawada, Sunday 11 May 2025 | Rs

సమగ్రంగా ఎన్నికల సంస్కరణలు
- పారదర్శకతకు పట్టంకట్టాలి
- ఎన్నికల సంఘంతో సిపిఎం బృందం భేటీ
- ''దామాషా ప్రాతినిధ్యం అమలుకు వినతి

5

టైటిల్ కొట్టేదెవరో..?
- నేడు భారత్ × శ్రీలంక మహిళల మధ్య ముక్కోణపు సిరీస్ ఫైనల్

6

కాల్పుల విరమణ

- భారత్ -పాక్ చర్చలు • తొలుత ప్రకటించిన అమెరికా అధ్యక్షుడు ట్రంప్
- మధ్యవర్తిత్వం చేశామంటూ ట్వీట్ • ఆ తరువాత ధృవీకరించిన ఇరు దేశాలు

ట్రంప్ ఏం చెప్పారు?



'అమెరికా మధ్యవర్తిత్వంలో రాత్రంతా సుదీర్ఘ చర్చలు జరిగాయి. ఈ చర్చల్లో తక్షణ, పూర్తిస్థాయి కాల్పుల విరమణను పాటించడానికి భారత్ - పాకిస్తాన్‌లు అంగీకరించాయని నేను సంతోషంతో ప్రకటిస్తున్నాను. సమయస్ఫూర్తిని, గొప్ప మేధస్సును (కామెన్‌సెన్స్, గ్రేట్ ఇంటెలిజెన్స్) ఉపయోగించినందుకు రెండు దేశాలకు అభినందనలు తెలుపుతున్నాను' అని ఆయన పేర్కొన్నారు.

భారత్ ఏం ప్రకటించింది ?

'మధ్యాహ్నం 3:35 గంటలకు భారత డైరెక్టర్ జనరల్ ఆఫ్ మిలటరీ ఆపరేషన్స్ (డిజిఎం)కు పాకిస్తాన్ డైరెక్టర్ జనరల్ ఫోన్ చేశారు. వారి స్థాయిలో చర్చలు జరిగాయి. కాల్పుల విరమణకు ఇరు దేశాల సైనికాధికారులు అంగీకరించారు. సాయంత్రం ఐదు గంటల నుండి ఇది అమలులోకి వస్తుంది. భూ, గగన, సముద్ర తలాల్లో కాల్పుల విరమణ కొనసాగుతుంది. దీనికి సంబంధించి ఇరు దేశాల సైన్యానికి ఆదేశాలు వెళ్లాయి. ఈ నెల 12వ తేదీ మధ్యాహ్నం 12:30 గంటలకు ఇరు దేశాల డిజిఎంఓలు మళ్లీ చర్చిస్తారు. అని భారత విదేశాంగ శాఖ కార్యదర్శి విక్రమ్ మిస్రి తెలిపారు. శనివారం సాయంత్రం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన ఈ ప్రకటన చేశారు.

పాకిస్తాన్ ధృవీకరణ ఇలా...

'పాకిస్తాన్-భారత్‌లు కాల్పుల విరమణకు అంగీకరించాయి. ఈ నిర్ణయం తక్షణం అమలులోకి రానుంది. పాకిస్తాన్ ఈ ప్రాంతంలో శాంతి భద్రతల పరిరక్షణకు ఎప్పటినుండో కృషి చేస్తూనే ఉంది. మా దేశ సార్వభౌమత్వం, ప్రాదేశిక సమగ్రతల విషయంలో రాజీ పడకుండా ఈ కృషిని కొనసాగిస్తాం.' అని పాకిస్తాన్ డిప్యూటీ ప్రైమ్ మినిస్టర్, విదేశాంగ శాఖ మంత్రి కూడా అయిన ఇషాక్ దార్ ప్రకటించారు. ఈ మేరకు ఆయన ఎక్స్‌లో పోస్టు చేశారు.

న్యూఢిల్లీ : కొన్ని రోజులుగా తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న భారత్-పాకిస్తాన్‌ల మధ్య శనివారం కీలకపరిణామం చోటుచేసుకుంది. రెండు దేశాలు కాల్పుల విరమణకు అంగీకరించాయి. 12వ తేదీ (సోమవారం) మధ్యాహ్నం కాల్పుల విరమణకు సంబంధించిన వివిధ అంశాలపై రెండు దేశాలు మరోసారి చర్చలు జరపనున్నాయి. ఈ మేరకు ప్రకటించిన భారత విదేశాంగశాఖ శనివారం సాయంత్రం ఐదు గంటల నుండే కాల్పుల విరమణ అమలులోకి వచ్చినట్లు తెలిపింది. భారత్ ఈ ప్రకటన చేసిన కాసేపటికే పాకిస్తాన్ దీనిని ధృవీకరించింది. పాకిస్తాన్ డిప్యూటీ ప్రైమ్ మినిస్టర్ ఇషాక్‌దార్ కూడా ఇదే విషయాన్ని తెలుపుతూ ట్వీట్ చేశాడు. అయితే, భారత్-పాకిస్తాన్‌ల కన్నా ముందే అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ రెండు దేశాల కాల్పుల విరమణ గురించి ప్రకటించారు. ఈ మేరకు శనివారం మధ్యాహ్నం ఆయన సామాజిక మాధ్యమం ఎక్స్‌లో పోస్ట్ చేశారు. ట్రంప్ చేసిన ఈ పోస్టు పెద్ద ఎత్తున చర్చనీయాంశంగా మారింది. పోస్టులోని విశ్వసనీయతను నిర్ధారించుకునేందుకు మీడియా ప్రతినిధులు అనేక ప్రయత్నాలు చేశారు. ఈ ఉత్కంఠ కొనసాగుతుండగానే సాయంత్రం నిర్వహించిన విలేకరుల సమావేశంలో కాల్పుల విరమణను భారత విదేశాంగ

మిగతా 5లో

కాల్పుల విరమణ ప్రకటిస్తున్న భారత విదేశాంగ శాఖ కార్యదర్శి విక్రమ్ మిస్రి, కల్నల్ సోఫియా ఖురేషి, వింగ్ కమాండర్ వ్యోమికా సింగ్

సానుకూల పరిణామం : సిపిఎం

న్యూఢిల్లీ : భారత్, పాకిస్తాన్ దేశాలు కాల్పుల విరమణకు అంగీకరించడాన్ని సానుకూల పరిణామంగా సిపిఎం పేర్కొంది. ఈ మేరకు పార్టీ పొలిట్ బ్యూరో ఒక ప్రకటన విడుదల చేసింది. 'కాల్పుల విరమణ వెంటనే అమలులోకి వస్తుందని భారత్, పాకిస్తాన్ దేశాలు ప్రకటించడం సానుకూల పరిమాణం. రెండు దేశాలకు శాంతి అవసరం. రెండు దేశాలు అభివృద్ధి చెందాలన్నా, సుసంపన్నంగా ఉండాలన్నా శాంతి పరిఢవిల్లాలి. భారత్, పాకిస్తాన్ దేశాలు ఆ దిశగా ముందుకు కదులుతా యని మేము ఆశిస్తున్నాం. తన భూభాగంలో ఉగ్రవాద కార్యకలాపాలు జరగకుండా పాకిస్తాన్ చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. ఇక ఘర్షణలు జరగకుండా చూడాలి' అని పొలిట్‌బ్యూరో పేర్కొంది.

ఆగని కాల్పులు

- ఇది దుర్మార్గం : మిస్రి

న్యూఢిల్లీ : శనివారం సాయంత్రం నుంచి కాల్పుల విరమణ అమలులోకి వస్తుందని ప్రకటించినప్పటికీ అది వాస్తవం రూపం దాల్చలేదు. శనివారం రాత్రి కూడా పాకిస్తాన్ డ్రోన్‌ల దాడులు, కాల్పులను కొనసాగించింది. జమ్ముకాశ్మీర్, పంజాబ్, హర్యానా, గుజరాత్‌లో డ్రోన్‌లు కనపడినట్లు, కొన్ని ప్రాంతాల్లో కాల్పులు,పేలుళ్ల శబ్దాలు వినపడినట్లు వార్తలు వచ్చాయి. దీంతో అనేక నగరాల్లో ఎత్తివేసిన బ్లాక్‌అవుట్‌ను మళ్లీ అమలులోకి తీసుకువచ్చారు. ఈ నేపథ్యంలో శనివారం రాత్రి పొద్దుపోయిన తరువాత మీడియాతో మాట్లాడిన విదేశాంగ శాఖ కార్యదర్శి మిస్రి 'ఇది దుర్మార్గం' అని పేర్కొన్నారు. కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించడం సరికాదని ఆయన చెప్పారు. ఇదే పరిస్థితి కొనసాగితే జరిగే పరిణామాలకు పాక్‌దే బాధ్యత అవుతుందని అన్నారు. ఒప్పందం విషయాన్ని దిగువస్థాయి వరకు తీసుకువెళ్లి, ఉల్లంఘనలను పాకిస్తాన్ నిలువరిస్తుందన్న ఆశాభావాన్ని ఆయన వ్యక్తం చేశారు. ఇదే పరిస్థితి కొనసాగితే తగిన రీతిలో స్పందించేందుకు అన్ని అధికారాలను సైన్యానికి ఇచ్చినట్లు ఆయన తెలిపారు. అంతకుముందు శ్రీనగర్ అంతటా పేలుళ్ళ సంభవిస్తున్నాయని సాక్షాత్తూ ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా పేర్కొన్నారు. 'కాల్పుల విరమణ జరుగుతుందా? శ్రీనగర్ అంతటా పేలుళ్ల వినిపిస్తున్నాయి' అని రాత్రి 8:30 గంటల ప్రాంతంలో ట్వీట్ చేశారు. శ్రీనగర్‌లోని రాజ్‌బాగ్ ప్రాంతంలో డ్రోన్లు కనిపించినట్లు సైన్యం తెలిపింది. గుజరాత్ హోంశాఖ మంత్రి కచ్ ప్రాంతంలో డ్రోన్లు ఎగురుతున్నట్లుగా ట్వీట్ చేశారు. దీంతో గుజరాత్‌లోని పలు గ్రామాల్లో బ్లాక్ అవుట్ అమలు చేయాలని నిర్ణయించినట్లు ఆయన పేర్కొన్నారు.

పాక్ కాల్పుల్లో ఐదుగురు మృతి
- మృతుల్లో జమ్మూకాశ్మీర్ సీనియర్ అధికారి

5

విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న బివి రాఘవులు, పక్కన వి.శ్రీనివాసరావు తదితరులు

కేంద్ర వైఖరితో పత్రికా స్వేచ్ఛకు ముప్పు

- 'పి-4' పేరిట పేదలను అవమానిస్తున్న చంద్రబాబు
- ఆపరేషన్ కగార్‌ను నిలిపివేసి మావోయిస్టులతో చర్చలు జరపాలి
- మీడియా సమావేశంలో బివి రాఘవులు

ప్రజాశక్తి- తిరుపతి బ్యూరో

కేంద్ర ప్రభుత్వం పత్రికా స్వేచ్ఛకు, వాక్ స్వాతంత్ర్యానికి, సభా స్వాతంత్ర్యానికి భంగం కలిగించే రీతిలో వ్యవహరిస్తోందని సిపిఎం పొలిట్ బ్యూరో సభ్యులు బివి రాఘవులు అన్నారు. పత్రికా స్వేచ్ఛను కాపాడాలని ఆయన డిమాండ్ చేశారు. తిరుపతిలో జరుగుతున్న సిపిఎం రాష్ట్ర కమిటీ సమావేశాలకు హాజరైన ఆయన స్థానిక వేమన విజ్ఞాన కేంద్రంలో శనివారం మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా 'ద వైర్' వెబ్‌సైట్‌ను కేంద్రం బ్లాక్ చేయడాన్ని ఆయన ప్రస్తావించారు. కొన్ని న్యూస్ పోర్టళ్లను, కొంతమంది జర్నలిస్టుల మీడియా వేదికలను, జమ్మూ కాశ్మీర్‌లోని మక్తూం న్యూస్ పోర్టల్‌ను, అనురాధ భాషిన్ అనే జర్నలిస్టు, అర్పిత శర్మ అనే పొలిటికల్ కామెంటేటర్ వెబ్ సైట్లను, సోషల్ మీడియా వేదికలను కూడా కేంద్రం బ్లాక్ చేసిందని తెలిపారు. ఈ వెబ్ సైట్లను, సోషల్ మీడియా వేదికలను వెంటనే అనుమతించాలని డిమాండ్ చేశారు. విద్వేషాలు, వైషమ్యాలు పెంచే వేదికలను కొనసాగిస్తూ, ప్రశ్నించే శక్తులను బ్లాక్ చేయడం దారుణమన్నారు. బాధితులకు సంఘీభావంగా తాము నిలబడతామని, పోరాడుతామని తెలిపారు.

పాకిస్తాన్‌ను ఒంటరిపాటు చేయాలి...

ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తున్న పాకిస్తాన్‌పై అంతర్జాతీయ వేదికల ద్వారా ఒత్తిడి పెంచి ఒంటరిపాటు చేయాలని చెప్పారు. ఈ దిశలో కేంద్రం నిర్దిష్ట చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఉగ్రవాదులను భారత్‌కు అప్పగించేలా ఈ ఒత్తిడి ఉండాలని సూచించారు. దాడులకు మౌలికంగా సిపిఎం వ్యతిరేకమైనప్పటికీ ఎదుటివారు కవ్వింపు చర్యలకు పాల్పడుతూ ఉగ్రవాద చర్యలకు పాల్పడుతుంటే చూస్తూ ఊరుకోవాలన్నది దాని అర్థం కాదని వివరించారు. మావోయిస్టులపై కేంద్రం నిర్వహిస్తున్న ఆపరేషన్ కగార్‌ను తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని ఆయన చెప్పారు. చర్చలకు సిద్ధమంటున్న విజ్ఞప్తిని ప్రభుత్వం అంగీకరించకుండా మావోయిస్టులను హత్యలు చేయడం దారుణమని అన్నారు. తక్షణం కాల్పులు విరమించి మావోయిస్టులతో చర్చలు జరపాలని కోరారు. దారిద్ర్యాన్ని నిర్మూలించే పేరిట చంద్రబాబు నాయుడు రాష్ట్రంలో అమలు చేస్తోన్న 'పి4' విధానం పేదలను అవమానించేలా ఉందని చెప్పారు. ప్రభుత్వం తన బాధ్యత నుంచి తప్పుకొని పేదలను కార్పొరేటు శక్తులకు అప్పగిస్తోందని, కార్పొరేట్ సామాజిక బాధ్యత పేరిట కొన్ని కంపెనీలు కేటాయించే డబ్బును పేద కుటుంబాలకు ఖర్చు చేయడం ద్వారా దారిద్ర్యం రాష్ట్రంలో పోతుందనుకోవడం భ్రమేనని వివరించారు. దారిద్ర్య నిర్మూలనకు సహకరించే

మిగతా 2లో

మధ్య తరగతి ఉద్యోగుల రాష్ట్ర సదస్సులో మాట్లాడుతున్న ఆర్ అజయ్‌కుమార్

20న సమ్మె విజయవంతం చేయాలి

- మధ్య తరగతి ఉద్యోగుల రాష్ట్ర సదస్సు పిలుపు
- లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలి
- ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ ఆపాలి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

దేశ వ్యాప్తంగా ఈ నెల 20న నిర్వహించే కార్మిక సమ్మెను విజయవంతం చేయాలని మధ్య తరగతి ఉద్యోగుల రాష్ట్ర సదస్సు పిలుపునిచ్చింది. కార్మిక చట్టాల స్థానంలో కేంద్రప్రభుత్వం రూపొందించిన నాలుగు లేబర్ కోడ్స్‌ను, నూతన పెన్షన్ విధానాన్ని తక్షణమే రద్దు చేయాలని సదస్సు డిమాండ్ చేసింది. విజయవాడలోని బాలోత్సవ భవన్‌లో మధ్యతరగతి ఉద్యోగ సంఘాల ఐక్యవేదిక రాష్ట్ర కన్వీనరు ఆర్ అజయ్‌కుమార్ అధ్యక్షతన శనివారం సదస్సు జరిగింది. జాతీయ ప్రయోజనాలకు వ్యతిరేకమైన ప్రైవేటీకరణ విధానాలను రద్దు చేయాలని, ప్రభుత్వరంగ సంస్థల్లో తక్షణమే రిక్రూట్‌మెంట్ చేపట్టాలని, ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణ నిలిపివేయాలని సదస్సు డిమాండ్ చేసింది. ఈ నెల 20న దేశ వ్యాప్తంగా నిర్వహించే కార్మిక సమ్మెను విజయవంతం చేయాలని సదస్సు పిలుపునిచ్చింది. ఈ సందర్భంగా జాతీయ సమ్మె పోస్టర్‌ను నేతలు ఆవిష్కరించారు. అనంతరం అజయ్‌కుమార్ మాట్లాడుతూ.. కరోనా సమయంలో పార్లమెంట్‌లో ఎటువంటి చర్చ లేకుండా కేంద్రం నాలుగు లేబర్ కోడ్‌లను దొడ్డిదారిన తీసుకొచ్చిందన్నారు. కార్పొరేట్ సంస్థలకు లాభాలు అందించేందుకు కార్మిక చట్టాలను రద్దు చేసి, వాటి స్థానంలో లేబర్ కోడ్‌లను తీసుకొచ్చేందుకు పాలకవర్గాలు ప్రయత్నం చేశాయన్నారు. లేబర్ కోడ్లు అమలులోకి వస్తే ఇప్పుడున్న అనేక హక్కులను కార్మికులు, ఉద్యోగులు కోల్పోవాల్సి ఉంటుందన్నారు.

ఎఐబిఇఎ (బ్యాంక్ ఉద్యోగుల సంఘం) రాష్ట్ర నాయకులు వై శ్రీనివాస్ మాట్లాడుతూ.. దేశ ఆర్థిక వ్యవస్థ ఛిన్నాభిన్నం కాకుండా ప్రభుత్వ రంగ బ్యాంకులు కృషి చేశాయన్నారు. అలాంటి వాటిని దెబ్బతీసేందుకు విలీనాలు చేస్తున్నారన్నారు. పనిభారం పెరిగిందని, వినియోగదారులకు అందించే సేవలపై ప్రభావం ఉందని తెలిపారు. బ్యాంకింగ్ రంగంలో ఉద్యోగ ఖాళీలు వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. సౌత్ సెంట్రల్ జోన్ ఇన్సూరెన్స్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ సంయుక్త కార్యదర్శి జి కిషోర్ మాట్లాడుతూ.. లేబర్ కోడ్స్ అమలు వల్ల కార్మికులు వెట్టిచాకిరీ చేయాల్సిన పరిస్థితి వస్తుందన్నారు. ఉద్యోగ భద్రత, ఇఎస్ఐ, కనీస వేతనాలు, పోరాడే హక్కులు కోల్పోతారని తెలిపారు. కార్మికుల సంక్షేమం, అభివృద్ధి కుంటుపడి కుటుంబాలు వీధిన పడతాయన్నారు. విదేశీ ప్రత్యక్ష పెట్టుబడి నూరు శాతం ఆమోదించడం, బీమా చట్ట సవరణలను వ్యతిరేకిస్తూ సమ్మెలో పాల్గొంటున్నట్లు ఆయన వెల్లడించారు. ఈ నెల 20న దేశవ్యాప్త కార్మిక సమ్మెకు సంబంధించిన డిమాండ్లతో కూడిన తీర్మానాన్ని బెఫి నాయకులు ఎస్‌వి రమణ ప్రవేశపెట్టారు. సమ్మెను జయప్రదం చేసేందుకు చేపట్టాల్సిన ముందస్తు

మిగతా 5లో

ఆశా వర్కర్లు విజయలక్ష్మి, దుర్గ

రోడ్లు రక్తసిక్తం
- వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరు ఆశావర్కర్లు సహా తొమ్మిదిమంది మృతి

2

ఈ ఏడాది ముందుగానే తొలకరి

- 27న కేరళకు నైరుతి రుతుపవనాలు

న్యూఢిల్లీ : దేశవ్యాప్తంగా ఈ ఏడాది వర్షాలు ముందుగానే పలకరించనున్నాయి. ఈ నెల 27న నైరుతి రుతుపవనాలు కేరళను తాకనున్నట్లు భారత వాతావరణ శాఖ (ఐఎండి) శనివారం తెలిపింది. ఇదే జరిగితే 2009 తర్వాత ఈ ఏడాది తొలిసారి వర్షాకాలం ముందుగా వచ్చినట్లవుతుందని ఐఎండి వెల్లడించింది. 2009 సంవత్సరంలో మే 23న నైరుతీ కేరళను తాకాయి. సాధారణంగా జూన్ ఒకటో తేదీ సమయానికి కేరళలోకి నైరుతీ రుతుపవనాలు ప్రవేశిస్తాయి. ఈ రుతుపవనాల వల్లే దేశంలో వర్షాకాలం ప్రారంభం అవుతుంది. అనంతరం జులై 8లోగా దేశవ్యాప్తంగా రుతుపవనాలు విస్తరిస్తాయి. సెప్టెంబర్ 17 నుంచి ఆగ్నేయ దిశ నుంచి తిరోగమనం అవుతాయి. అక్టోబర్ 15లోగా పూర్తిగా ఆ రుతుపవనాలు వెళ్లిపోతాయి. 2025 వర్షాకాలంలో.. సాధారణం కన్నా అధికంగానే వర్షం కురుస్తుందని ఏప్రిల్‌లో ఐఎండీ వివరించిన సంగతి విదితమే. ఎల్ నినో పరిస్థితులు ఉండబోవని ఐఎండీ పేర్కొన్నది. జూన్ నుంచి సెప్టెంబర్ వరకు ఈసారి నాలుగు నెలల్లో వర్షపాతం సాధారణ స్థాయి కన్నా ఎక్కువే ఉంటుందని ఎర్త్ సైన్సెస్ శాఖ కార్యదర్శి ఎం రవిచంద్రన్ తెలిపారు.

ఉగ్రవాదంపై ఐక్యపోరు

- సర్వ మత ప్రతినిధుల సమావేశంలో గవర్నర్
- కాల్పుల విరమణ శుభపరిణామం : చంద్రబాబునాయుడు
- మానవత్వానికే తొలి ప్రాధాన్యత : పవన్‌కల్యాణ్

మురళీనాయక్ మృతికి నివాళులర్పిస్తున్న గవర్నర్ అబ్దుల్ నజీర్, సిఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ప్రపంచానికి ముప్పుగా మారిన ఉగ్రవాదంపై కుల, మతాలకు అతీతంగా ఐక్య పోరు చేయాలని గవర్నర్ అబ్దుల్ నజీర్ పిలుపునిచ్చారు. అన్ని మతాలకు చెందిన ప్రతినిధులతో రాజ్‌భవన్‌లో శనివారం సాయంత్రం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ ఏప్రిల్ 22న పహల్గాంలో ఉగ్రవాదులు చేసిన దాడి, అనంతరం చోటుచేసుకున్న పరిణామాలను వివరించారు. సరిహద్దుల్లో దేశం కోసం పోరాడుతున్న సైనికులకు అండగా ఉండాలని అన్నారు. ప్రపంచాన్ని ఉగ్రవాదం పీడిస్తోందని, అందరూ కలిసి దీనిని అడ్డుకోవాలని కోరారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మాట్లాడుతూ రాష్ట్రంలో మత విద్వేషాలకు తావు లేదని అన్నారు. అన్ని మతాలకు చెందినవారు ధృడమైన ఐక్యతతో ఉన్నారని చెప్పారు. ఉగ్రవాదం ఎక్కడున్నా దేశంలో తీవ్ర అనిశ్చిత పరిస్థితికి దారితీస్తుందని తెలిపారు. సరిహద్దుల్లో జరుగుతున్న పోరాటంలో రాష్ట్రానికి చెందిన జవాను మురళీనాయక్ మరణించారని చెబుతూ ఆయనకు నివాళులర్పించారు. పాకిస్తాన్ నుండి వచ్చిన విరమణ ప్రతిపాదనను ఒప్పుకోవడం చూస్తే మన దేశానికి యుద్ధం చేయాలన్న ఆలోచన ఎప్పుడూ లేదన్న విషయం అర్థమవుతోందని చెప్పారు. కాల్పుల విరమణ శుభపరిణామమని ఆయన చెప్పారు. ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ మాట్లాడుతూ భారతదేశం సహనానికి మారుపేరని తెలిపారు. ఎన్ని, మతాలు కులాలు ఉన్నా మొదటి ప్రాధాన్యత మానవత్వానికే అని అన్నారు. దేశాన్ని విడగొట్టడానికి అనేక రకాల శక్తులు ప్రయత్నిస్తుంటాయని, వాటిని ఐక్యంగా ఎదుర్కొంటామని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ మాట్లాడుతూ దేశ రక్షణకు అవసరమైన విధంగా కేంద్రానికి సంపూర్ణ సహకారం ఇస్తామన్నారు. డిజిపి హరీష్‌కుమార్ గుప్తా మాట్లాడుతూ రాష్ట్రంలో తీసుకుంటున్న రక్షణ చర్యలను వివరించారు. తొలుత వేర్వేరు, మతాలు, సంస్థలకు చెందిన ప్రతినిధులు మాట్లాడుతూ ఉగ్రవాదంపై పోరులో ఏకతాటిపై ఉంటామని తెలిపారు. ఈ సమావేశంలో హోంశాఖ మంత్రి అనిత కూడా పాల్గొన్నారు.

స్వగ్రామానికి జవాన్ భౌతికకాయం

నేడు కల్లితండాలో మురళీనాయక్ అంత్యక్రియలు

ప్రజాశక్తి- అనంతపురం ప్రతినిధి

పాక్ కాల్పుల్లో వీర మరణం పొందిన మురళీ నాయక్ భౌతికకాయం శనివారం రాత్రి ఆయన స్వగ్రామమైన శ్రీసత్యసాయి జిల్లా గోరంట్ల మండలం కల్లితండాకు చేరుకుంది. అంతకుముందు బెంగళూరు విమానాశ్రయంలో సైనిక గౌరవ వందనం అనంతరం భౌతికకాయాన్ని మంత్రి సవితమ్మ, అధికారులకు అందజేశారు. అక్కడి నుంచి రోడ్డు మార్గంలో కల్లితండాకు తరలించారు. కుటుంబసభ్యులు, బంధువుల రోదనలు మిన్నంటాయి. చిన్న వయస్సులోనే తమ కుమారుడి మృతిని తల్లిదండ్రులు జీర్ణించుకోలేకపోయారు. భౌతికకాయాన్ని చూసేందుకు సమీప గ్రామాల ప్రజలు, స్నేహితులు, సన్నిహితులు భారీగా తరలివచ్చారు. తమతో ఉన్న అనుబంధాన్ని సన్నిహితులు గుర్తు చేసుకున్నారు. మురళీ నాయక్ కుటుంబాన్ని మహారాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి ఉదయ్ సంపత్ పరామర్శించారు. మహారాష్ట్ర ఉపముఖ్యమంత్రి ఏక్‌నాథ్ సిండేతో వీడియో కాల్‌లో మాట్లాడించారు. రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత రెండు లక్షల రూపాయలు ఆర్థిక సహాయం అందజేశారు. భౌతికకాయాన్ని కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు , కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్, మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్.రాజు, హిందూపురం ఎంపి బికె.పార్థసారథి, ప్రముఖ సింగర్ మంగ్లి సందర్శించారు. ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, విద్యా శాఖ మంత్రి నారా లోకేష్, సత్యసాయి జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి, రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్‌లతోపాటు పలువురు ప్రముఖులు ఆదివారం అంత్యక్రియలకు హాజరు కానున్నారు ఈ నేపథ్యంలో పోలీసులు భారీ భద్రతా ఏర్పాట్లు చేపట్టారు.

బెంగళూరు ఎయిర్ పోర్టు నుండి స్వగ్రామానికి మురళీ నాయక్ పార్థివదేహాన్ని తరలిస్తుండగా దారి పొడవునా నివాళులర్పిస్తున్న ప్రజలు

నేడు అంత్యక్రియలు

ఆదివారం ఉదయం ఆరు గంటల నుంచి ఎనిమిది గంటల వరకు సామాన్య ప్రజల సందర్శనార్థనం మురళీనాయక్ భౌతికకాయాన్ని ఉంచుతారు. ఉదయం తొమ్మిది గంటల నుంచి 9.30 గంటల వరకు మిలిటరీ శర్మనీ, అనంతరం అంతిమయాత్ర ప్రారంభమవుతుంది. మధ్యాహ్నం 12 గంటల నుంచి 12.30 గంటల మధ్య మిలటరీ అధికారులు మురళీనాయక్ కుటుంబ సభ్యులకు జాతీయ పతాకాన్ని అందజేస్తారు. అనంతరం కుటుంబసభ్యులు అంత్యక్రియలు నిర్వహించనున్నారు.

యథేచ్ఛగా లేటరైట్ తవ్వకాలు
- భారీ వాహనాలతో తరలింపు
- అధికార పార్టీ నాయకుని అండ!
- చోద్యం చూస్తోన్న అధికార యంత్రాంగం

అదాని గంగవరం పోర్టు విఆర్‌ఎస్ కార్మికుల ఆందోళన

జానపదంతో 'సామాజిక చైతన్యం'
- ముగిసిన 'మనపల్లె జానపదం జాతర'

3

టిడిపి కార్యాలయంలో గ్రీవెన్స్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

టిడిపి కార్యాలయంలో గ్రీవెన్స్ జరిగింది. మాజీ మంత్రి కిడారి శ్రావణ్‌కుమార్, ఎపిఐడిసి ఛైర్మన్ డేగల ప్రభాకర్ ప్రజల నుంచి శనివారం ఫిర్యాదులు స్వీకరించారు. తమకు వారసత్వంగా వచ్చిన ఆస్తిని ఆక్రమించుకోవాలని కొంతమంది చూస్తున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని ఏలూరు జిల్లా, బుట్టాయిగూడెం మండలం, దొరమామిడి గ్రామానికి చెందిన యంత్రప్రగడ సత్యనారాయణ ఫిర్యాదు చేశారు. ఇల్లు మంజూరు చేయాలని ప్రకాశం జిల్లాకు చెందిన ముక్కర ముత్తయ్య, తన పిల్లలకు ఉద్యోగం ఇప్పించాలని తిరుపతి జిల్లాకు చెందిన జి నిర్మల కోరారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని శ్రావణ్‌కుమార్, ప్రభాకర్ బాధితులతో అన్నారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..

స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ,
ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ,
అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి,
గుంటూరు జిల్లా - 522 501కు కానీ
editorprajasakthi@gmail.comకు
పంపవచ్చు.

కాల్వల మరమ్మతులపై మీనమేషాలు

- కృష్ణాడెల్టాలో ప్రతిపాదిత పనులకు లభించని ఆమోదం
- ఆందోళనలో రైతాంగం

ప్రజాశక్తి - కృష్ణా ప్రతినిధి

పుల్లేరులో పేరుకుపోయిన తూడు, గుర్రపుడెక్క

కృష్ణాడెల్టాలో కాల్వలు, డ్రెయిన్లు అధ్వానంగా మారాయి. వీటిల్లో తూడు, గుర్రపుడెక్క పెద్దఎత్తున పేరుకుపోయింది. నిర్వహణ పనులకు ప్రభుత్వం ఆమోదం తెలపకపోవడం సమస్యగా మారింది. అధికారులు రెండు నెలల క్రితం పంపిన ప్రతిపాదనలకు ఇప్పటికీ ఆమోదం లభించలేదు. సకాలంలో నీరు విడుదల చేసినా కాల్వల ఎగువ ప్రాంతాలకు మాత్రమే నీరు అందుతుందని, శివారు భూముల్లో నాట్లు వేయడానికి ఆలస్యం అవుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

బందరు కాల్వ 1.51 లక్షల ఎకరాలకు, కృష్ణా ఈస్ట్రన్ డెల్టా కెనాల్ (కెఇబి) 1.38 లక్షల ఎకరాలకు, ఏలూరు కాల్వ 0.56 లక్షల ఎకరాలకు, రైవస్ 2.17 లక్షల ఎకరాలకు సాగునీరు అందిస్తాయి. మొత్తం డెల్టాలోని 5.62 లక్షల ఎకరాలకు ప్రధాన కాల్వలు, వాటి ఉప కాల్వల ద్వారా సాగునీరు అందుతోంది. అయితే ఈ ఏడాది సకాలంలో కాల్వలు, డ్రెయిన్ల నిర్వహణా పనులు పూర్తి చేయకపోవడంతో రైతులు ఆందోళన చెబుతున్నారు. వీటి పనులకు ప్రజాప్రతినిధులు చెప్పిన మాటలు ఆచరణకు నోచుకోలేదు. కెసి డివిజన్లో 144 పనులకు రూ.7.48 కోట్లు, కెఇ డివిజన్లో 121 పనులకు రూ.8.45 కోట్లు, స్పెషల్ డివిజన్లో 15 పనులకు రూ.1.30 కోట్లు, డ్రెయిన్లపై 304 పనులకు రూ.తొమ్మిది కోట్ల మేర ప్రతిపాదలను జనవనరుల శాఖ రెండు నెలల క్రితం ప్రభుత్వానికి పంపింది. అయితే ఆ ప్రతిపాదలను ప్రభుత్వం ఇప్పటికీ ఆమోదించలేదు.

నామినేషన్ పద్ధతిలో పనులు !

ప్రస్తుత సీజన్ జూన్‌లో పంటల సాగుకు నీరు విడుదల చేసేలా చూస్తామని ప్రజాప్రతినిధులు చెబుతున్నారు. కాల్వల నిర్వహణ పనులకు వేసవి కాలం అనుకూలమైనది. అయితే మే 10వ తేదీ వచ్చినా కాల్వల మరమ్మతులకు ఆమోదం లభించలేదు. మొత్తం రూ.26.23 కోట్ల విలువైన పనులకు ఎటువంటి టెండర్లూ పిలవడం లేదు. ప్రజాప్రతినిధులు సూచించిన వారికి నామినేషన్ పద్ధతిలోనే కేటాయిస్తున్నారు.

కాల్వలకు నీరు విడుదలవ్వక ముందు, వర్షాలు కురువక ముందు పనులు పూర్తి చేస్తే ఆ పనుల నాణ్యతను పరిశీలించే అవకాశం ఉంటుంది. కానీ ఇప్పటికే ఆలస్యం కావ్వడంతో హడావుడిగా చివరి నిమిషంలో పనులు చేపట్టి తూతూమంత్రంగా మమ అనిపిస్తారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

నీరు పారేదెలా?

కాల్వల కనీస నిర్వహణ పనులు సకాలంలో జరగకపోవడంతో ప్రతి ఏటా రైతులు సమస్యలను ఎదుర్కొంటున్నారు. జూన్ చివరి వారంలో కాల్వలకు నీరు విడుదలైనా శివారు భూముల్లో సెప్టెంబర్ మొదటి వారానికి ఆలస్యంగా వరి నాట్లు వేయాల్సి వస్తోంది. కొన్ని ప్రాంతాల్లో ఆయిల్ ఇంజన్లతో నీటిని తోడుకోవాల్సి వస్తుండడంతో రైతులకు అదనపు భారం పడుతోంది. ఈఏడాది ప్రధాన కాల్వలతోపాటు ఉప కాల్వలు గుర్రపుడెక్క, తూడు, మట్టితో పూడిపోయాయి. వేసవి సీజన్లో తాగునీటి చెరువులు నింపడమే గగనంగా మారింది. గ్రామ పంచాయతీల వారు ఎక్కడికక్కడ విద్యుత్ మోటార్లు, ఆయిల్ ఇంజన్లు ఏర్పాటు చేసుకుని కాల్వల్లోని నీటిని తోడి చెరువులు నింపారు. ఈ పరిస్థితుల్లో సకాలంలో డెల్టాకు సాగునీరు అందడంపై రైతులు సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల కాల్వల మరమ్మతులు చేపట్టాలని పలువురు రైతులు ప్రజా సమస్యల పరిష్కార వేదిక (మీ కోసం)లో వినతులు సమర్పించారు.

దీక్షా శిబిరంలో నినాదాలు చేస్తున్న జివిఎంసి కార్మికులు

ప్రయివేటీకరణతో తీవ్ర నష్టం

- జివిఎంసి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్

ప్రజాశక్తి - కలెక్టరేట్ (విశాఖపట్నం)

ప్రభుత్వ రంగ సంస్థలను ప్రయివేటుపరం చేస్తే తీవ్ర నష్టం జరుగుతుందని, రిజర్వేషన్లకు విఘాతం కలుగుతుందని జివిఎంసి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) అధ్యక్షులు టి.నూకరాజు, ప్రధాన కార్యదర్శి ఉరుకూటి రాజు, గాజువాక జోన్ ప్రధాన కార్యదర్శి గొలగాని అప్పారావు అన్నారు. స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తూ విశాఖ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద విశాఖ అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఎసి ఆధ్వర్యాన జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు శనివారమూ కొనసాగాయి. దీక్షల్లో జివిఎంసి కార్మికులు కూర్చున్నారు. వారినుద్దేశించి నాయకులు మాట్లాడుతూ కార్మికుల శ్రేయస్సు, దేశ రక్షణ కోసం ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడుకోవాల్సిన అవసరం ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. దేశాభివృద్ధిలో కీలకపాత్ర పోషించిన వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను కార్పొరేట్లకు అప్పగించాలని కుట్రలు పన్నడం దారుణమన్నారు. ప్రజల ఆకాంక్షను గుర్తించి ప్రధాని మోడీ తన నిర్ణయాన్ని మార్చుకోవాలని కోరారు. ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించి, పూర్తి ఉత్పత్తి సామర్థ్యంతో నడపాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఐక్య పోరాటాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ముద్దాడ ప్రసాద్, శేషు, ఎం.ఈశ్వరరావు, కిరణ్ పాల్గొన్నారు.

కాశ్మీర్ నుంచి ఎపి భవన్‌కు 41 మంది విద్యార్థులు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ప్రస్తుత ఉద్రిక్తత పరిస్థితుల నేపథ్యంలో కాశ్మీర్‌లో చదువుతున్న ఆంధ్రప్రదేశ్‌కు చెందిన 41 మంది విద్యార్థులు ఢిల్లీలోని ఎపి భవన్‌కు చేరుకున్నారు. వారు తమ స్వస్థలాలకు చేర్చేందుకు ఎపి భవన్ చర్యలు చేపడుతుంది. కాశ్మీర్ నుంచి విద్యార్థులు వచ్చేందుకు కూడా ఏపి భవన్ అధికారులే అన్ని రకాల సహాయసహకారాలు అందించారు. 41 మంది విద్యార్థుల్లో ఐదుగురు విద్యార్థులు ఇప్పటికే ఢిల్లీ నుంచి ఎపిలోని తమ స్వస్థలాలకు బయలుదేరారు. మిగిలిన విద్యార్థులకు ఎపి భవన్ వసతి, భోజనం, రవాణా సదుపాయాలను కల్పిస్తోంది. ఆంధ్రప్రదేశ్ ప్రజల సౌకర్యార్థం ఏపి భవన్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు. సంబంధిత సమాచారం, సహాయం కోసం 24 గంటల పాటు పనిచేసే కంట్రోల్ రూమ్‌ను సంప్రదించాలని అధికారులు కోరారు. ఫోన్ నెంబర్ 011-23387089, మొబైల్ నెంబర్లు 9871999430, 9871999053 సంప్రదించాలని సూచించింది. అదనపు సమాచారం కోసం డిప్యూటీ కమిషనర్ ఎం.వి.ఎస్ రామారావు (9871990081), లైజన్ ఆఫీసర్ వి.సురేష్ బాబు (9818395787) సంప్రదించవచ్చని ఎపి భవన్ తెలిపింది.

బాపట్ల జిల్లా పర్చూరు మండలంలో జరిగిన ప్రమాదంలో మరణించిన తాళ్లూరి ప్రభుదాస్, పాలపర్తి శ్రీను, తమ్ములూరి సురేంద్ర బాబు

రోడ్లు రక్తసిక్తం

- వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరు ఆశా వర్కర్లు సహా తొమ్మిదిమంది మృతి

ప్రజాశక్తి- యంత్రాంగం

రాష్ట్రంలో శనివారం రోడ్లు రక్తసిక్తమయ్యాయి. వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు ఆశా వర్కర్ల సహా తొమ్మిది మంది మృతి చెందారు. పలువురికి గాయాలయ్యాయి. పోలీసుల కథనం ప్రకారం... కృష్ణా జిల్లా మచిలీపట్నం రైల్వే స్టేషన్ సమీపంలోని శుభం కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన సదస్సులో పాల్గొనేందుకు వివిధ గ్రామాలకు చెందిన ఆశా వర్కర్లు ఆటోలో బయలుదేరారు. తరకటూరు వద్ద వారి ఆటోను కారు వెనుక నుండి బలంగా ఢీకొంది. దీంతో, ఆటో అదుపు తప్పి రోడ్డుపై పల్టీలు కొట్టింది. ఆటోలో ప్రయాణిస్తున్న ఆశా వర్కర్లు పమిడిముక్కల మండలం గోపువానిపాలెం గ్రామానికి చెందిన తాడేపల్లి విజయలక్ష్మి (45), తాడంకి గ్రామానికి చెందిన ఊటుకూరి దుర్గ (40) అక్కడికక్కడే మృతి చెందారు. మరో నలుగురు ఆశా వర్కర్లు, ఆటో డ్రైవర్ తీవ్రంగా గాయపడ్డారు.

టైల్స్ లోడ్‌తో గుంటూరు వెళ్తున్న లారీ ఎదురుగా వస్తున్న టిప్పరును తప్పించబోయి అదుపుతప్పి బాపట్ల జిల్లా పర్చూరు మండల పరిధిలోని తిమ్మరాజుపాలెం గ్రామ సమీపంలో జాతీయ రహదారిపై బోల్తా పడింది. లారీపై కూర్చొన్న ముగ్గురు కార్మికులపై టైల్స్ పడ్డారు. దీంతో, పర్చూరు మండలం నూతలపాడు గ్రామానికి చెందిన తమ్ములూరి సురేంద్ర బాబు (30), మార్టూరుకు చెందిన తాళ్లూరి ప్రభుదాస్ (27), పాలపర్తి శ్రీను (28) మృతి చెందారు.

శ్రీసత్యసాయి జిల్లా బత్తలపల్లి అవుటర్ రింగ్ రోడ్ వై.జంక్షన్ సమీపంలో కారు అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఆ కారులోని అనంతపురం జిల్లా కళ్యాణదుర్గం పట్టణానికి చెందిన రాజశేఖర్‌రెడ్డి (45), ఆయన కుమారుడు యస్విత్‌రెడ్డి (7) మృతి చెందారు. ఎనిమిది మంది గాయపడ్డారు. కళ్యాణదుర్గానికి చెందిన మూడు కుటుంబాలు కలిసి ఒకే కారులో తిరుమల వెళ్తుండగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది.

కృష్ణా జిల్లా బాపులపాడు మండలం వీరవల్లి వద్ద జాతీయ రహదారిపై కారు అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొని రోడ్డు అవతలకు దూసుకెళ్లి ఎదురుగా వస్తున్న మరో కారును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో హనుమాన్ జంక్షన్‌కు చెందిన మూడేళ్ల ధీరజ్ (37), చీన నవీన్ (35) మరణించారు. ఇద్దరు చిన్నారులకు తీవ్ర గాయాలయ్యాయి. కారు టైరు పేలడమే ఈ ప్రమాదానికి కారణమని చెబుతున్నారు.

ర్యాంపుపై తమ దేశ జాతీయ జెండాలతో పోటీదారులు

నిరసనల నడుమ మిస్‌వరల్డ్ పోటీలు ప్రారంభం

- సైనికుల ధైర్య సాహసాలకు సెల్యూట్
- 31న ఫైనల్స్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

మహిళా సంఘాల నిరసనల నడుమ హైదరాబాద్‌లోని గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో 72వ మిస్ వరల్డ్ పోటీలు శనివారం ప్రారంభమయ్యాయి. 110కి పైగా దేశాల నుంచి సుందరీమణులు వచ్చారు. ప్రారంభోత్సవం సందర్భంగా ప్రధాన వేదికపై తెలంగాణ రాష్ట్ర సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా కళారూపాలను ప్రదర్శించారు. ఒగ్గుడోలు, లంబాడా, గుస్సాడి, కొమ్ము కోయ కళాకారులతో పాటు 250 మంది పేరిణి నృత్య కళాకారుల అభినయాలు ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. అనంతరం పోటీల్లో పాల్గొంటున్న వివిధ దేశాల మహిళా ప్రతినిధులు తమ దేశాల సంస్కృతి, సంప్రదాయాలను గుర్తుచేస్తూ ర్యాంప్‌పైకి వచ్చారు. కరేబియన్ లాటిన్ అమెరికా, ఆఫ్రికా ఖండం నుంచి అంగోలా, యూరప్ ఖండం నుంచి అల్బేనియా దేశాలకు చెందిన పోటీదారులు తొలి మూడు వరుసల్లో ర్యాంప్‌పైకి వచ్చారు. అనంతరం ఇతర దేశాల పోటీదారులు ర్యాంప్‌పై తమ దేశాలకు చెందిన ఆహార్యాలు, సంప్రదాయాలను గుర్తుచేస్తూ, ప్రదర్శనలు ఇచ్చారు. చివరగా మిస్ ఇండియా నందిని గుప్తా జాతీయ పతాకాన్ని చేతపట్టి ర్యాంప్‌పైకి వచ్చారు ఆమెను చూడగానే సభికులు హర్షధ్వానాలు పలికారు. మిస్ నేపాలీ కాంటెస్టెంట్ చీరకట్టుతో ర్యాంప్‌పైకి రావడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ప్రారంభవేడుకలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆతిధ్య రాష్ట్రం తెలంగాణకు ప్రస్తుత మిస్ వరల్డ్ క్రిష్టినా అభినందనలు తెలిపారు. అంతకుముందు, సరిహద్దుల్లో దేశంకోసం పోరాడుతున్న సైనికుల ధైర్య సాహసాలకు సెల్యూట్ చేస్తున్నట్టు నిర్వాహకులు ప్రకటించారు. ప్రపంచ శాంతి, ఐక్యతకు ఈ పోటీలు దోహదం చేస్తాయని తెలిపారు. అనంతరం మిస్ వరల్డ్ పోటీలను ప్రారంభిస్తున్నట్టు సిఎం అధికారికంగా ప్రకటించారు. జాతీయ గీతం, మిస్ వరల్డ్ గీతం ఆలపించారు. జాతీయ, అంతర్జాతీయ మీడియా సంస్థల కోసం వేదిక వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. 110 దేశాలకు చెందిన కంటెస్టెంట్లు తమ దేశాల జాతీయ పతాకాలతో ఒకేసారి వేదికపైకి వచ్చారు. ఆదివారం నుంచి నిర్వాహకులు పలు దశల్లో పోటీలు నిర్వహిస్తారు. మే 31న జరిగే ఫైనల్స్‌లో మిస్ వరల్డ్‌ను ప్రకటిస్తారు. ప్రస్తుత ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో మిస్ వరల్డ్ పోటీలు జరుగుతున్న స్టేడియం వద్ద పోలీసులు కట్టుదిట్టంగా భద్రతా ఏర్పాట్లు చేశారు.

గచ్చిబౌలి స్టేడియం బయట ఆందోళన చేస్తున్న మహిళా సంఘాల నాయకులను అరెస్టు చేస్తున్న పోలీసులు

స్త్రీల వ్యక్తిత్వాన్ని గౌరవించరా?

- అందాల పోటీల ద్వారానే తెలంగాణ సంస్కృతి వెల్లివిరుస్తుందా?
- కాయకష్టం చేసే మహిళలను గౌరవించరా?
- ఆరోగ్య, మానసిక ప్రశాంతతతోనే అందం
- ఎస్‌వికె వెబినార్‌లో ఐద్వా జాతీయ కోశాధికారి పుణ్యవతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సౌందర్య సరుకులు ఉత్పత్తి చేస్తున్న కంపెనీల మార్కెట్ కోసమే ప్రపంచ అందాల పోటీలు జరుగుతున్నాయని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) జాతీయ కోశాధికారి ఎస్. పుణ్యవతి విమర్శించారు. అందాల పోటీలపై ఆసక్తి పెంచి, తమ ఉత్పత్తులను మార్కెట్ చేసుకుంటున్నారని విమర్శించారు. 2012-13లో రూ. 41 కోట్ల ఉత్పత్తులు అమ్ముడుపోగా, 2017లో రూ.80 కోట్ల ఆదాయాన్ని పెంచుకున్నాయని గుర్తు చేశారు. 2026లో ఆదాయాన్ని మరో 40 శాతాన్ని పెంచుకునే అవకాశం ఉందని లెక్కలు చెబుతున్నాయన్నారు. మహిళల్లో ఆత్మన్యూనతా భావాన్ని పెంచి ఆయా కంపెనీలు సొమ్ము చేసుకుంటున్నాయని విమర్శించారు. 'అందాల పోటీలు అవసరమా? అనే అంశంపై నిర్వహించిన ఎస్‌వికె ఆధ్వర్యంలో వెబినార్‌లో పుణ్యవతి మాట్లాడారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను అందాల పోటీల ద్వారా ప్రపంచానికి తెలియజేస్తారా? అని ప్రశ్నించారు. తెలంగాణ సాయుధ పోరాటంలో మహిళలు ప్రాణాలకు తెగించి కొట్లాడారని గుర్తు చేశారు. వీరనారి ఐలమ్మ, మల్లు స్వరాజ్యం, ఆరుట్ల కమలాదేవి వంటి తదితర వీరవనితలెందరో త్యాగాలు చేశారని తెలిపారు. ఆ చరిత్రను మరచిపోయారా? అని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఆనాటి పాలకులు స్త్రీలను అనేక రకాలుగా అవమానించారనీ, హింసకు గురి చేశారని తెలిపారు. ఆ చరిత్రను వెలికి తీయొచ్చు కదా? అని అభిప్రాయపడ్డారు. చేనేతకు మార్కెట్ బాగా ఉందన్నారు. చేనేతకు నూలు, రంగులు, పరికరాలు, సబ్సిడీలు, వారికి గూడు వంటి సౌకర్యాలు కల్పిస్తే చేనేత రంగం వెల్లివిరుస్తుందని వివరించారు. చేనేతకు ప్రజల్లో ఆదరణ పెరుగుతుందనీ, దాన్ని ప్రోత్సహించాలని కోరారు. డ్వాక్రా మహిళలకు అభయహస్తం డబ్బులు విడుదల చేస్తే, వారే చేనేత వస్త్రాలు కొనుగోలు చేస్తారని సూచించారు. ఉపాధి కార్మికులకు ఏడాదికి 200 రోజుల పని, రూ.600 కూలీ ఇవ్వడం ద్వారా వారిలో కొనుగోలు శక్తి పెరుగుతుందన్నారు. తద్వారా చేనేత రంగం అభివృద్ధి అవుతుందే తప్ప అందాల పోటీల వల్ల కాదని స్పష్టం చేశారు. ఈ పోటీలతో స్త్రీల వ్యక్తిత్వాన్ని కించపరచడమేనన్నారు. తెలంగాణలో పరువు హత్యల పేరిట జంటలను చంపేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఏ సంస్కృతి నుంచి ఏ సంస్కృతికి దిగజారుస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళల్లో పెరుగుతున్న క్యాన్సర్‌పై అవగాహన కల్పించేందుకు అందాల పోటీలు ఉపయోగపడుతాయని చెప్పడం అవివేకమన్నారు. పాఠశాలలు, కళాశాలలు, విశ్వవిద్యాలయాల్లో అధికార యంత్రాంగం క్యాన్సర్‌పై ప్రచారాన్ని చేయొచ్చు కదా? అని సూచించారు. అందాల పోటీల్లో విజయం సాధించిన స్త్రీలు ఆయా కంపెనీల ఉత్పత్తులకు ప్రచారకర్తలుగా మారుతారు తప్ప మరో ఉపయోగం లేదన్నారు. సుస్మితా సేన్, ఐశ్వర్యరాయ్ సినిమా రంగంలో ఉన్నారని గుర్తు చేశారు. అందం అంటే కొలతలు కాదన్నారు. వ్యవసాయ రంగంలో 80 శాతం పని మహిళలే చేస్తున్నారని, కాయకష్టం చేసే మహిళలను గౌరవించరా? అని వ్యాఖ్యానించారు. అందాల పోటీల ద్వారా సౌందర్య సాధనాల అమ్మకాలే కాదనీ, నగలు, దుస్తులు, హెయిర్‌స్టైల్ డిజైన్లలకు మార్కెట్ పెంచుతున్నారని చెప్పారు. అందం, అలంకరణ, సౌందర్యం పట్ల క్రేజీ పెంచడం, మార్కెట్ పెంచుకోవడం ఆదాయాన్ని రెట్టింపు చేసుకోవడం అనేది అంతర్గత రహస్యమని చెప్పారు. మారుతున్న పరిస్థితుల్లో పేద, ధనిక అన్న తేడా లేకుండా మహిళల్లో బిపి, షుగర్లు పెరుగుతున్నాయనీ, వాటికి మందులు, పరికరాలు చౌకగా అందించాల్సిన అవసరం లేదా? అని అభిప్రాయపడ్డారు. మహిళల ఆరోగ్యం, మానసిక ప్రశాంతను పెంచేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. మహిళా సంఘాల ఉద్యమాన్ని దృష్టిలో ఉంచుకుని ఇప్పటికైనా అందాల పోటీలను విరమించుకోవాలని డిమాండ్ చేశారు.

తగ్గిన విదేశీ మారకం నిల్వలు

న్యూఢిల్లీ : గత కొన్ని వారాలుగా పెరుగుతూ వచ్చిన భారత విదేశీ మారకం నిల్వలు మళ్లీ కరిగిపోయాయి. మే 2తో ముగిసిన వారాంతానికిగాను ఫారెక్స్ రిజర్వులు 2.065 బిలియన్ డాలర్లు తరిగిపోయి 684.064 బిలియన్ డాలర్లకు పరిమితమయ్యాయని రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా తెలిపింది. అంతక్రితం వారంలో 1.983 బిలియన్ డాలర్లు పెరిగాయి. బంగారం రిజర్వులు 2.545 మిలియన్ డాలర్లు తగ్గి 81.82 బిలియన్ డాలర్లకు పరిమితం అయ్యాయి. ఐఎంఎఫ్ వద్ద రిజర్వులు 4.509 బిలియన్ డాలర్లకు తగ్గిపోయాయి.

బిఒఐ లాభాలు 82 శాతం వృద్ధి

న్యూఢిల్లీ : ప్రభుత్వ రంగంలోని బ్యాంక్ ఆఫ్ ఇండియా (బిఒఐ) మెరుగైన ఆర్థిక ఫలితాలు సాధించింది. గడిచిన ఆర్థిక సంవత్సరం (2024-25) మార్చితో ముగిసిన నాలుగో త్రైమాసికం (క్యూ4)లో 82 శాతం వృద్ధితో రూ.2,626 కోట్ల నికర లాభాలు ప్రకటించింది. బిఒఐ కీలక నికర వడ్డీ ఆదాయం 2 శాతం పెరిగి రూ.6,063 కోట్లుగా నమోదు చేసింది. ఇతర ఆదాయం దాదాపు రెట్టింపై 96 శాతం పెరిగి రూ.3,428 కోట్లకు చేరింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రుణాల జారీలో 12-13 శాతం, డిపాజిట్లలో 11-12 శాతం వృద్ధి సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని బిఒఐ సిఇఒ, ఎండి రజ్నీష్ పేర్కొన్నారు.

ఊపిరి పీల్చుకున్నాం

- డ్రోన్లను చాలా వరకూ ధ్వంసం చేశారు
- నిట్ ప్రొఫెసర్ శ్రీనివాస్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

కాల్పుల విరమణ నిర్ణయంతో ఊపిరి పీల్చుకున్నామని, మూడు రోజులుగా నిద్రలేని రాత్రులు గడిపామని నిట్ జలంధర్ యూనివర్సిటీ మెకానికల్ విభాగం హెడ్ విజయవాడకు చెందిన శ్రీనివాస్ తెలిపారు. కాల్పుల విరమణ తర్వాత ప్రజాశక్తితో మాట్లాడిన ఆయన శనివారం సాయంత్రం ఐదు గంటల నుండి జలంధర్లో సాధారణ జీవనం కొనసాగిందని పేర్కొన్నారు. జలంధర్ చుట్టుపక్కల బాంబింగ్ జరిగిందని, రాత్రిళ్లు బాంబుల శబ్దాలు, విద్యుత్ కూడా లేకపోవడంతో మూడు రోజులుగా ఎవరికీ నిద్రలు లేవని పేర్కొన్నారు. ముందు జాగ్రత్తగా జలంధర్లో ఉన్న ఇతర ప్రాంతాల విద్యార్థులను, ఇతరులను పంపించేశారని చెప్పారు. నిట్ జలంధర్తోపాటు లవ్లీ ప్రొఫెషనల్ యూనివర్సిటీ విద్యార్థుల్లో ఎక్కువ మంది తెలుగువారు ఉన్నారని వివరించారు. వారందరినీ మూడురోజులు ముందుగానే స్వస్థలాలకు పంపించేశారని పేర్కొన్నారు. అత్యవసర సమయంలో విమాన ప్రయాణం ధరలు ఎక్కువగా ఉన్నాయని, దీంతో బస్సులు, రైలు మార్గాల ద్వారా వారంతా ఢిల్లీ చేరుకున్నారని చెప్పారు. కొన్ని విమానయాన సంస్థలు ఢిల్లీ నుండి హైదరాబాద్‌కు టికెట్లు పెంచేసి రూ.60 వేలు వసూలు చేయడంతో ఇబ్బందులు పడ్డారని అన్నారు. ఎక్కువమంది విద్యార్థులు రైలు మార్గాన్ని ఎంచుకున్నట్లు వివరించారు. ప్రభుత్వ ఉద్యోగులుగా ఉండేవారందరినీ బాధ్యతగా ఇక్కడే ఉండాలని చెప్పడంతో ఉద్యోగస్తులందరం ఉండిపోయామని వివరించారు.

రాత్రి సమయాల్లో విద్యుత్ సరఫరా నిలిపేయడంతోపాటు ఇన్వెర్టర్లను వాడొద్దని, సిసి కెమెరాలూ ఆఫ్ చేయాలని స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారని తెలిపారు. సిసి కెమెరాల్లో లైట్లను కూడా డ్రోన్లు పసిగట్టే స్వభావం ఉండటంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు వివరించారు. శనివారం ఉదయం కూడా జలంధర్ చుట్టుపక్కల ప్రాంతాల్లోని పొలాల్లో బాంబులు పడ్డాయని, దీంతో ప్రాణనష్టం ఏమీ లేదని తెలిపారు. ఎక్కువశాతం డ్రోన్లను మిలటరీ ధ్వంసం చేసిందని, ఒకటీ అరా పడ్డట్లు తమకు సమాచారం ఇచ్చారని వివరించారు. జలంధర్లో ఉన్న యాంటీడ్రోన్ రక్షణ వ్యవస్థ అత్యంత సమర్థవంతంగా పనిచేసిందని తెలిపారు.

భద్రతా వలయంలో శ్రీహరికోట

ప్రజాశక్తి - సూళ్లూరుపేట

భారత్, పాక్ దేశాల మధ్య దాడుల నేపథ్యంలో శ్రీహరికోటలో భద్రతను మరింత కట్టుదిట్టం చేశారు. భద్రత దృష్ట్యా అణువణువు పర్యవేక్షిస్తున్నారు. శ్రీహరి కోటను భద్రతా సిబ్బంది తమ ఆధీనంలోకి తీసుకుంది. 70 మంది సిఐఎస్ఎఫ్ సిబ్బందితో శనివారం మాక్‌డ్రిల్ నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో సిఐఎస్ఎఫ్ డిఐజి సంజయ్ కుమార్, సీనియర్ కమాండెంట్ సంజిత్ కుమార్, డిప్యూటీ కమాండెంట్ ఎం.కె. గౌర్, సూళ్లూరుపేట సిఐ.మురళీకృష్ణ పాల్గొన్నారు.

కేంద్ర వైఖరితో పత్రికా స్వేచ్ఛకు ముప్పు

మొదటిపేజి తరువాయి

మార్గదర్శకులైన వారు ఆయా కంపెనీల్లో పని చేసే కార్మికులకు వేతనాలు పెంచి వారి నిజాయితీని నిరూపించుకోవాలన్నారు.

దీర్ఘకాలిక విద్యుత్ ఒప్పందాలను రద్దు చేయాలి : వి.శ్రీనివాసరావు

విద్యుత్ కొనుగోలు పేరిట రాష్ట్ర ప్రభుత్వం ప్రైవేటు కంపెనీలతో చేసుకుంటున్న దీర్ఘకాలిక ఒప్పందాలు ప్రజలపై తీవ్రమైన భారాలను మోపేవిగా ఉన్నాయని ఈ సమావేశంలో పాల్గొన్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అన్నారు. చంద్రబాబు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు సెకి ఒప్పందం వల్ల లక్షన్నర కోట్ల రూపాయల భారం ప్రజలపై పడుతుందని మాట్లాడారని, ఈ ఒప్పందానికి వ్యతిరేకంగా కేసులు వేశారని,యూనిట్‌ను రెండున్నర రూపాయలకు కొనడం ఏమిటన్నారని గుర్తు చేశారు. అధికారంలోకి వచ్చాక యూనిట్ విద్యుత్తును యాక్సిస్ ఎనర్జీ కంపెనీ నుంచి నాలుగున్నర రూపాయలకు కొనుగోలు చేయాలని ఒప్పందం చేసుకోవడం మోసగించడం కాదా? అని శ్రీనివాసరావు ప్రశ్నించారు. 25 సంవత్సరాలపాటు చేసుకున్న ఈ దీర్ఘకాల ఒప్పందాన్ని, సెకి ఒప్పందాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

లౌకిక స్వభావాన్ని కోల్పోతున్న టిడిపి

రోజురోజుకూ టిడిపి తన లౌకిక స్వభావాన్ని కోల్పోతోందని ఆయన అన్నారు కేంద్రంలోని బిజెపి ఏది చెబితే దానికి తందానా అంటోందని విమర్శించారు. పొగాకు రైతుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవటం లేదన్నారు. రాయలసీమ ప్రాంతంలో రైతుల పొలాలపై పడి ఏనుగులు తీవ్ర నష్టాన్ని కలగజేస్తున్నా పట్టనట్టు వ్యవహరిస్తుండడం అన్యాయమని తెలిపారు. అదాని కోసం విద్యుత్ స్మార్ట్ మీటర్ల పథకాన్ని వైసిపి ప్రతిపాదిస్తే ఎన్నికలకు ముందు టిడిపి తీవ్రంగా వ్యతిరేకించిందని, అదే మీటర్లను తిరిగి పెట్టించుకోవాలని వినియోగదారులపై టిడిపి కూటమి ప్రభుత్వం ఒత్తిడి తీసుకురావడం సమంజసం కాదన్నారు. ప్రభుత్వ విధానాలను ప్రశ్నిస్తూ రాబోయే రోజుల్లో పెద్ద ఎత్తున చేపట్టే ఉద్యమాలకు తిరుపతిలో జరిగిన రాష్ట్ర కమిటీ సమావేశాల్లో రూపకల్పన చేశామని చెప్పారు. రాష్ట్రంలో 2.80 లక్షల మంది పేదలు ఇళ్ల పట్టాల కోసం నిరీక్షిస్తున్నారని తెలిపారు. ఒక్క మంగళగిరి నియోజకవర్గంలోనే కాదు... రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న పేదలందరికీ ఇళ్ల పట్టాలు అందజేయాలని డిమాండ్ చేశారు. మీడియా సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు, కార్యదర్శివర్గ సభ్యులు కందారపు మురళి పాల్గొన్నారు.

సానుకూలంగా స్టాక్ మార్కెట్!

- వచ్చే వారంపై మదుపర్ల ఆశాభావం

ముంబయి : వచ్చే వారం దేశీయ స్టాక్ మార్కెట్లు లాభాల్లో సాగే అవకాశాలు మెండుగా ఉన్నాయి. భారత్, పాకిస్థాన్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం జరగడంతో మే7తో ప్రారంభం కానున్న వారంలో దలాల్ స్ట్రీట్‌లో కొనుగోళ్లకు ఇన్వెస్టర్లు ఆసక్తి చూపొచ్చని నిపుణులు భావిస్తున్నారు. ట్రంప్ టారీఫ్‌లు, పాకిస్థాన్‌తో ఉద్రిక్తతల నేపథ్యంలో గడిచిన రెండు నెలలుగా తీవ్ర ఒత్తిడిలో కొనసాగుతోన్న మార్కెట్లలో సానుకూల వాతావరణం నెలకొననుంది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కూడా టారిఫ్‌లను వెనక్కి తీసుకోనున్నారని అంచనాలు వెలుపడుతున్నాయి. ఈ రెండు సానుకూల పరిణామాలు ఇన్వెస్టర్లలో ఉత్సాహాన్ని పెంచనున్నాయని నిపుణులు భావిస్తున్నారు.

భారత్-పాకిస్థాన్ ఉద్రిక్తతల మధ్య గడిచిన వారంలో భారత మార్కెట్లు తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొన్న విషయం తెలిసిందే. వారాంతం సెషన్‌లో సెన్సెక్స్ ఏకంగా 880 పాయింట్లు పతనమై 80వేల దిగువకు పడిపోయింది. ఇంతక్రితం గురువారం సెషన్‌లోనూ 411 పాయింట్లు నష్టపోయింది. దీంతో రెండు సెషన్లలో ఇన్వెస్టర్లు దాదాపు రూ.7 లక్షల కోట్లు పైగా సంపదను కోల్పోయారు.

ఈక్విటీ ఫండ్లలో భారీగా తగ్గిన పెట్టుబడులు

వరుసగా నాలుగో నెలలోనూ మ్యూచువల్ ఫండ్లలో పెట్టుబడులు భారీగా తగ్గిపోయాయి. గడిచిన ఏప్రిల్ నెలలో ఈక్విటీ మ్యూచువల్ ఫండ్లలోకి పెట్టుబడులు 3.24 శాతం తగ్గి రూ.24,269 కోట్లకు పరిమితమైనట్టు అసోసియేషన్ ఆఫ్ మ్యూచువల్ ఫండ్స్ ఇన్ ఇండియా(ఆంఫీ) ఓ రిపోర్టులో వెల్లడించింది.

ట్రంప్ టారిఫ్ భయాలకు తోడు భారత్-పాకిస్థాన్ దేశాల మధ్య ఉద్రిక్తత పరిస్థితులు నెలకొనడంతో మార్కెట్లు తీవ్ర ఒత్తిడిని ఎదుర్కోవడంతో ఇన్వెస్టర్లు పెట్టుబడులకు వెనుకాడారు. ఏడాదికేడాదితో పోల్చితే డెట్ ఫండ్స్ రూ.2.02 లక్షల కోట్ల నుంచి రూ.2.19 లక్షల కోట్లకు చేరుకున్నాయి.



మ్యూచువల్ ఫండ్ ఇండస్ట్రీ నికర ఎయుఎం విలువ రూ.69,99,837.94 కోట్లుగా చోటు చేసుకుంది. మార్చి నెల చివరినాటికి ఇది రూ.65,74,287.20 కోట్లుగా ఉంది.

ఐదు ఎకరాల వరిగడ్డి దగ్ధం

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

పల్నాడు జిల్లా రొంపిచర్ల మండలంలో నల్లగార్లపాడు గ్రామంలో శనివారం అగ్ని ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో గ్రామానికి చెందిన ఎగిటి ఆంజనేయులు, ఎగిటి వెంకటేశ్వర్లు కు చెందిన ఐదు ఎకరాల వరిగడ్డి వాములు దగ్ధమయ్యాయి. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. వరిగడ్డి వాముల నుండి పెద్ద ఎత్తున మంటలు రావడాన్ని గమనించి గ్రామస్థులు మంటలు ఆర్పేందుకు తీవ్రప్రయత్నాలు చేశారు. అయినా అదుపులోకి రాలేదు. సమాచారం తెలుసుకున్న నరసరావుపేట అగ్ని మాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను పూర్తిగా అదుపులోకి తీసుకువచ్చారు.

నేడు 43.5 డిగ్రీల ఉష్ణోగ్రతల నమోదుకు అవకాశం

- విపత్తుల నిర్వహణ సంస్థ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 11న 41 డిగ్రీల నుంచి 43.5 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశమున్నదని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ పేర్కొంది. ఈ మేరకు ఆ సంస్థ ఎమ్‌డి రోణంకి కూర్మనాథ్ శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఆదివారం తీవ్ర వడగాల్పులు వీచే మండలాల్లో అల్లూరి సీతారామరాజు 11, అనకాపల్లిలో 8 మండలాలు ఉన్నాయి. వడగాల్పులు వీచే మండలాల్లో అల్లూరి సీతారామరాజు 8, అనకాపల్లి 16, అనంతపురం 4, అన్నమయ్య 1, చిత్తూరు జిల్లా కుప్పం మండలాలు ఉన్నాయి. శనివారం తిరుపతి జిల్లా రేణిగుంటలో 41.7 డిగ్రీలు, విజయనగరంలో 41.1, తూర్పుగోదావరి జిల్లా మురమండలో 41, అన్నమయ్య జిల్లా కంబాలకుంటలో 40.8, వైఎస్‌ఆర్ జిల్లా మద్దూరు, ప్రకాశం జిల్లా మేకలవారిపాలెంలో 40.7 డిగ్రీల చొప్పున అధిక ఉష్ణోగ్రతలు నమోదైనట్లు తెలిపారు.

మాజీ మంత్రి రజినిని తోసివేసిన పోలీసులు

- అనుచరుడి అరెస్టులో హైడ్రామా

ప్రజాశక్తి-చిలకలూరిపేట (పల్నాడు జిల్లా)

మాజీ మంత్రి విడదల రజని అనుచరుడు ఎం.శ్రీకాంత్‌రెడ్డిని పల్నాడు జిల్లా చిలకలూరిపేట రూరల్ పోలీసులు శనివారం అదుపులోకి తీసుకున్నారు. శ్రీకాంత్‌రెడ్డిపై పలు కేసులు ఉన్నాయని, అందువల్ల అరెస్టు చేశామని పోలీసులు తెలిపారు. సోషల్ మీడియాలో అసభ్య పోస్టులు పెట్టడంతోపాటు గత ప్రభుత్వ హయంలో కాంట్రాక్టులు ఇప్పిస్తానని కొంతమంది వద్ద డబ్బు తీసుకుని మోసం చేసినట్లు కేసులు ఉన్నాయి. నాదెండ్ల మండలం జంగాలపల్లిలో పలువురు వైసిపి కార్యకర్తలను పరామర్శించేందుకు మాజీ మంత్రి విడదల రజని శనివారం వెళ్లారు. ఆమెతో పాటు అదే కారులో వెళ్లిన శ్రీకాంత్‌రెడ్డిని అదుపులోకి తీసుకునేందుకు పోలీసులు ప్రయత్నించగా విడదల రజని అడ్డుపడ్డారు. ఎందుకు అరెస్టు చేస్తున్నారు? వారెంటు ఉందా? అని ప్రశ్నించారు. విడదల రజని అడ్డుగా ఉండడంతో ఆమెను పక్కకి పో.. అంటూ పోలీసులు నెట్టేశారు. తరువాత శ్రీకాంత్ రెడ్డిని అదుపులోకి తీసుకుని చిలకలూరిపేటకు తరలించారు. నిందితుడిని అరెస్టు చేసేందుకు వెళ్లిన సందర్భంలో ఆమె తమ విధులకు ఆటంకం కలిగించారని పోలీసు అధికారులు తెలిపారు. అయినా మాజీ మంత్రిని గౌరవించి పక్కకు పంపి శ్రీకాంత్ రెడ్డిని అదుపులోకి తీసుకున్నామని సిఐ సుబ్బానాయుడు చెప్పారు.

మా బతుకులు మమ్మల్ని బతకనివ్వండి

- అదాని పవర్ ప్లాంట్ బాధితుల గోడు

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

'మా బతులకు మమ్మల్ని బతకనివ్వండి... ఇన్నాళ్లు రోడ్లు, వైద్యారోగ్యం, బడి, గుడి.. ఇలా చెప్పుకుంటూ పోతే ఏదీ లేకపోయినా మా కాయకష్టంతో ఎలాగోలా బతుకీడ్చుకొచ్చాం. చివరికి పండించిన తిండిగింజలు కిందికి తెచ్చుకోవడానికిగానీ, పెబుత్తం ఇచ్చిన కోటా బియ్యం కొండపైకి తీసుకెళ్లడానికిగానీ, దారి, రవాణా సదుపాయాలు కల్పించకపోయినా మేము పెబుత్తంపై ఆధారపడలేదు. ఎవరో పవర్ ప్లాంట్ పెట్టుకోవడం కోసం మా బతులు లేకుండా చేస్తామంటే ఎలా?'

ఇదీ .. విజయనగరం జిల్లా వేపాడ మండలం కరకవలస పంచాయతీ పరిధిలోని పాత మారిక, కొత్త మారిక సహా అదే పేరుతో ఉన్న అనేక గిరిజన గూడేల ప్రజానీకం ఆవేదన. గిరిశిఖర గ్రామాల్లోని మారిక గూడేల్లోనూ, గిరిజనుల పంట భూముల్లోనూ అదానీకి చెందిన ఓపెన్ లూప్ పంప్డ్ స్టోరేజీ పవర్ ప్లాంట్ ఏర్పాటు కోసం ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసింది. దీంతో భీతిల్లిన గిరిజనులంతా సిపిఎం అండతో ధర్నాలు, వంటా-వార్పు, ప్రదర్శనలు వంటి రూపాల్లో నిరసనలు తెలియజేస్తుండడం విదితమే. ఈ నేపథ్యంలో పాత, కొత్త మారిక గ్రామాలను 'ప్రజాశక్తి' సందర్శించింది. ఈ సందర్భంగా ప్రభుత్వ తీరుపై గిరిజనులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. కొండపైకి ఎవరైనా వస్తే చావోరేవో తేల్చుకుంటామంటూ గిరిజన యువకులు తెగేసి చెబుతున్నారు. కరకవలస పంచాయతీ కేంద్రం నుంచి మారిక గూడేలను చేరుకోవాలంటే సుమారు పది నుంచి 14 కిలోమీటర్ల మేర నాలుగు గిరిశిఖరాలను దాటుకుంటూ వెళ్లాలి. దట్టమైన అటవీ ప్రాంతంలో ముళ్లపొదలను, చెట్టూ చేమలను పక్కకు నెట్టుకుంటూ అత్యంత సాహసంతోనే చేరుకోవాలి. తాము పండించిన జొన్నలు, కొర్రలు, అవిశలు వంటి చిరుధాన్యాలు, కూరగాయలను గిరిజనులు అష్టకష్టాలు పడుతూ కిందికి తెచ్చేవారు. తీరా కిందికి దిగాక మైదాన ప్రాంతం ప్రారంభంలోనే దళారులు రంగప్రవేశం చేసి ఆయా వ్యవసాయ ఉత్పత్తులను కారుచౌకగా కొట్టేసేవారు. వచ్చిన కాస్త సొమ్ముతో నూనె, ఉప్పు వంటి రెండు మూడు రకాల సరుకులతో వెనుదిరగడం గిరిజనులకు సర్వసాధారణమైంది. కొండలు, గుట్టలు దాటుకుంటూ ముందుకు సాగడమంటే మాటలు కాదు. జ్వరమో, జబ్బో వస్తే పసర మందులే దిక్కు!. ఆస్పత్రి సదుపాయం లేదు. కిందికి దిగాలంటే కనీసం డోలీ మోతకు కూడా అవకాశం లేని పరిస్థితి. ఇటువంటి పరిస్థితుల్లో ప్రభుత్వంపై ఏ మాత్రమూ ఆధారపడకుండా అక్కడి గిరిజనులు తరతరాలుగా జీవనం సాగిస్తున్నారు. సిపిఎం నాయకత్వంలో ఏళ్ల తరబడి చేసిన పోరాట ఫలితంగా రూ.7 కోట్లతో రోడ్డు మంజూరు చేసినప్పటికీ నిర్మాణం ఇంకా పూర్తి కాలేదు. నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు కూడా పాటించడం లేదు. ఇటువంటి పరిస్థితుల్లో అదానికి చెందిన పవర్ ప్లాంట్ కోసం ఈ ప్రాంతంలోని సుమారు 214 ఎకరాల భూమిని గుర్తించి నోటిఫై చేయడం గిరిజనులను ఆందోళనకు గురిచేస్తోంది. ఇటీవల సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు కె.లోకనాథం, జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ ఆ గిరిజన గూడేలను సందర్శించిన సందర్భంగానూ తమ ఆవేదనను వ్యక్తం చేశారు. అడవి తల్లి నుంచి తమను దూరం చేస్తే బతకలేమంటూ కన్నీరుమున్నీరయ్యారు. వచ్చినవారిని విల్లంబులతో ఎదుర్కోవడం తప్ప తమకు మరో దారి తెలియదని తెలిపారు. పేనాలు పోయినా తమ ప్రాంతాన్ని వదులుకునేది లేదని అర్జున్ అనే గిరిజన యువకుడు 'ప్రజాశక్తి'కి చెప్పాడు.



పవర్ ప్లాంట్‌కు వ్యతిరేకంగా తీర్మానిస్తాం

మారిక ప్రాంతంలో పవర్ ప్లాంట్ పెట్టడం అంటే అడవి నుంచి మమ్మల్ని దూరం చేయడమే. దీన్ని ఏ మాత్రమూ సహించేది లేదు. గ్రామ సర్పంచ్‌గా ఉన్న నాకుగానీ, నా ప్రజలకుగానీ మాట వరుసకు కూడా సమాచారం ఇవ్వలేదు. ఈ భూములు దోచుకునేందుకు ఏకంగా నోటిఫికేషన్ జారీ చేసినట్టు పత్రికల్లో వచ్చిన వరకు,, సిపిఎం నాయకులు చెప్పినంత వరకు మాకు తెలియదు. కేవలం మా పంచాయతీలోని గిరిజనులను మాత్రమే కాదు, అడవిపై ఆధారపడిన గిరిజనులందరినీ ఐక్యం చేసి, ప్రభుత్వ కుట్రను అడ్డుకుంటాం. ఇందుకోసం పవర్ ప్లాంట్‌ను వ్యతిరేకిస్తూ గ్రామ సభలో తీర్మానిస్తాం.

- పాతబోయిన పెంటమ్మ, సర్పంచ్, కరకవలస

చాలా రోజులుగానే కుట్ర

మా గ్రామాలను, జీవనాధారంగా ఉన్న మారిక కొండ ప్రాంతాన్ని కాజేసేందుకు ప్రభుత్వం చాలా రోజులుగా కుట్ర చేస్తోంది. ఏడాది క్రితమే మా గ్రామానికి పడమట దిక్కున ఉన్న శారదా నది వైపున కొంతమంది సర్వే చేశారు. అప్పట్లో మేము హెచ్చరించడంతో వెనుదిరిగారు. ఇప్పుడు మాకు తెలియకుండా అధికారుల ద్వారా నోటిఫికేషన్ జారీ చేయించారు. ప్రభుత్వ కుట్రను సాగనివ్వం.

- పల్లి సోమేష్, మారిక గ్రామం

అదాని గంగవరం పోర్టు విఆర్‌ఎస్ కార్మికుల ఆందోళన

పోర్టు గేటు వద్ద ఆందోళనకు దిగిన విఆర్‌ఎస్ కార్మికులు

ప్రజాశక్తి - గాజువాక (విశాఖపట్నం): విశాఖలోని అదాని గంగవరం పోర్టు విఆర్‌ఎస్ కార్మికులు పోర్ట్ గేటు ఎదుట శనివారం ఆందోళన చేపట్టారు. తొలగించిన కార్మికులకు నష్టపరిహారం చెల్లించాలని, చనిపోయిన కార్మికుల కుటుంబాల్లో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. విఆర్‌ఎస్ తీసుకున్న కార్మికులకు రావాల్సిన బకాయిల మొత్తాన్ని తక్షణమే చెల్లించాలని నినదించారు. రెండు గంటలపాటు గేటు ముందు ఆందోళన కొనసాగించగా యాజమాన్యం తరపున పోర్టు హెచ్‌ఆర్ మేనేజర్ అనిల్, ఇండస్ట్రియల్ రిలేషన్ వైస్ ప్రెసిడెంట్ గణేష్ అక్కడకు చేరుకున్నారు. కార్మికులతో మాట్లాడారు. ఈ నెల 20న చర్చలు ఉంటాయని, ఆ రోజు సమస్యల పరిష్కారానికి తగు నిర్ణయాలు చేస్తామని హామీ ఇచ్చారు. దీంతో కార్మికులు ఆందోళన విరమించారు. సమస్యలు పరిష్కారం కాకపోతే భవిష్యత్తులో ఆందోళన కొనసాగుతుందని, యాజమాన్యం భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని కార్మికులు హెచ్చరించారు. ఆందోళన నేపథ్యంలో పోర్టు గేటు వద్ద భారీగా పోలీసులు మోహరించారు.

'విశాఖ' పాల ధర పెంపును ఉపసంహరించుకోవాలి: సిపిఎం డిమాండ్

ప్రజాశక్తి - కలెక్టరేట్ (విశాఖపట్నం): విశాఖ డెయిరీ యాజమాన్యం ఏకపక్షంగా పాల అమ్మకపు ధరను లీటరుకు రూ.2 పెంచేసి శనివారం నుంచి అమల్లోకి తీసుకురావడాన్ని సిపిఎం విశాఖ జిల్లా కమిటీ తీవ్రంగా వ్యతిరేకించింది. తక్షణమే రాష్ట్రంలోని టిడిపి కూటమి ప్రభుత్వం జోక్యం చేసుకొని పెంచిన పాల ధరను రద్దు చేయాలని డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. గత వైసిపి ప్రభుత్వం ఏడాది క్రితం లీటర్ పాల అమ్మకపు ధరను రూ.2 పెంచేసిందన్నారు. అప్పుడు ఈ పెంపుదలను టిడిపి, జనసేన, బిజెపిలు తీవ్రంగా వ్యతిరేకించాయని గుర్తు చేశారు. టిడిపి కూటమి అధికారంలోకి వచ్చినా ఆ ధరను తగ్గించకపోగా ఏడాది గడవక ముందే మరో రూ.2లను లీటర్‌కి పెంచి ప్రజలపై భారాలు వేయడం దుర్మార్గమని పేర్కొన్నారు. మరోపక్క రైతులకు ఇచ్చే లీటర్ పాల సేకరణ ధరను రూ.3 తగ్గించిన విషయాన్ని జగ్గునాయుడు గుర్తు చేశారు. ప్రస్తుతం రైతుల నుంచి సేకరించే లీటరు పాల సేకరణ ధరకు, వినియోగదారులకు విశాఖ డెయిరీ అమ్మే ధరకు రూ.20 వ్యత్యాసం ఉంటోందని తెలిపారు. తాజా పెంపుదల వల్ల ప్రజలపై రూ.6 కోట్ల భారం పడుతుందని పేర్కొన్నారు. ఇప్పటికే ఆస్తి పన్ను, విద్యుత్ ఛార్జీలను భారీగా పెంచేశారని తెలిపారు. నిత్యావసర సరుకుల ధరలన్నీ ఆకాశాన్ని అంటుతున్నాయని పేర్కొన్నారు. పెట్రోలు, డీజిల్, వంట గ్యాస్ ధరలు, విద్య, వైద్య ఖర్చులు నిత్యం పెరుగుతూనే ఉన్నాయని తెలిపారు. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, అటువంటివారిపై పాల ధరను పెంచి మరో భారం మోపడం తగదని పేర్కొన్నారు.

వాట్సాప్‌లోనూ ఎల్ఐసి ప్రీమియం చెల్లింపులు

న్యూఢిల్లీ : దేశంలోనే అతిపెద్ద జీవిత బీమా సంస్థ లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ (ఎల్ఐసి) ఆన్‌లైన్ సేవలను మరింత విస్తరించింది. తాజాగా ప్రీమియం చెల్లింపులు మరింత సులభతరం చేయడానికి వీలుగా వాట్సాప్ బోట్ సేవలను ఆవిష్కరించింది. దీంతో పాలసీదారులు మరింత సౌకర్యంగా చెల్లింపులు జరిపేందుకు వీలుంటుందని ఎల్ఐసి పేర్కొంది. పోర్టల్‌లో రిజిస్టర్ కస్టమర్ నుంచి 8976862090కి వాట్సప్ ద్వారా సమాచారం ఇస్తే ఆ పాలసీదారుడికి సంబంధించి మొత్తం వివరాలు వెంటనే రానున్నాయని ఎల్ఐసి సిఇఒ, ఎండి సిద్దార్థ మోహంతి తెలిపారు. ఇలా వచ్చిన వివరాల ఆధారంగా యుపిఐ, నెట్ బ్యాంకింగ్, కార్డు ద్వారా ప్రీమియం చెల్లింపులు జరుపుకోవచ్చునన్నారు. దీంతో తమ బీమా ప్రీమియం చెల్లింపులు జరిపేందుకు మరో ప్రత్యామ్నాయం లభించినట్లయ్యిందని పేర్కొన్నారు.

ఇ- వేలం నోటీసు (వరద నీటితో పాడైన నానో డాప్, న్యూట్రియన్ట్స్, ఎరువులు మొదలైనవి)

వరద నీటికి పాడైన "1. సుమారు 3,14,650 కేజీల ఎరువుల స్టాక్, 2. సుమారు 15,270 లీటర్ల డాప్ (గ్రోమోర్ నానో), 3. సుమారు 142,137.5 కేజీల ఎస్ఎన్‌డి (వివిధ పోషకాలు) 4. నానోజైమ్- పిపిబి, గ్రోమోర్ స్ప్రే (సర్వే నిర్వహించేది : మ్యాక్ ఐఎస్ అండ్ ఎల్ఎ ప్రైవేట్ లిమిటెడ్) ఖచ్చితంగా **"ఎక్కడ ఉంది" ఆధారంగా,** 'కెజి ప్రకారం ఆధారంగా' తరలించడం కొరకు ఆసక్తిగల కొనుగోలుదారుల నుండి **ఇ- వేలం ఫారములను** ఆహ్వానించడమైనది. లాంప్సమ్ ఆధారంగా పై పదార్థాల నివృత్తిని ఆంధ్రప్రదేశ్, విజయవాడ వద్ద **శ్రీ. నితిన్- 8810331841** నుండి ముందస్తు అపాయింట్‌మెంట్ తీసుకున్న తర్వాత **10.05.2025** నుండి **15.05.2025** మధ్య తనిఖీ చేయవచ్చు. 16.05.2025న ఇ వేలం నిర్వహించబడును. తదుపరి వివరాల కొరకు **శ్రీ. ఖుషి, మొ. -9990857386** ను సంప్రదించగలరు.

సాల్వోర్ సెట్టిలర్స్ ప్రైవేట్ లిమిటెడ్ (వేలం నిర్వహించేవారు)
చిరునామా : 203, 2వ అంతస్తు, ఉషా కిరణ్ బిల్డింగ్, అజాద్‌పూర్ కమర్షియల్ కాంప్లెక్స్, ఢిల్లీ-110033

లేదా వెబ్‌సైట్ : **www.salvorsettlers.com** నుండి డౌన్లోడ్ చేసుకోగలరు. ఇ వేలం ఫారములు సమర్పించుటకు చివరి తేది : **16.05.2025, మ.12.30 గం. కు ముందు.**

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

RACPC మంగళగిరి బ్రాంచ్, 1వ అంతస్తు, సిఎ-5, సిఎఫ్‌సి ఏరియా, హోండా షోరూమ్ వెనుక, ఆటోనగర్, మంగళగిరి, గుంటూరు జిల్లా-522503.

స్వాధీనత ప్రకటన

(APPENDIX-IV) సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002
రూల్ 8(1) ననుసరించి (స్థిరాస్థి కొరకు)

HTL A/c No.39685991117

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్ 2002 ప్రకారం **స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, RACPC మంగళగిరి బ్రాంచ్, మంగళగిరి, గుంటూరు జిల్లా** యొక్క అధీకృత అధికారి అయిన దిగువ సంతకందారు సెక్షన్ 13(12) కు అనుబంధమైన నిబంధన 3 ప్రకారం సంక్రమించిన అధికారములతో సదరు నోటీసు తేది నుండి 60 రోజులలోగా నోటీసులో పేర్కొనబడిన బకాయి **(1) హెచ్‌టిఎల్ తేది.03.03.2025 నాటికి రూ.18,23,156/- (అక్షరాల పద్దెనిమిది లక్షల ఇరవై మూడు వేల నూట యాభై ఆరు రూపాయలు మాత్రమే)** కాంట్రాక్చువల్ రేటు ప్రకారం వడ్డీతో ఖర్చులు, ఛార్జీలు మొ॥నవి సదరు నోటీసు అందిన తేదీ నుండి 60 రోజులలోగా తిరిగి చెల్లించవలసినదిగా **ఋణగ్రహీత : శ్రీమతి తియ్యగూర బేబీ, భర్త : టి. శివ రామ కృష్ణ రెడ్డి,** డి.నెం.8-58/1, గాంధీ రైస్ మిల్లు ఎదురుగా, నంబూరు గ్రామం, పెదకాకాని మండలం, గుంటూరు జిల్లా, ఆం.ప్ర-522508. **హామీదారు : శ్రీ తియ్యగూర శివ కోటి రెడ్డి, తండ్రి : టి. శివ రామ కృష్ణ రెడ్డి,** డి.నెం.8-58/1, గాంధీ రైస్ మిల్లు ఎదురుగా, నంబూరు గ్రామం, పెదకాకాని మండలం, గుంటూరు జిల్లా, ఆం.ప్ర-522508 వారిని కోరుతూ **తేది.03.03.2025 న డిమాండ్ నోటీసును** జారీచేయడమైనది.

పైన పేర్కొన్న ఋణగ్రహీత డిమాండ్ నోటీసు జారీ చేసిన తరువాత **రూ.27,500/-** చెల్లించగా ఋణగ్రహీత/హామీదారు ఇప్పుడు **(1) హెచ్‌టిఎల్ తేది.05.05.2025 నాటికి రూ.18,32,439/- (అక్షరాల పద్దెనిమిది లక్షల ముప్పై రెండు వేల నాలుగు వందల ముప్పై తొమ్మిది రూపాయలు మాత్రమే)** మరియు వడ్డీ, కాస్ట్, ఛార్జీలు మొ॥వితో కలిపి చెల్లించవలెను.

ఋణగ్రహీత సదరు బకాయి సొమ్మును తిరిగి చెల్లించుటలో విఫలమైనందున ఈ దిగువ సంతకందారు సదరు చట్టంలోని సెక్షన్ 13(4) కు అనుబంధమైన సెక్యూరిటీ ఇంటరెస్ట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ చట్టం, 2002 నందలి రూల్ 8 ప్రకారం దిగువ వివరించిన ఆస్తిని తేది **06.05.2025** న **లాంఛనాత్మకంగా స్వాధీనత తీసుకోవడమైనదని** ఋణగ్రహీత & ప్రజానీకమునకు ఈ నోటీసు ద్వారా తెలియజేయడమైనది.

ఋణగ్రహీత/హామీదారు మరియు యావన్మంది సాధారణ ప్రజానీకమును ఇందుమూలముగా హెచ్చరించునది ఏమనగా సదరు ఆస్తితో ఎవ్వరూ ఎటువంటి లావాదేవీలు జరుపరాదనియు మరియు సదరు ఆస్తితో జరిపే ఏ లావాదేవీలైనా **(1) హెచ్‌టిఎల్ తేది.05.05.2025 నాటికి రూ.18,32,439/- (అక్షరాల పద్దెనిమిది లక్షల ముప్పై రెండు వేల నాలుగు వందల ముప్పై తొమ్మిది రూపాయలు మాత్రమే)** తదుపరి వడ్డీ, ఖర్చులు, ఛార్జీలు మొ॥నవి **స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, RACPC మంగళగిరి బ్రాంచ్, మంగళగిరి, గుంటూరు జిల్లా** వారి ఛార్జీకి లోబడి ఉంటాయి.

స్థిరాస్తి వివరములు

గుంటూరు జిల్లా, పెదకాకాని మండలం, నంబూరు గ్రామం, డోర్ నెం.8-58, డి.నెం.448 నందు విస్తీర్ణం 267 చ॥గ॥లు లేదా 223-32 చ॥మీ॥లులోని తనఖా ఉంచబడిన ప్రతిపాదిత ఆస్తి. **దస్తావేజు నెం. 2160/2009, తేది.27.08.2009, ఈ ఆస్తి శ్రీమతి తియ్యగూర బేబీ, భర్త : టి. శివ రామ కృష్ణ రెడ్డి గారికి చెందినది. హద్దులు : తూర్పు:** పంచాయితీ బజార్, **దక్షిణం :** జొన్నల వీర రెడ్డి గారి స్థలం మరియు ప్రహరీ గోడ, **పడమర :** భీమవరపు వేమరెడ్డి గారి స్థలం, **ఉత్తరం :** వుయ్యూరు సాంబి రెడ్డి గారి స్థలం.

తేది : **06.05.2025**
ప్రదేశం : మంగళగిరి

సం/- అధీకృత అధికారి,
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

యథేచ్ఛగా లేటరైట్ తవ్వకాలు

- భారీ వాహనాలతో తరలింపు
- అధికార పార్టీ నాయకుని అండ!
- చోద్యం చూస్తోన్న అధికార యంత్రాంగం

ప్రజాశక్తి- అనకాపల్లి ప్రతినిధి

ఎర్ర బంగారంగా పేరొందిన కోట్ల విలువైన లేటరైట్‌ను మైనింగ్ మాఫియా ఇష్టానుసారం తవ్వుకుపోతోంది. దగ్గరుండి తవ్వకాలు చేయిస్తున్నది జిల్లాలో అధికారి పార్టీకి చెందిన కీలకమైన వ్యక్తి కావడంతో అధికార యంత్రాంగం చేష్టలుడిగింది. ఇచ్చిన అనుమతులు ఎక్కడో, తవ్వుతున్నది ఎక్కడో గుర్తించి తేడా ఉంటే చర్యలు తీసుకోవాల్సిన అధికారులు నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. గత ప్రభుత్వంలో ప్రారంభమైన లేటరైట్ అక్రమ తవ్వకాలు టిడిపి కూటమి ప్రభుత్వంలోనూ కొనసాగుతున్నాయి. మైనింగ్ మాఫియాకు గతంలో వైసిపి అండగా ఉండగా, ఇప్పుడు టిడిపి అండగా నిలిస్తోంది. అనకాపల్లి జిల్లా నాతవరం మండలం సుందరకోట పంచాయతీ భమిడికిలొద్దిలో జర్తా లక్ష్మణరావు అనే గిరిజనుడికి అన్ సర్వేడ్ ల్యాండ్‌లో 296.34 ఎకరాల్లో లేటరైట్ తవ్వకాలకు ప్రభుత్వం 2041వ సంవత్సరం వరకు అనుమతులు మంజూరు చేసింది. ఐదో షెడ్యూల్ ప్రాంతంలో ఖనిజ తవ్వకాలకు గిరిజనేతరులకు అవకాశం లేకపోవడంతో గిరిజనుడైన లక్ష్మణరావును అడ్డంపెట్టుకొని మైనింగ్ మాఫియా రంగంలోకి దిగింది. పీసా, 1/70 చట్టాలను ఉల్లంఘించింది. గ్రామసభలు నిర్వహించి ఆమోదం పొందాలన్న నియమం పాటించలేదు. గత ప్రభుత్వ కాలంలో చెలరేగి తవ్వకాలు చేపట్టిన మైనింగ్ మాఫియాకు గిరిజనుల ప్రతిఘటన, న్యాయపరమైన సమస్యలతో తవ్వకాలకు కొంత ప్రతిబంధకం ఏర్పడింది. ప్రభుత్వం మారడంతో మైనింగ్ మాఫియా కూడా మారింది. గత ప్రభుత్వానికి అనుకూలురైన వ్యాపారుల స్థానంలో ఇప్పుడు ఈ ప్రభుత్వ పెద్దల కనుసన్నల్లో మెలిగే మైనింగ్ వ్యాపారులు తవ్వకాలు చేస్తున్నారు. నర్సీపట్నానికి చెందిన ఒక వ్యాపారి ప్రధాన సూత్రధారిగా ఉన్నారు. రెవెన్యూ, అటవీ శాఖ, గనుల శాఖ, కాలుష్య నియంత్రణ మండలి అధికారులెవరిలోనూ లేటరైట్ అక్రమ తవ్వకాలపై చలనం లేకుండా ఉంది. లేటరైట్ అక్రమ తవ్వకాలు జరుగుతున్న ప్రాంతం రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు ప్రాతినిధ్యం వహిస్తోన్న నర్సీపట్నం నియోజకవర్గ పరిధిలో ఉంది. అక్రమ రవాణా కాకినాడ జిల్లా రౌతులపూడి మండలం మీదుగా సాగుతోంది. రోజుకు కనీసం రెండు వేల టన్నులకుపైగా లేటరైట్‌ను యంత్రాలతో తవ్వి, భారీ వాహనాల్లో రౌతులపూడి మండలం జలదం వద్ద ఏర్పాటు చేసిన క్రషింగ్ ప్రదేశానికి తరలిస్తున్నారు. అక్కడి నుంచి రావికంపాడు రైల్వే స్టేషన్ నుంచి వివిధ ప్రాంతాలకు వేర్వేరు మార్గాల్లో పంపిస్తున్నారు. లేటరైట్ తవ్వకాల లీజు వసూలు వివరాలు, రాయల్టీ కింద జమైన డబ్బుల వివరాలు గనులు, భూగర్భ శాఖ నర్సీపట్నం డివిజన్ కార్యాలయంలో అందుబాటులో లేవు. ప్రస్తుతం లేటరైట్ తవ్వుతున్న నాగులకొండ నుంచి లేటరైట్ క్రషింగ్ ప్రదేశం జలదం వరకు అటవీ శాఖ అనుమతుల్లేకుండా చెట్లు నరికి భారీ రహదారి ఏర్పాటు చేసుకున్నా అటవీ శాఖాధికారులకు చీమకుట్టినట్లయినా లేదు. లేటరైట్ తవ్వకాల ఫీజు, రాయల్టీ విషయమై గనులు, భూగర్భశాఖ నర్సీపట్నం డివిజన్ అసిస్టెంట్ డైరెక్టర్ శివాజీని 'ప్రజాశక్తి' వివరణ కోరగా హెక్టార్‌కు ఏడాదికి రూ.26 వేలు, రాయల్టీ కింద టన్ను ఒక్కంటికీ రూ.150 చొప్పున రాష్ట్ర ప్రధాన కార్యాలయానికి చెల్లిస్తుండడంతో ఆ వివరాలు తమవద్ద లేవని చెప్పారు. లేటరైట్ తవ్వకాలతో తమకు సంబంధంలేదని, అనుమతులు ఇవ్వడం వరకే తమ పని అని తెలిపారు.

నాగులకొండలో సాగుతున్న లేటరైట్ తవ్వకాలు

ప్రభుత్వాస్పత్రుల్లో జనఔషధి మందులు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో: ప్రభుత్వాస్పత్రుల్లో జన ఔషధి మందుల షాపులు ఏర్పాటుచేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందని వైద్యారోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. ఈ అంశంపై శనివారం ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పెద్ద సంఖ్యలో ప్రభుత్వాస్పత్రులకు వచ్చే రోగుల ప్రయోజనార్థం నాణ్యమైన జనరిక్ మందులను అతి తక్కువ ధరలకే అందించే చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. జిజిహెచ్‌లలో ప్రస్తుతం జనరిక్ మెడికల్ షాపుల నిర్వాహకులు కొన్ని సందర్భాల్లో 50 నుంచి 600 శాతం మేరకు లాభాలతో మందుల్ని విక్రయిస్తున్నారని తెలిపారు. ప్రస్తుతం 16 జిజిహెచ్‌లలో 23 ప్రైవేట్ జనరిక్ స్టోర్లు ఉన్నాయని వెల్లడించారు. నంద్యాల జిజిహెచ్‌లో మాత్రం ఇలాంటి స్టోర్ లేదని తెలిపారు. ప్రభుత్వాస్పత్రుల్లో జనరిక్ మందుల షాపుల్ని నిర్వహించడానికి లాపేక్షలేని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ప్రతిపాదనకు ఆమోదం తెలిపినట్లు చెప్పారు. ప్రభుత్వ జనరల్ ఆస్పత్రుల్లో ప్రవేశపెట్టబోయే ఈ జన ఔషధి కేంద్రాలకు ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ తగు అనుమతులు పొందాల్సి ఉంటుందని పేర్కొన్నారు. రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా స్థాయి బ్రాంచ్‌లకు జిల్లా కలెక్టర్లు ఛైర్మన్లుగా ఉంటారని వెల్లడించారు. సెకండరీ ఆస్పత్రుల్లో కూడా ఈ కేంద్రాల్ని ప్రవేశపెట్టాలని మంత్రి ఆదేశించారు. ఏరియా, జిల్లా ఆస్పత్రుల్లో వాటిని నిర్వహించే అవకాశాన్ని పరిశీలించాలన్నారు.

యెస్ బ్యాంక్‌లో జపాన్ కంపెనీకి 20 శాతం వాటా

- డీల్ రూ.13,500 కోట్లు

న్యూఢిల్లీ : ప్రయివేటు రంగంలోని యెస్ బ్యాంక్‌లో 20 శాతం వాటాను స్వాధీనం చేసుకోవడానికి జపాన్‌కు చెందిన మిత్సుయి బ్యాంకింగ్ కార్పొరేషన్ (ఎస్ఎంబిసి) ముందుకు వచ్చింది. యెస్ బ్యాంక్‌లోని తమ ఈ వాటాను ఎస్ఎంబిసికి విక్రయిస్తున్నామని స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బిఐ)తో పాటు మరో 7 బ్యాంకులు తెలిపాయి. ఈ విక్రయం అనంతరం యెస్ బ్యాంక్‌లో ఎస్ఎంబిసి అతిపెద్ద వాటాదారుగా నిలువనుంది. ఈ ఒప్పంద విలువ రూ.13,483 కోట్లుగా ఉంది. దేశీయ బ్యాంకింగ్ రంగంలో ఇప్పటివరకు ఇదే అతిపెద్ద విదేశీ పెట్టుబడి లావాదేవీ కావడం విశేషం. ఇందులో ఎస్‌బిఐకి చెందిన 13.19 శాతం వాటాను రూ.8,889 కోట్లకు విక్రయిస్తోంది. మిగిలిన 6.81 శాతం వాటాను యాక్సిస్ బ్యాంక్, బంధన్ బ్యాంక్, ఫెడరల్ బ్యాంక్, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్, ఐసిఐసిఐ బ్యాంక్, ఐడిఎఫ్‌సి ఫస్ట్ బ్యాంక్, కోటక్ మహీంద్రా బ్యాంక్‌లు రూ.4,594 కోట్లకు అమ్మనున్నాయి.

ఆర్థిక సంక్షోభంలో చిక్కుకున్న యెస్ బ్యాంక్‌ను ఆదుకోవడానికి 2020 మార్చిలో ఎస్‌బిఐ సహా 8 బ్యాంక్‌లు వాటాలను కొనుగోలు చేశాయి. ఇందులో ఏకంగా ఎస్‌బిఐ రూ.6,050 కోట్లతో 49 శాతం వాటాను స్వాధీనం చేసుకుంది. యెస్ బ్యాంక్‌లో 13.19 శాతం వాటాకు సమానమైన 413.44 కోట్ల షేర్లను రూ.8,888.97 కోట్లకు విక్రయించేందుకు ఎగ్జిక్యూటివ్ కమిటీ ఆఫ్ ద సెంట్రల్ బోర్డు ఆమోదం తెలిపిందని ఎస్‌బిఐ వెల్లడించింది. ఈ లావాదేవీ అనంతరం ఎస్‌బిఐ వాటా 10.81 శాతానికి తగ్గనుంది.

ఎస్‌బిఐ, జన ఎస్ఎఫ్‌బిలకు ఆర్‌బిఐ జరిమానా

న్యూఢిల్లీ: రెగ్యులేటరీ నిబంధనలు పాటించలేదనే కారణంతో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బిఐ), జన స్మాల్ ఫైనాన్స్ బ్యాంకులపై రిజర్వు బ్యాంక్ కొరఢా ఝులిపించింది. బ్యాంకుల రుణాలు, అడ్వాన్స్‌లు, అనధికార ఎలక్ట్రానిక్ బ్యాంకింగ్ లావాదేవీల్లో ఖాతాదారుల భద్రతకు సంబంధించిన అంశాలు, కరెంట్ అకౌంట్ ఖాతాలు ఓపెన్ చేయడంలో నిబంధనల ఉల్లంఘనలను గుర్తించినట్లు రిజర్వు బ్యాంక్ వెల్లడించింది. ఇందుకు గాను ఎస్‌బిఐకి రూ.1.72 కోట్ల జరిమానా విధించింది. బ్యాంకింగ్ రెగ్యులేషన్ యాక్ట్, 1949 ప్రకారం నిబంధనలను ఉల్లంఘించినందుకు జన స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్‌కు రూ.1 కోటి జరిమానా వేసినట్లు ఆర్‌బిఐ తెలిపింది. ఆర్థిక క్రమశిక్షణను అమలు చేయడానికి, నిర్దేశించిన మార్గదర్శకాలకు బ్యాంకులు కట్టుబడి ఉండేలా ఈ జరిమానా విధిస్తున్నట్లు పేర్కొంది. ఈ చర్యలు బ్యాంకింగ్ రంగంలో మరింత జవాబుదారీతనాన్ని నిర్ధారించడానికి దిద్దుబాటు చర్యగా పని చేస్తాయని పేర్కొంది.

జానపదంతో 'సామాజిక చైతన్యం'

ముగిసిన 'మనపల్లె జానపదం జాతర'

ప్రజాశక్తి - ఎస్‌వియు క్యాంపస్

జానపద గేయాలు, పాటలు సమాజంలో సామాజిక చైతన్యానికి ఎంతో దోహదపడతాయని వక్తలు ఉద్ఘాటించారు. "మన పల్లె జానపదం జాతర"ను ఐఎస్‌ఒ గుర్తింపు పొందిన అంతర్జాతీయ సంస్థ ప్రజా కళావేదిక, ఎస్‌వియు విద్యార్థుల సంక్షేమం, సాంస్కృతిక వ్యవహారాల సంచాలకుల సంయుక్త ఆధ్వర్యంలో ఎస్‌వియు సెనేట్ హాలులో నిర్వహించారు. రెండవరోజు శనివారం ముగింపు సభకు ప్రజా కళావేదిక చైర్మన్ అరవ జయపాల్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా స్టూడెంట్ వెల్ఫేర్ అండ్ కల్చరల్ అఫైర్స్ డైరెక్టర్ మురళీధర్, అతిథులుగా ఎపి గ్రంథాలయ పరిషత్ పూర్వ సభ్యులు గుత్తా హరిసర్వోత్తమ నాయుడు, ప్రముఖ కవి, ప్రిన్సిపల్ డాక్టర్ సి. నారాయణస్వామి, సినీ గీత రచయిత, ప్రసిద్ధ కవి సురేంద్ర రొడ్డ, కవయిత్రి, రుయా ఆసుపత్రి సర్జన్ డాక్టర్ రోజా రమణి, కల్చరల్ కో-ఆర్డినేటర్ డాక్టర్ పత్తిపాటి వివేక్, జానపద కళాకారుడు వేలూరు జగన్నాథం హాజరై మాట్లాడారు. జానపద గేయాల్లో కథా గేయాలు, జానపద పురాణాలు, ఇతిహాసాలు, గద్య కథనాలు, సామెతలు, పొడుపు కథలు, మాండలికాలు, నుడికారాలు, తిట్లు, ఒట్లు వంటివి ఉన్నాయన్నారు. పుట్టుక, వివాహం, మరణం తదితరాంశాలకు సంబంధించిన ఆచారాలు, కుటుంబం, సంబంధ బాంధవ్యాలు, పండుగలు, వినోదాలు, ఆటలు, జానపద వైద్యం, మతం, నమ్మకం వంటి సాంఘిక ఆచారాలు ప్రస్తావిస్తారన్నారు. సంగీతం, నృత్యం, అభినయం ఉండే ప్రదర్శన కళలన్నీ జానపద కళలుగా రాణిస్తున్నాయని తెలిపారు. అనంతరం కళాకారులు జానపద గేయాలు ఆలపించారు. అతిథులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రజా కళావేదిక ప్రతినిధులు గుండ్లూరు సుబ్రహ్మణ్యం, లింగుట్ల వెంకటేశ్వర్లు డాక్టర్ నటరాజ నాయుడు, జానపద కళాకారులు కెఎం రత్నం, రెడ్డి ప్రసాద్, తెలంగాణ నుంచి కట్ల శ్రీనివాసులు, ప్రజా నాట్యమండలి పాండురంగా రావు, లాలయ్య, ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి దాదాపు 300 మందికి పైగా కళాకారులు పాల్గొన్నారు.

మురళీధర్‌ను సన్మానిస్తున్న ప్రజా కళా వేదిక సభ్యులు

16న డిఎస్‌సి హిందీ ఆన్‌లైన్ ఉచిత మోడల్ టెస్ట్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

తమ సంస్థ ఆధ్వర్యాన ఈ నెల 16న సాయంత్రం 6 నుంచి 8:30 గంటల వరకూ యాప్‌లో ఉచిత డిఎస్‌సి హిందీ ఆన్‌లైన్ పరీక్షను నిర్వహించనున్నట్లు హిందీ సేవాసదన్ వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి ఎస్ గైబువల్లి తెలిపారు. ఈ మేరకు శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. డిఎస్‌సిలో స్కూల్ అసిస్టెంట్, టిజిటి, పిజిటి హిందీ పరీక్షలకు రాష్ట్రంలోని హిందీ అభ్యర్థులంతా హాజరుకావొచ్చునని పేర్కొన్నారు. ఆన్‌లైన్ మోడల్ టెస్ట్‌తో పరీక్ష రాసే విధానం, సిలబస్ అనుసారంగా ప్రశ్నాపత్రం, సమయపాలన తదితర విషయాలపై అవగాహన కలుగుతుందని వివరించారు.

హిందీ సేవాసదన్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకొని రాష్ట్ర వ్యాప్తంగా డిఎస్‌సి హిందీ పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా కోరారు. తదితర వివరాలకు ఫోన్ నెంబర్లు 9581386150, 9553677119, 9848783787ను సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు.

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా భారత ప్రభుత్వ రంగ సంస్థ

స్పెషల్ అగ్రి ఫైనాన్స్ బ్రాంచి (గొల్లపూడి),
డోర్.నెం.6-04, గ్రామపంచాయితీ రోడ్డు, వన్ సెంటర్, గొల్లపూడి, విజయవాడ రూరల్, ఎన్.టి.ఆర్ జిల్లా, ఏపి-521225.

అమ్మకం గురించి ఋణగ్రహీతకు తెలియపరుచు ప్రకటన (30 రోజుల ప్రకటన)

(RULE 6(2)/RULE 8(6) OF SECURITY INTEREST (ENFORCEMENT) RULES 2002)

ఋణగ్రహీతలు/కో అబ్లిగెంట్స్ / తనఖాదారులు / హామీదారులు:

1. ఎ) శ్రీ బోడ వెంకన్న బాబు (ఋణగ్రహీత), తండ్రి: రాధా కృష్ణ మూర్తి, డి.నెం. 8-10-7, ప్లాట్ నెం. 7, ఫ్లాట్ నెం. టి-9, 3వ అంతస్తు, హర్షిత మెగా టవర్స్, గొల్లపూడి, విజయవాడ, కృష్ణాజిల్లా-521225. **2. కోట వెంకట సత్యనారాయణ (సహ అబ్లిగెంట్),** తండ్రి: వీర రాఘవయ్య, డి.నెం. 1-4-208/2ఎ, ఆర్.టి.సి వర్క్‌షాప్ గేటు ఎదురుగా, భవానీపురం, విజయవాడ, కృష్ణాజిల్లా-521225. **3. శ్రీమతి సత్యవతి బోడ (సహ దరఖాస్తుదారు),** 10-93/ఎ, సారాకోట్టు సెంటర్, భీమయ్య రైస్ మిల్ వీధి, గొల్లపూడి, విజయవాడ రూరల్, కృష్ణాజిల్లా, ఆంధ్రప్రదేశ్-521225. **4. బోడ కిషోర్ (సహ అబ్లిగెంట్),** తండ్రి: సత్యనారాయణ, డి.నెం. 10-93/ఎ, భీమయ్య రైస్ మిల్, గొల్లపూడి, విజయవాడ, కృష్ణాజిల్లా-521225.

విషయం: సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ & ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 ప్రకారం యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, స్పెషల్ అగ్రి ఫైనాన్స్ బ్రాంచి (గొల్లపూడి) వారికి శ్రీ బోడ వెంకన్న బాబుకి చెందిన బకాయి వసూలు కొరకు మీకు చెందిన ఆస్తి అమ్మకం.

చట్టం 13(2) విభాగం పరిధిలో నేను/బ్యాంక్ డిమాండ్ నోటీసు **తేది.22-07-2021** ద్వారా మీకు డిమాండ్ పంపినప్పటికీ మీరు బ్యాంక్‌కు చెల్లించవలసిన బకాయి మొత్తం చెల్లించుటలో మీరు విఫలమైనారు.

పైన చెప్పిన చట్టం పరిధిలో సంక్రమించిన అధికారాలతో ఈ దిగువ తెలిపిన ఆస్తిని **తేది.05-01-2022** న అధీకృత అధికారి లాంఛనాత్మకంగా స్వాధీన పరచుకున్నారు.

ఆస్తిని లాంఛనాత్మకంగా స్వాధీన పరచుకున్న తర్వాత కూడా, మీరు **యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, స్పెషల్ అగ్రి ఫైనాన్స్ బ్రాంచి (గొల్లపూడి)** కు చెల్లించవలసిన బకాయి మొత్తమును మీరు చెల్లించలేదు. అందువలన, ఈ నోటీసు తేదీ నుండి 30 దినములు తర్వాత దిగువ తెలిపిన ఆస్తిని ఈ-వేలం ద్వారా విక్రయించవలసిన అవసరం ఏర్పడినది. విడిగా జారీచేయబడు అమ్మకం ప్రకటన ద్వారా, వేలం తేదీ మరియు సమయం మరియు సర్వీసు ప్రొవైడర్ వివరములు తెలియచేయ బడతాయి మరియు హెచ్చు ధర ఆఫర్ చేసిన వ్యక్తికి ఆస్తి విక్రయించబడుతుంది. కాబట్టి, ఆస్తులను ప్రైవేటు అమ్మకం ద్వారా కూడా విక్రయించవచ్చును. లేదా వ్యక్తుల నుండి కొటేషన్లు కూడా పొందవచ్చును. బ్యాంక్ ఆమోదయోగ్యమైన మరియు కొనుగోలుదారుని ఉద్దేశించిన నిబంధనలు మరియు షరతులకు లోబడి ఆస్తి విక్రయించవచ్చును.

మీరు ప్రైవేటు అమ్మకం ద్వారా లేదా కొటేషన్ పొందడం ద్వారా ఆస్తిని ఎవరికైనా విక్రయించే ప్రతిపాదనలను కలిగి ఉన్నట్లుయితే, ఈ నోటీసు అందిన తేది నుండి 7 రోజులలోపుగా దానిని బ్యాంక్‌కు తెలియజేయగలరు.

విఫలమైనచో, మీకు అలాంటి ప్రతిపాదన ఏమీ లేదని పైన సూచించిన ప్రకారం ఈ-వేలం ద్వారా ఆస్తి విక్రయం చేయుటకు బ్యాంక్ తదుపరి ప్రక్రియ కొనసాగిస్తుంది.

ఈ-వేలం ప్రకటన ప్రచురణ తేదీన లేదా ఆలోగా బ్యాంక్ డిమాండ్ నోటీసు **తేది. 22-07-2021** నందు సూచించిన పూర్తి మొత్తంతో పాటు చెల్లించు తేదీ వరకు అందుపై తదుపరి వడ్డీ మరియు అప్పటివరకు సంభవించిన ఖర్చులు మరియు వ్యయాలు చెల్లించి ఆస్తిని విడిపించుకోవచ్చునని దయచేసి మీరు గమనించగలరు. ఇట్టి విషయంలో షెడ్యూలులో తెలిపిన ఆస్తి అమ్మకానికి తదుపరి వేలం ఉండదు. చట్టంలోని సెక్షన్ 13(8) ప్రకారం విముక్తి హక్కు అందుబాటులో ఉంది.

షెడ్యూల్ ఆస్తి

తనఖా పెట్టబడిన ఆస్తుల వివరాలు దిగువ వివరించబడ్డాయి:
కృష్ణాజిల్లా-521225, గొల్లపూడి, సర్వే.నెం.540/1, స్వాతి విద్యా నికేతన్ ప్రక్కన గల హర్షిత మెగా టవర్స్‌లో 862.68 చ.గ.లలో 33 చ.గ.ల విస్తీర్ణంలో అవిభక్త వాటా గల ఫ్లాట్ నెం. టి9 శ్రీ బోడ వెంకన్న బాబు గారి పేరున కలదు. హద్దులు: **తూర్పు:** శూన్యాకాశము, **దక్షిణం:** ఫ్లాట్ నెం. టి8, **పడమర:** ఉమ్మడి కారిడార్, **ఉత్తరం:** శూన్యాకాశము.

తేది: 02-05-2025
ప్రదేశము: విజయవాడ

అధీకృత అధికారి
యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

సంపాదకీయం

సేవా నిరతి

సేవా తత్పరతకు నిలువెత్తు మానవ రూపం... నర్సులు. ఒక వైద్యుడు ప్రాణాలను రక్షిస్తాడు, కానీ ఒక నర్సు ఆ ప్రాణాలకు ధైర్యాన్ని పోస్తుంది. ప్రిస్క్రిప్షన్‌లో లేకపోయినా దయ, కరుణ, ఓదార్పు, భరోసా ఇచ్చే సంరక్షకులు వీరు. 'నర్సులు ఆరోగ్య సంరక్షణకు గుండెకాయ లాంటివారు' అంటారు నర్సింగ్ నిపుణుడు డోనా విల్క్ కార్డిల్లో. కరోనా వంటి విపత్కర పరిస్థితుల్లోనూ తమ కుటుంబాలకు దూరంగా వుంటూ, ప్రాణాలకు తెగించి వారందించిన సేవలు వెల కట్టలేనివి. నిద్రలేని రాత్రులలోనూ... నిస్వార్థంగా, రోగుల వెన్నంటి వుండే అలుపెరుగని సేవికలు నర్సులు. వారు శరీరానికి ఔషధాన్నివ్వడమే కాదు, హృదయాలకు సాంత్వననూ అందిస్తారు. వారి వైద్య నైపుణ్యం కంటే ముందు నిలిచేది... వారి మానవతా స్పర్శ. చికిత్స కోసం చేరిన నాటి నుంచి... కోలుకుని తిరిగి వెళ్లేవరకూ వెన్నంటే వుండి సేవలందిస్తారు. రోగులతో ఎక్కువ సమయం గడుపుతారు. చికిత్స ప్రక్రియ అంతటా అవసరమైన సంరక్షణ, సౌకర్యం, భరోసాను అందిస్తారు. 'నర్సింగ్ అనేది లలిత కళలలో ఒకటి; లలిత కళలలో అత్యుత్తమమైనదని నేను భావిస్తాను' అంటారు ఆధునిక నర్సింగ్ వ్యవస్థాపకురాలు ఫ్లోరెన్స్ నైటింగేల్.

డబ్ల్యుహెచ్‌ఓ నివేదిక ప్రకారం... నర్సింగ్ వర్క్‌ఫోర్స్ ప్రపంచ ఆరోగ్యరంగంలోని అతిపెద్ద రంగాలలో ఒకటి. ప్రపంచంలోని మొత్తం ఆరోగ్య కార్యకర్తలలో సగానికిపైగా నర్సులు వున్నారు. అయినప్పటికీ నర్సుల కొరత వుంది. ఇంకా 5.9 మిలియన్ల మంది నర్సులు అవసరం వుందని డబ్ల్యుహెచ్‌ఓ చెబుతోంది. 'నర్సింగ్ అనేది కేవలం ఉద్యోగం కాదు...అదొక జీవన విధానం' అంటారు ప్రముఖ నర్సింగ్ నిపుణుడు జీన్ వాట్సన్. జననమైనా... మరణమైనా, సంతోషమైనా... విషాదమైనా రోగుల పక్కనే వుంటారు. మానసికంగా, భావోద్వేగంగా, కుటుంబ సభ్యుల్లా చివరి నిమిషం వరకూ తోడుగా వుంటారు. రోగి స్వస్థతకు వైద్యం కీలకం. ఆ వైద్యం అందించే క్రమంలో నర్సుల పాత్ర కూడా అంతే ముఖ్యం. ఆపరేషన్ల సమయంలో డాక్టర్లకు చేదోడుగా వుండేది నర్సులే. రోగి కోలుకొని ఆరోగ్యంగా ఆసుపత్రి దాటేవరకూ అవసరమైన అన్ని వైద్యసేవలు అందించేది నర్సులే. మందులకంటే ఎక్కువగా... వీరు చెప్పే ధైర్యం, అందించే ప్రేమ... రోగిని త్వరగా కోలుకునేలా చేస్తుంది. తెల్లని దుస్తుల్లో దేవదూతల్లా... శాంతిమూర్తుల్లా కనిపించే నర్సులు వృత్తిపరంగా అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారు. అంటువ్యాధులనే మహమ్మారులపై పోరాడటంలో ముందంజలో వుండే వీరు... అధిక పనిగంటలు, తక్కువ వేతనాలు... మరీ ముఖ్యంగా లైంగిక వేధింపులు వంటి వాటినీ ఎదుర్కోక తప్పడంలేదు. నర్సులు, ఆరోగ్య కార్యకర్తలు లేకుండా సార్వత్రిక ఆరోగ్యం అన్న లక్ష్యాన్ని ఏ దేశమూ సాధించలేదు. ఇందుకనుగుణంగా... వీరికి వృత్తిపరమైన భద్రత, వ్యక్తిగత రక్షణ కల్పించడంలో ఆయా ఆసుపత్రులు, ప్రభుత్వాలు కచ్చితమైన చర్యలు తీసుకోవాలి.

ఈ క్రమంలోనే... ఆధునిక నర్సింగ్ వ్యవస్థకు పునాది వేసిన ఫ్లోరెన్స్ నైటింగేల్ పుట్టినరోజైన మే 12ను 'ప్రపంచ నర్సుల దినోత్సవం'గా జరుపుకుంటున్నారు. 'నర్సుల సంరక్షణ ఆర్థిక వ్యవస్థలను బలపరుస్తుంది' అన్న ఇతివృత్తంతో ఈ ఏడాది నర్సుల దినోత్సవాన్ని జరుపుకుంటున్నారు. ఇది వారి వృత్తిగత, వ్యక్తిగత శ్రేయస్సు, ఆరోగ్య సంరక్షణ కోసం మాత్రమే కాకుండా...ఆర్థిక స్థిరత్వంలో కూడా నర్సుల కీలకమన్న విషయాన్ని ఈ ఇతివృత్తం నొక్కి చెబుతోంది. ముఖ్యంగా నర్సుల మానసిక ఒత్తిడిపై దృష్టి పెట్టడం, వాటిని ఎదుర్కొనే మార్గాలను అన్వేషించడం ద్వారా నర్సులకు సరైన సౌకర్యాలు అందించి, వారికి వెన్నుదన్నుగా నిలవాలి. అప్పుడే నర్సింగ్ ఫోర్స్ మరింత సమర్థవంతంగా పనిచేస్తుంది. ఇది రోగులకు, సమాజానికి మెరుగైన ఫలితాలను అందిస్తుంది. 'నేను సైతం/ ప్రపంచాబ్జపు/ తెల్ల రేకై పల్లవిస్తాను' అంటారు మహాకవి శ్రీశ్రీ. మేము సైతం అంటూ... ప్రత్యక్షంగా ఆరోగ్య వ్యవస్థల సంరక్షణలో, పరోక్షంగా ఆర్థిక పురోభివృద్ధిలో భాగమౌతున్న మానవతా మూర్తులు నర్సులు. వారి సేవ, త్యాగం, ప్రేమ, కరుణ ప్రపంచానికి వెలుగు దివ్వెలు.

మంచి మాట



విజయం కోసం ప్రయత్నించడమే జీవితం కాకూడదు. విలువల కోసం జీవించడమే లక్ష్యం కావాలి.
- ఆల్బర్ట్ ఐన్‌స్టీన్, ప్రపంచ ప్రసిద్ధ శాస్త్రవేత్త.



కాల్పుల విరమణ : నిన్నటి కథల నిజానిజాలు

ప్రస్తుతం

తెలకపల్లి రవి



భారత్-పాకిస్తాన్ మధ్య పరాకాష్టకు చేరిన సాయుధ ఘర్షణపై అమెరికా మధ్యవర్తిత్వంతో కాల్పుల విరమణ ప్రకటన వెలువడింది. అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ మొదట ఈ విషయం ప్రకటించగా విదేశాంగ శాఖ కార్యదర్శి విక్రమ్ మిశ్రీ ధృవపర్చారు. ఇరు దేశాల సైనిక ఆపరేషన్ల విభాగం అధిపతులు మాట్లాడుకుని సంపూర్ణంగా, తక్షణమే దీన్ని అమలు చేయాలని నిర్ణయించుకున్నట్టు ప్రకటన వెలువడింది. అమెరికా హర్షించింది. అయితే తమ షరతుల మేరకే కాల్పుల విరమణ జరుగుతున్నట్టు భారత ప్రధాని మోడీ చెప్పారని ఆయనను కలిసిన ప్రతినిధులు వెల్లడించారు. ఇది ఏ మేరకు పూర్తిగా అమలవుతుందన్న దానిపైనా సందేహాలు కొనసాగుతున్నా ఒక కీలక ఘట్టం ముగిసినట్టుగా చెబుతున్నారు. మూడో దేశం ముచ్చటే లేదని మాట్లాడిన ఇండియా ఎందుకు అంగీకరించిందన్న దానిపైనా అనేక కథనాలు వస్తున్నాయి. ఏమైనా పహల్గాంలో టెర్రరిస్టుల ఘాతుక హత్యాకాండకు ప్రతిస్పందనగా పాకిస్తాన్‌లోని ఉగ్రవాద స్థావరాలపై భారత్ చేసిన దాడులు, దానికి ప్రతీకారంగా మళ్లీ పాక్ మన సరిహద్దుల్లో సాగించిన కాల్పుల్లో మరణాలు తీవ్ర పరిస్థితికి దారితీశాయి. ఈ నేపథ్యంలో గత కొద్ది రోజుల సంఘపరివార్ అనుకూల శక్తులు, అంతర్జాతీయ సామ్రాజ్యవాద సమాచార మీడియా, సంచలనాల కథకులు వారి వారి పద్ధతుల్లో నడిపించిన ప్రచారాల తీరు అర్థమవుతుంది. సమయం సందర్భాలతో నిమిత్తం లేకుండా ఇలా జరగాలని, ఇలా జరగలేదని నిర్దేశించే యాంత్రికత, వివిధ శక్తుల పాత్ర, అంతర్జాతీయ ప్రభావం, ఆయుధ సంపత్తి గురించి కూడా అనేక అర్థసత్యాలు, అవాస్తవాలు తెలుస్తాయి.

1. జమ్ము కాశ్మీర్ లోని పహల్గాంలో ఉగ్రవాదుల కుట్ర చాలా తీవ్రమైంది, అమానుషత్వం నిండింది. జమ్ము కాశ్మీర్‌లో ప్రజాస్వామ్య వాతావరణం నెలకొనకుండా, సామాన్య ప్రజా జీవితం పునరుద్ధరణ జరగకుండా అడ్డుకోవడం పాక్ ప్రేరిత శక్తుల మొదటి పథకం. దేశ ప్రజల మధ్య మతాలవారీగా చిచ్చు పెట్టడం ఎందుకు? గతంలోనూ ఉరి, బాల్కోట్ సైనిక కేంద్రాలపై ఉగ్రవాద దాడులు, దానికి ప్రతి చర్యలు జరక్కపోలేదు. కానీ ఇక్కడ పనిగట్టుకుని పథకం ప్రకారం నిరాయుధులైన నిస్సహాయ యాత్రికులను దుర్మార్గంగా కాల్చి చంపారు. దేశంపై జరిగిన ఈ దాడిని ఒక మతంపై దాడిగా పక్కదోవ పట్టించేందుకు వారు పాచిక వేశారు. ఈ టెర్రరిస్ట్ శక్తులకూ, వాని వెనకనున్న పాకిస్తాన్ సైనిక కూటమికి పాఠం చెప్పడం తప్పనిసరి. 1980లో ఆఫ్ఘనిస్తాన్‌లో ప్రగతిశీల ప్రభుత్వాన్ని కూలదోసేందుకు కుట్రలు మొదలైనప్పటి నుంచి పాకిస్తాన్ రకరకాల ఇస్లామిక్ తీవ్రవాద శక్తులకు శిక్షణా కేంద్రంగా మారిపోయింది. ఎక్కడో ఒకచోట ఈ కుట్రలకు ప్రతి చర్య తప్పనిసరి. వారి పాత్ర నిర్ధారించే సాక్ష్యాధారాలు సేకరించటం అవసరమే అవుతుంది. అంతర్జాతీయ వేదికలపై ఈ అంశాన్ని నిరూపించాలంటే సాక్ష్యాలు కావాల్సిందే.

ప్రతిపక్షాల స్పష్టత

> **మోడీ గొప్పతనం గురించి చెప్పేవారు ఈ పరిస్థితి రావడానికి కారణమైన నిఘా వైఫల్యం గురించి విస్మరిస్తుంటారు. టెర్రరిస్టు ప్రమాదంపై చాలా సార్లు ప్రాథమిక సమాచారం అందించామని కూడా చెబుతున్నారు. కాశ్మీర్ ఇప్పుడు పూర్తిగా కేంద్రపాలిత ప్రాంతం. అమిత్ షా హోం మంత్రిగా తరచూ సందర్శిస్తూ ఉంటారు. ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లాకు అక్కడ రక్షణ చర్చల్లో ఎలాంటి పాత్ర ఉండదు. మరి సామర్థ్యం గురించి కేంద్రం మాట్లాడేటప్పుడు ఈ వైఫల్యాలను కూడా ఎత్తిచూపనవసరం లేదా? వైఫల్యాలకు కూడా కీలక నేతలు బాధ్యతలు తీసుకోవాలి. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చేయాలి.**

2. పహల్గాం ఘాతుకం తర్వాత దేశంలోనే అన్ని రాజకీయ పార్టీలు టెర్రరిస్టు శక్తులపై తగు చర్య తీసుకోవడానికి ప్రభుత్వానికి మద్దతు ప్రకటించాయి. ఆ చర్య ఏ రూపంలో ఉండాలన్నది అధికారంలో ఉన్న వారు నిర్ణయిస్తారు తప్ప మిగిలిన వారికి అవకాశం ఉండదు. సామాన్య పౌరులకు హాని జరగకుండా చూడాలని కేంద్రానికి స్పష్టం చేశాయి. ఇప్పటివరకు తాము ఉగ్రవాద స్థావరాలపై దాడి చేశామని మాత్రమే మోడీ ప్రభుత్వం చెబుతున్నది. ఆపరేషన్ సిందూర పేరుతో 9 టెర్రరిస్టు స్థావరాలపై దాడి చేసి వచ్చాక కాశ్మీర్ సరిహద్దుల్లో కాల్పుల వర్షం కురిపించిన పాక్ సైన్యం అనేకమంది ప్రాణాలు బలిగొన్నందుకే మళ్లీ దాడి అవసరమైందని చెబుతున్నది. డ్రోన్ యుద్ధాలు, సరిహద్దు కాల్పులు వీటి చుట్టూనే ఘర్షణలు సాగుతున్నాయి.

3. గతంలో ఏకపక్షంగా సర్జికల్ స్ట్రైక్స్ జరిపి గొప్పగా ప్రచారం చేసుకున్న తీరుకూ ఇప్పుడు మెజారిటీ కోల్పోయిన ఒక ప్రభుత్వం అన్ని పార్టీలకు ఏదో ఒక రీతిలో సమాచారం ఇచ్చి అడుగులు వేయవలసిన పరిస్థితికీ తేడా కళ్ళ ముందు కనిపిస్తుంది. గతంలోని విమర్శల కారణంగానే కేంద్రం ఎంపిక చేసి మరీ సోఫియా ఖురేషిని, అడ్మిరల్ వ్యోమికను కూర్చోబెట్టవలసి వచ్చింది. ఇది పైపై ఎత్తుగడ అనే అభిప్రాయం తప్పు కాకపోయినా మార్పు మాత్రం గమనించ వలసిందే. మృతుడైన నౌకాదళ అధికారి భార్య హిమాన్షి నర్వాల్ మతపరమైన ద్వేషాలు వద్దని చెప్పడం, ఆమెపై ట్రోలింగ్ జరిగిందంటే దేశ ప్రజలలో లౌకికవాద, మత సామరస్య ప్రభావాలు గట్టిగానే పని చేస్తున్నాయని స్పష్టమవుతుంది. మతపరమైన శక్తులను ఖండించటం, ఎదుర్కోవటం ఎంత అవసరమో అకారణ మారణకాండతో కల్లోలం సృష్టించే టెర్రరిస్టు శక్తులను అడ్డుకోవటం కూడా అంతే ముఖ్యమని గ్రహించటం అవసరం.

సైన్యంతోనే సమాధానమా?

4. టెర్రరిజాన్ని ఒక దెబ్బతో అణచివేయాలంటే సైన్యానికి సర్వాధికారాలు దఖలు పరచాలనే ధోరణి కూడా సరైనది కాదు. సైనిక దళాలు పౌర ప్రభుత్వానికి లోబడి ఉండటం భారతదేశంలో రాజ్యాంగ వరవడి. ఇందుకు భిన్నంగా పాకిస్తాన్‌లో సైనిక కూటమి చెప్పు చేతల్లో నామకార్థపు ప్రభుత్వం నడుస్తుంటుంది. ఈ ఇద్దరినీ ఇస్లామిక్ చాందస శక్తులు ఆడిస్తుంటాయి. ఈ మొత్తం వ్యవస్థ సామ్రాజ్యవాద కూటమి చెప్పుచేతల్లో ఉంటుంది. ఇదంతా విష వలయం. గత ప్రభుత్వాలు మెత్తగా ఉంటే మోడీ మాత్రం చాలా శక్తివంతంగా పాకిస్తాన్‌ను తిప్పి కొడుతున్నారని వందిమాగధులు కీర్తిస్తుంటారు. మరోవైపున సైనిక దళాలతో సమీక్షిస్తూ ఎప్పుడు ఎక్కడ ఎలా ఏ చర్య తీసుకోవాలో వాటికే సర్వాధికారాలు ఇచ్చినట్టు అధికార సమాచారం విడుదలవుతుంది. కానీ అంతిమంగా ప్రభుత్వ నిర్ణయాలు, నిర్దేశాల ప్రకారమే సైన్యం వ్యవహరించాల్సి ఉంటుంది. పాకిస్తాన్ తరహాలో భారతదేశంలో సైన్యం పౌర ప్రభుత్వం సమతుల్యత దెబ్బ తినడానికి ఆస్కారం ఇవ్వకూడదు.

> **గత ప్రభుత్వాలు మెత్తగా ఉంటే మోడీ మాత్రం చాలా శక్తివంతంగా పాకిస్తాన్‌ను తిప్పి కొడుతున్నారని వందిమాగధులు కీర్తిస్తుంటారు. మరోవైపున సైనిక దళాలతో సమీక్షిస్తూ ఎప్పుడు, ఎక్కడ, ఎలా, ఏ చర్య తీసుకోవాలో వాటికే సర్వాధికారాలు ఇచ్చినట్టు అధికార సమాచారం విడుదలవుతుంది. కానీ అంతిమంగా ప్రభుత్వ నిర్ణయాలు, నిర్దేశాల ప్రకారమే సైన్యం వ్యవహరించాల్సి ఉంటుంది. పాకిస్తాన్ తరహాలో భారతదేశంలో సైన్యం పౌర ప్రభుత్వం సమతుల్యత దెబ్బ తినడానికి ఆస్కారం ఇవ్వకూడదు.**

5. ఇక తీవ్రవాదానికి, దాన్ని పెంచి పోషించే పాకిస్తాన్‌కు సమాధానం చెప్పాలంటే ఇజ్రాయిల్ తరహాలో నిర్దాక్షిణ్యంగా దాడి చేయాలని కొంతమంది చెబుతుంటారు. మరీ దారుణంగా గాజాపై ఇజ్రాయిల్ మరణాంతక దురాక్రమణను నమూనాగా తీసుకోవాలనే అవగాహనా రాహిత్యం చూస్తున్నాం. ఇలా వాదించే వారిలో కొందరు విద్యార్థులు కూడా వున్నారు. ప్రజాస్వామ్యం, శాంతి, సహకారం వంటి కనీస విలువలు తెలిసిన వారెవరూ ఇలా మాట్లాడరు. ఇజ్రాయిల్‌తో ఇండియా 40 ఏళ్లకు పైగా ప్రత్యక్ష సంబంధాలు పెట్టుకోకపోవడానికి కారణం...పాలస్తీనా ప్రజలపై, అరబిక్ భూభాగాలపై దాని దురాక్రమణ, యుద్ధాలు దురంతాలే. ఇండియా వాస్తవానికి అరబ్బులతో సన్నిహితంగా ఉంటూ ఇజ్రాయిల్‌ను దూరం పెట్టింది. అసలు గాజాపై ఇజ్రాయిల్ మారణకాండతో భారతదేశాన్ని పోల్చుకోవడమే అమానవీయం.

అత్యుత్సాహంలో అసత్యాలు

6. యుద్ధంలో ముందుగా బలయ్యేది సత్యమేనని నానుడి. దాడులు, సంఘర్షణల వార్తలను అత్యుత్సాహంతో ప్రసారం చేసే అర్ణబ్ గోస్వామి లాంటి దురభిమాన శక్తులను స్వయంగా రక్షణ శాఖ తగదని హెచ్చరించవలసి వచ్చింది. సైనిక దళాల కదలికలు వాంఛనీయం కాదని హెచ్చరించింది. అనేక మీడియాలు మరీ ముఖ్యంగా సోషల్ మీడియా సంస్థలు తామే యుద్ధ భూమిలో ఉన్నట్టుగా ఊహించుకుంటూ ఉద్రిక్తతలు రెచ్చగొట్టే విధంగా వ్యవహరిస్తున్నాయి. నిజం చెప్పాలంటే ఇప్పటికి చూస్తున్నది పరిమితమైన ఘర్షణ మాత్రమే. నిజంగా జరిగిన లాభనష్టాలు నెమ్మదిగాకానీ బయటికి రావు. ఈ కథనాలన్నింటిని పూర్తిగా నమ్మేసి పూనకాలు తెచ్చుకోవడం అవసరంలేని పని. బలూచిస్తాన్‌లో తిరుగుబాటు ఘటనలు నిజమైనా, అది విడిపోయినట్టుగానీ మొత్తం పాక్ కుప్పకూలిపోతున్నట్టుగానీ చిత్రించడం నిరాధారమే. భారత పాకిస్తాన్ లు ఇప్పుడు కాల్పుల విరమణకు అంగీకరించాయంటేనే వచ్చిన కథనాలు ఎంత అతిశయాలతో నడిచాయో అర్థమవుతుంది.

7. పదేపదే అణ్వస్త్ర ప్రయోగం ప్రస్తావనకు వస్తున్నది. పాకిస్తాన్ మంత్రి తాము అణ్వస్త్రాన్ని వినియోగించాల్సి వస్తుందని అన్నారు. మామూలుగానే అణు యుద్ధంలో విజేతలు ఉండరని చెప్తుంటారు. అట్లాంటిది విడిపోయిన ఇరుగుపొరుగు దేశాలుగా భారత్ పాకిస్తాన్ ఆ ఆలోచన చేయడం కూడా సాధ్యమయ్యేది కాదు. భారతదేశం ముందుగా తాను అణ్వస్త్ర ప్రయోగం చేయనని ప్రకటించింది (నో ఫస్ట్ యూజ్) కనుక అసలు అవకాశం లేదు. ఇక పాకిస్తాన్‌కు ఆర్థికంగా ఆసక్తి కూడా లేదు. అంతర్జాతీయ సమాజం కూడా అందుకు అంగీకరించదు. వాజ్‌పేయి హయాంలో 1998 మే 12, 13, 14 తేదీల మధ్య అణుబాంబు పరీక్ష జరిగితే మోడీ హయాంలో అది సాధారణ రాజకీయ చర్చగా మారడం యాదృచ్ఛికం కాదు.

విఫలతలూ చూసుకోవాలి

8. మోడీ గొప్పతనం గురించి చెప్పేవారు ఈ పరిస్థితి రావడానికి కారణమైన నిఘా వైఫల్యం గురించి విస్మరిస్తుంటారు. టెర్రరిస్టు ప్రమాదంపై చాలా సార్లు ప్రాథమిక సమాచారం అందించామని కూడా చెబుతున్నారు. కాశ్మీర్ ఇప్పుడు పూర్తిగా కేంద్రపాలిత ప్రాంతం. అమిత్ షా హోం మంత్రిగా తరచూ సందర్శిస్తూ ఉంటారు. ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లాకు అక్కడ రక్షణ చర్చల్లో ఎలాంటి పాత్ర ఉండదు. మరి సామర్థ్యం గురించి కేంద్రం మాట్లాడేటప్పుడు ఈ వైఫల్యాలను కూడా ఎత్తిచూపనవసరం లేదా? వైఫల్యాలకు కూడా కీలక నేతలు బాధ్యతలు తీసుకోవాలి. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చేయాలి.

9. మోడీ హయాంలో భారతదేశం విశ్వగురువుగా అవతరించటం సంఘపరివారానికి ఇష్టమైన మాట. ట్రంప్ టారిఫ్ మోత మోగినా నోరెత్తలేనంత విధేయత ప్రదర్శించింది మోడీ సర్కార్. వాస్తవానికి చెప్పినట్టు తోకాడించే పాకిస్తాన్ లాంటి సైనిక ప్రాబల్య దేశాన్ని అమెరికా ఎన్నటికీ వదులుకోదు. సోవియట్ విచ్ఛిన్నం తర్వాత చైనా, ఇండియాల మధ్య పాకిస్తాన్ ఉనికి అమెరికాకు చాలా కీలకం. చైనాతో కూడా పాక్‌కు బలమైన సంబంధాలు ఉన్నప్పటికీ వాటిని అమెరికాతో పోల్చలేము. భారతదేశంలో చారిత్రకంగా సరిహద్దు వివాదం ఉన్నప్పటికీ ఈ రెండు దేశాలు బాధ్యత గల గొప్ప దేశాలుగా చాలా వేదికల్లో కలసి పనిచేస్తున్నాయి. కానీ బడా మీడియా చైనాను ప్రధాన శత్రువుగా చూపిస్తూ అమెరికాను వెనక్కు నెడుతూ ఉంటుంది. భారత వైమానిక దాడులపై 'ఇది చాలా సిగ్గుచేటు. వారు ఎప్పటి నుంచో పోట్లాడుకుంటున్నార'ని డోనాల్డ్ ట్రంప్ ఇండియా దాడి తర్వాత తొలి వ్యాఖ్యలు చేశారు. ఈ దాడి విచారకరం. వారు సాధారణ పరిస్థితి కోసం పని చేయాలని చైనా వ్యాఖ్యానించింది. ఇందులో ట్రంపు మాటలను మద్దతుగాను చైనా మాటలను వ్యతిరేకమైనవిగాను మన మీడియా చూపించింది. మోడీ నా మిత్రుడు అని ట్రంప్ అన్నాడని విపరీతమైన ప్రచారం జరిగింది. అదే వ్యక్తి రెండు దేశాలూ నాకు మిత్రులే అనేసరికి ఈ మీడియా చల్లగా జారుకుంది. పాక్ ప్రభుత్వానికి 100 కోట్ల బెయిలవుట్ మొత్తం రాకుండా చేయాలన్న మోడీ ఒత్తిడి కూడా పనిచేయలేదు. చివరకు కాల్పుల విరమణ ప్రకటన కూడా ట్రంప్ ద్వారానే ప్రపంచానికి తొలిగా తెలిసింది.

10. తమకు భిన్నంగా ఎవరు మాట్లాడినా దేశ వ్యతిరేక ముద్ర వేయడం దారుణమైన వాస్తవం. నదులు ఎవరూ పుట్టించినవి కాదు. ఆ నీరు ఎక్కడికి పోవాలో తేల్చవలసింది మనం కాదు అని నటి సమంత, మైనార్టీలపై దాడుల విషయంలో మనం గతంలోనే నింద మూటగట్టుకున్నామని ప్రకాశ్‌రాజ్ అన్నందుకు కాషాయ మూక వారిపై విషం కక్కింది. పవన్ కల్యాణ్ అయితే సోషల్ మీడియాలో 'కుక్కలు' అంటూ వారిపై నోరు పారేసుకున్నారు. సెలబ్రిటీలు దేశాన్ని నడిపేవారు కాదని తక్కువ చేసి మాట్లాడారు. తప్పులు ఎలా ఉన్నా వ్యక్తులు భావ ప్రకటనతో ఏదైనా మాట్లాడటం నేరం ఎందుకు అవుతుందో పవన్ వంటి వారే చెప్పాలి. విమర్శలను కూడా స్వీకరిస్తేనే దేశానికి మేలు జరుగుతుంది.

పిల్లలు పుస్తకాలు ఎందుకు చదవాలి?

వ్యాసం

సి.వి. కృష్ణయ్య

పాఠాలు చదవడానికే సమయం చాలడం లేదు. ఇతర పుస్తకాలు చదవడానికి సమయం ఎక్కడ ఉంది? పిల్లలు చదివేది కథల పుస్తకాలే కదా! కథల్లో ఏముంది కాలక్షేపం చేయడానికి తప్ప. ఇది చాలామంది తల్లిదండ్రుల, టీచర్ల అభిప్రాయం. ఈ అభిప్రాయమే పిల్లల భవిష్యత్తును దేశాభివృద్ధిని దెబ్బతీస్తున్నది. ఎందులోనూ నైపుణ్యంలేని వ్యక్తుల్ని తయారు చేసి ఈ విద్యా వ్యవస్థ మానవ వనరుల్ని వృధా చేస్తున్నది. ఈ విషయాల గురించి లోతుగా పరిశీలిద్దాం.

అక్షరాలు వచ్చిన వాళ్లంతా విద్యావంతులు కాదు. విశాల ప్రపంచాన్ని మానవ సమాజాన్ని ఎవరు అర్థం చేసుకుంటారో వాళ్లే నిజమైన విద్యావంతులు. అలాంటి విశాల ప్రపంచం పుస్తకాలు చదవడం ద్వారా మాత్రమే అర్థమవుతుంది. వేల సంవత్సరాలుగా మనుషులు సంపాదించిన జ్ఞాన సంపద పుస్తకాలలో నిక్షిప్తమై ఉంది. ఆ సంపద ఎవరికి వారు స్వయంగా తవ్వి తీసుకోవాలి. ఎవరూ సహాయం చేసేవారు ఉండరు. మరి పాఠ్యపుస్తకాలలో ఉన్నది ఏమిటి? అది చాలదా? పాఠ్య పుస్తకాలలో ఉన్నది సముద్రంలో నీటి బొట్టంత. బడిలో చదువు టీచర్ పిల్లల చేయి పట్టుకొని నడక నేర్పడం లాంటిది. ఎల్లకాలం వెంట ఉండి చేయి పట్టుకుని నడిపించేవారు ఉండరు. తనకు తాను నడవగలగాలి, పరుగెత్తాలి. పాఠ్యపుస్తకాలు చదివి పరీక్షలు రాయడం ఊపిరి బిగబట్టి 100 మీటర్ల పరుగు పందెంలో పాల్గొనడం లాంటిది. ఇది చాలదు. జీవిత కాలం ప్రశాంతంగా పరుగు తీయాలి. వివిధ రకాల పుస్తకాలు ఇందుకోసం చదవాలి.

తెలివిగల తల్లిదండ్రులు తమ బిడ్డలకు పాఠ్యపుస్తకాలతో పాటు ఇతర పుస్తకాలు చదవమని ప్రోత్సహిస్తారు. రకరకాల పుస్తకాలు తెచ్చి పిల్లలకు ఇస్తారు. పిల్లల బంగారు భవిష్యత్తుకు బాటలు వేస్తారు. అజ్ఞానులు పాఠ్యపుస్తకాలు తప్ప ఇతర పుస్తకాలు చదవకుండా కాపలా కాస్తారు. తమ బిడ్డల భవిష్యత్తుకు అడ్డుకట్టలు వేస్తారు. పసితనం నుండి ఇతర పుస్తకాలు చదివే పిల్లలతో పాఠ్యపుస్తకాలకే పరిమితమైన పిల్లలు ఎన్నడూ పోటీ పడలేరు.

> **పిల్లలు మొదటి దశలో కథల పుస్తకాలు ఇష్టపడతారు. కథల పుస్తకాల్లో ఏముంది? అని చాలామంది ప్రశ్నిస్తారు. కథల పుస్తకాల్లో మొత్తం మానవ సమాజం అంతా ఉంది. మనిషి సంఘజీవి. తమ ఇరుగు పొరుగు వారితో కలిసి జీవిస్తూ వారి విషయాలు తెలుసుకుంటూ తనతో పోల్చుకుంటూ మంచి చెడులు అర్థంచేసుకుంటాడు. ఇది మానవ సహజం. అందుకే కథలంటే పిల్లలు ఇష్టపడతారు. రకరకాల మనుషుల స్వభావాలు, మంచి చెడులు, సమస్తము తెలుసుకుంటారు. కథల ద్వారా కాకపోతే ఇవన్నీ ఎలా తెలుస్తాయి? ఇలా కథల పుస్తకాల మీద ఇష్టం పెరిగి పెద్దవారయ్యే కొద్దీ ఇతర పుస్తకాల మీదికి మనసు మరలుతుంది. చరిత్ర, 'భూగోళం', ఇతర శాస్త్ర గ్రంథాలు చదవడం క్రమంగా అలవాటు అవుతుంది. తమకిష్టమైన సబ్జెక్టు ఏదో దానికి సంబంధించిన పుస్తకాలు మరింత లోతుగా చదువుతారు. ఇలా చదవడం వలన ఏదో ఒక దాంట్లో ప్రవేశం జరిగి నైపుణ్యం సంపాదిస్తారు. తాము చేసే వృత్తిని మరింత నాణ్యంగా చేయడానికి, కొత్త విషయాలు తెలుసుకోవడానికి అవకాశం ఏర్పడుతుంది.**

ఎంత ఎక్కువగా పుస్తకాలు చదివితే అంత బాగా రాయడం నేర్చుకుంటారు. కింది తరగతుల్లో తప్పులు లేకుండా రాయడానికి ఇంపోజిషన్లు చూసి రాతలు ఇచ్చి పిల్లల్ని వేధిస్తుంటారు. తప్పుల్లేకుండా రాయాలంటే రకరకాల పుస్తకాలు ఎక్కువగా చదవాలి.

మాట్లాడే భాషకు రాసే భాషకు తేడా ఉంటుంది. ఈ తేడాను పుస్తకాలు ఎక్కువగా చదవడం ద్వారా మాత్రమే తెలుసుకుంటారు. రాసే భాష కూడా సులభంగా నేర్చుకుంటారు. తన అభిప్రాయాల్ని స్పష్టంగా తెలియజేస్తారు. ఎందుకంటే చదవడం ద్వారా వాక్య నిర్మాణంతో పాటు రకరకాల శైలులు తెలుసుకొని ఉంటారు. లేకపోతే రాయడానికి ఇబ్బంది పడతారు.

ఎలాంటి పుస్తకాలు చదవాలి?

పిల్లలకు ఇష్టమైనవి ఎలాంటి పుస్తకాలయినా చదవచ్చు. అయితే మొదటి దశలో ప్రతి ఒక్కరూ కథల పుస్తకాలు ఇష్టపడతారు. కథల పుస్తకాల్లో ఏముంది? అని చాలామంది ప్రశ్నిస్తారు. కథల పుస్తకాల్లో మొత్తం మానవ సమాజం అంతా ఉంది. మనిషి సంఘజీవి. తమ ఇరుగు పొరుగు వారితో కలిసి జీవిస్తూ వారి విషయాలు తెలుసుకుంటూ తనతో పోల్చుకుంటూ మంచి చెడులు అర్థంచేసుకుంటారు. ఇది మానవ సహజం. అందుకే కథలంటే పిల్లలు ఇష్టపడతారు. రకరకాల మనుషుల స్వభావాలు, మంచి చెడులు, సమస్తము తెలుసుకుంటారు. కథల ద్వారా కాకపోతే ఇవన్నీ ఎలా తెలుస్తాయి? ఇలా కథల పుస్తకాల మీద ఇష్టం పెరిగి

పెద్దవారయ్యే కొద్దీ ఇతర పుస్తకాల మీదికి మనసు మరలుతుంది. చరిత్ర, 'భూగోళం', ఇతర శాస్త్ర గ్రంథాలు చదవడం క్రమంగా అలవాటు అవుతుంది. తమకిష్టమైన సబ్జెక్టు ఏదో దానికి సంబంధించిన పుస్తకాలు మరింత లోతుగా చదువుతారు. ఇలా చదవడం వలన ఏదో ఒక దాంట్లో ప్రవేశం జరిగి నైపుణ్యం సంపాదిస్తారు. తాము చేసే వృత్తిని మరింత నాణ్యంగా చేయడానికి, కొత్త విషయాలు తెలుసుకోవడానికి అవకాశం ఏర్పడుతుంది. ఏ దేశం అభివృద్ధి కావాలన్నా ఇతర దేశాలతో పోటీ పడాలన్నా సైన్సు అవసరాన్ని గుర్తిస్తారు. మూఢనమ్మకాలకు వ్యతిరేకంగా సైన్స్‌ను ఆలంబనంగా చేసుకుని తన జీవిత ప్రయాణం సాగిస్తారు. నిజమైన దేశభక్తులుగా ఎదుగుతారు. పుస్తకాలు చదివే అలవాటున్న వ్యక్తులు ఒత్తిడి నుండి ఒంటరితనం నుండి బయటపడతారు. పుస్తకం స్నేహితుడి లాంటిది. ఒక తోడు. మనకు మంచీ చెడుల గురించి చెబుతుంది. గతించిన వారంతా పుస్తకాల ద్వారా మనతో మాట్లాడుతూనే ఉంటారు. మానవీయతతో మంచి మనుషులుగా ఎదగాలంటే ప్రతి ఒక్కరూ పుస్తకాలు చదవాలి. పసితనం నుండి పుస్తకాలు చదవడం అలవాటు చేయాలి. ప్రతి ఇంట్లో తల్లిదండ్రులు తమ పిల్లల కోసం వారి సొంత లైబ్రరీ ఏర్పాటు చేసుకొనేలా సహాయపడాలి. భారతీయ సమాజం శాస్త్రీయ సమాజంగా ఎదగాలి.

/'జన విజ్ఞానం' సౌజన్యంతో/

అభ్యంతరమా!

కవిత్వం

ఇనుప ముళ్ల కంచెకు
అటు, ఇటు నిస్త్రాణ విస్తీర్ణ
వ్యవసాయ క్షేత్రాలం
మాటాడుకుంటే!
మానవీయ సిరలూ, ధమనులు
మావి
మీ పహారా పాదాలకు
తెలియకుండా
ప్రవహించుకుంటే!
మాకు సంబంధం లేని
మందు పాతరలు మీ
మనసుల్లో ఉన్నాయి.
లోయల్ని తొక్కేసి
శిఖరాలు ఎక్కేసే
లోహ పతాకాలు మీరే!
వ్యూహ కపోతాలూ మీరే!
యుద్ధం గురించి మేం
మాట్లాడుకోం..
అది మీ వాణిజ్యం.
మీ రాజపూజ్యం కూడా!
మీరు పెత్తనాల గురించి
పెద్దరిక యుద్ధాలు చేస్తున్నారు.
దయచేసి, ధ్వంసమైన క్షేత్రాలలో
మొలకెత్తే కొత్త తరం
విత్తనాల కోసం మమ్మల్ని
మాటాడుకునే వెసులుబాటు
ఇవ్వండి.
మీ కవాతులకూ..కాల్పులకూ
జీతాలుంటాయ్!
భౌగోళికంగా విడిపోయినా
భూగోళమంత హృదయం మాది.
బతుకు పునాదులు..సమాధులు
బంకర్లలో ఉండవు.
మీరు పాతిన కాంక్రీటు కంచెలకు
అటు, ఇటు గాయపడుతూ
పండిన పంటల లోతైన నిండు
గుండెల్లోనే!
శిథిలాల్లో విజయాలను
చూసేవాళ్లని..మృత
దేహపేటికలు మోస్తూ,
మృదు దేశ భక్తి
పాటలు పాడేవారినీ..
చూసీ..చూసీ..విరక్తులయిపోయాం.
జయాపజయాల నెత్తుటి తెర
జారిన తరువాత,
మీరు మీ వైభవ శిబిరాల్లో
విలసిస్తారు.
అన్ని యుద్ధ సంధ్యలనూ
అనుభవించే మమ్మల్ని
మీరు నిర్ణయించిన రాత్రి
ముహూర్తాలకు ముందు,
మనసారా మాట్లాడి, ఏడ్చే
అవకాశం ఇవ్వండి.
మీరన్న మాటకు కట్టుబడి
యుద్ధానికి వ్యతిరేకంగా మాట్లాడం.
శాంతి, వేదన, ఓదార్పు, కన్నీళ్ల
కౌగిళ్లు యుద్ధ నేరాలు కాదనే
నమ్మకంతోనే ఈ విన్నపం.

- నల్లి ధర్మారావు,
సెల్ : 76609 67313

మీ వ్యాసాలను పంపాల్సిన మెయిల్ : editpageps @gmail.com

సమగ్రంగా ఎన్నికల సంస్కరణలు

- పారదర్శకతకు పట్టం కట్టాలి
- ఎన్నికల సంఘంతో సిపిఎం బృందం భేటీ
- పాక్షిక దామాషా ప్రాతినిధ్యం అమలుకు వినతి
- ఇవిఎంలు, అక్రమాలు, కార్పొరేట్ నియంత్రణ అంశాలపై చర్చ

ఢిల్లీలోని నిర్వచన్ సదన్‌లో ప్రధాన ఎన్నికల కమిషనర్ (సిఇసి) జ్ఞానేశ్ కుమార్, ఎన్నికల కమిషనర్లు డాక్టర్ సుఖ్‌బీర్ సింగ్ సంధు, డాక్టర్ వివేక్ జోషితో సమావేశమైన సిపిఎం ప్రధాన కార్యదర్శి ఎంఎ బేబీ, నీలోత్పల్ బసు, మురళీధరన్

న్యూఢిల్లీ : ప్రజాస్వామ్యంలో అత్యంత కీలకమైన ఎన్నికల ప్రక్రియకు సంబంధించిన సంస్కరణలను విస్తృత సంప్రదింపులతో సమగ్రంగా చేపట్టాలని భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) – సిపిఎం కోరింది. పార్టీ ప్రధాన కార్యదర్శి ఎంఎ బేబీ, పొలిట్‌బ్యూరో సభ్యులు నీలోత్పల్ బసు, కేంద్ర కార్యదర్శివర్గ సభ్యులు మురళీధరన్‌తో కూడిన సిపిఎం ప్రతినిధి బృందం శనివారం భారత ఎన్నికల సంఘం (ఇసిఐ)తో సమావేశమైంది. ఈ సందర్భంగా కమిషన్‌కు సమర్పించిన నోట్‌ను పార్టీ ప్రధానకార్యదర్శి ఎంఎ బేబీ విడుదల చేశారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలను చర్చలకు ఆహ్వానించాలన్న ఇసిఐ నిర్ణయాన్ని సిపిఎం స్వాగతించింది. రాజకీయ పార్టీలతో జరుపుతున్న ఈ సంప్రదింపులు మున్ముందు కూడా కొనసాగాలన్న ఆశాభావాన్ని వ్యక్తం చేసింది. ఎన్నికల నిర్వహణకు సంబంధించిన అనేక అంశాలను ఈ సందర్భంగా సిపిఎం ప్రస్తావించింది. ఎన్నికల సంస్కరణలు సమగ్రంగా ఉండాలని పార్టీ అభిప్రాయపడింది. ఇవిఎంలు, ఎన్నికల నిధులు, అవినీతి, కార్పొరేట్ నియంత్రణ, పాక్షిక దామాషా ప్రాతినిధ్యం, నిష్పాక్షికత, ఎన్నికల సంస్థల స్వతంత్ర స్వభావం, మీడియా పాత్ర వంటి అంశాలను పరిష్కరించేలా ఈ సంస్కరణలు ఉండాలని సూచించింది.

పాక్షిక దామాషా ప్రాతినిధ్యం

రాజకీయ పార్టీలు పొందుతున్న ఓట్లకు, అవి గెలుచుకున్న సీట్లకు మధ్య చాలా వ్యత్యాసం ఉంటోంది. ఓట్లను గణనీయంగా పొందిన పార్టీ వాటి శాతాన్ని బట్టి సీట్లను సాధించలేకపోతోంది. అలాగే తక్కువ ఓట్లు వచ్చిన పార్టీ అధిక స్థానాలు గెలుచుకుంటోంది. 2014 ఎన్నికలలో మొదటిసారిగా బిజెపి కేవలం 31 శాతం ఓట్లతో లోక్‌సభలో సగానికి పైగా స్థానాలను గెలుచుకుంది. కాంగ్రెస్ పార్టీ 19.3 శాతం ఓట్లు సాధించినప్పటికీ కేవలం 44 సీట్లు మాత్రమే గెలుచుకోగలిగింది. 2024 లోక్‌సభ ఎన్నికలలో బిజెపి 36.56 శాతం ఓట్లతో 240 స్థానాలలో విజయం సాధించింది. కాంగ్రెస్ ఓట్ల శాతం కేవలం 1.89 శాతం మాత్రమే పెరిగినప్పటికీ 2014 ఎన్నికలతో పోలిస్తే 55 స్థానాలను అదనంగా గెలుచుకుంది.

రాష్ట్రాల వారీగా ఫలితాలను పరిశీలిస్తే ఉత్తరప్రదేశ్‌లో 2024 లోక్‌సభ ఎన్నికలలో బిఎస్‌పికి 9.39 శాతం ఓట్లు వచ్చాయి. కానీ ఒక్క సీటు కూడా సాధించలేదు. కాంగ్రెస్ పార్టీ 9.46 శాతం ఓట్లు తెచ్చుకొని 6 స్థానాలు గెలుచుకుంది. ఒడిషాలో బిజెపి 45.34 శాతం ఓట్లతో 20 సీట్లు గెలుచుకుంటే బిజెడి 37.53 శాతం ఓట్లు సాధించినప్పటికీ ఒక్క సీటూ రాలేదు. 12.52 శాతం ఓట్లు పొందిన కాంగ్రెస్ ఒకే ఒక సీటు గెలుచుకుంది. ఆంధ్రప్రదేశ్‌లో 39.61 శాతం ఓట్లు సాధించిన వైఎస్ఆర్‌సిపి కేవలం నాలుగు ఎంపి స్థానాలకే పరిమితమైతే దాని కంటే తక్కువగా 37.79 శాతం ఓట్లతో నాలుగు రెట్లు అదనంగా...అంటే 16 స్థానాలలో టిడిపి విజయం సాధించింది. ఢిల్లీలో బిజెపి 54.35 శాతం ఓట్లు తెచ్చుకొని మొత్తం ఏడు సీట్లనూ గెలుచుకోగా 24.17 శాతం ఓట్లు సాధించిన ఆప్ కానీ, 18.91 శాతం ఓట్లు పొందిన కాంగ్రెస్ కానీ ఒక్క సీటూ గెలుచుకోలేకపోయాయి.

2024 శాసనసభ ఎన్నికలలో ఆంధ్రప్రదేశ్‌లో వైఎస్ఆర్‌సిపి 39.37 శాతం ఓట్లు తెచ్చుకొని కేవలం 11 స్థానాలకే పరిమితమైంది. తెలుగుదేశం పార్టీ దాని కంటే సుమారు 6 శాతం ఓట్లు అదనంగా పొంది ఏకంగా 135 స్థానాలు గెలుచుకుంది. కేవలం 2.83 శాతం ఓట్లకే పరిమితమైన బిజెపి 8 సీట్లు సాధించింది. ఒడిషాలో బిజెపి కంటే బిజెడికి స్వల్పంగా ఓట్లు ఎక్కువ వచ్చినప్పటికీ గెలుచుకున్న సీట్ల సంఖ్యలో చాలా తేడా కన్పించింది. బిజెపి 78 సీట్లు సాధించగా బిజెడికి 51 స్థానాలు మాత్రమే వచ్చాయి. చిన్న చిన్న పార్టీలు గణనీయంగా ఓట్లు తెచ్చుకున్నప్పటికీ ఒక్క సీటు కూడా పొందలేకపోయాయి. ఓట్ల శాతంలో స్వల్ప మార్పు ఉన్నప్పటికీ సాధించిన సీట్లలో చాలా తేడా ఉంది.

ఈ అంతరాన్ని తొలగించాలంటే గతంలో లా కమిషన్ చేసిన ఒక సిఫార్సును అమలు చేయాల్సిన అవసరం ఉంది. ప్రస్తుతం లోక్‌సభలో ఉన్న 543 స్థానాలను ప్రత్యక్ష ఎన్నికల ద్వారా భర్తీ చేయాలని, దిగువసభ స్థానాల సంఖ్యను 25 శాతం పెంచి దామాషా ప్రాతినిధ్య పద్ధతిన భర్తీ చేయాలని లా కమిషన్ సిఫార్సు చేసింది. రాష్ట్ర శాసనసభలలో కూడా ఇదే విధానాన్ని అనుసరించాలి. తొలి దశలో ఈ ప్రయత్నం చేసి, ఆ తర్వాత దామాషా ప్రాతినిధ్య పద్ధతిలో సీట్ల వాటాను పెంచాలి.

జమిలీ ఎన్నికలకు వ్యతిరేకత

ఒకే దేశం...ఒకే ఎన్నిక విధానానికి సిపిఎం తన వ్యతిరేకతను పునరుద్ఘాటించింది. ఈ విధానం కొన్ని రాష్ట్ర శాసనసభల పదవీకాలాన్ని తగ్గిస్తుంది. రాష్ట్ర ప్రభుత్వం పతనమై శాసనసభ రద్దయితే మిగిలిన పదవీకాలానికి మాత్రమే మధ్యంతర ఎన్నికలు జరుగుతాయి. ఈ విధానం రాజ్యాంగం యొక్క ప్రాథమిక అంశాలైన ప్రజాస్వామ్యం, ఫెడరలిజంను నీరుకారుస్తుంది.

ఎన్నికల హామీలు

రాజకీయ పార్టీలు ఎన్నికల సందర్భంగా తాము ఇచ్చిన హామీల అమలుకు నిధులు ఎలా సమకూర్చుకుంటాయో చెప్పాల్సి ఉంటుందని గతంలో ఓ కేసులో సుప్రీంకోర్టు అభిప్రాయపడింది. ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత, జవాబుదారీతనం ప్రాధాన్యతను ఇది నొక్కి చెప్పినప్పటికీ తమ విధానాలు, కార్యక్రమాలు, హామీలను ప్రజలకు స్వేచ్ఛగా వివరించడంలో రాజకీయ పార్టీలకు ఉన్న హక్కుకు భంగకరంగా ఉంది. ఇందుకోసం ఎలాంటి చట్టం తీసుకొచ్చినా వ్యతిరేకిస్తామని మేము గతంలోనే స్పష్టం చేశాము.

ఇతర అంశాలు

ఎన్నికల ఫలితాలను ధనబలం ప్రభావితం చేస్తోందని, డబ్బు బాగా ఖర్చు చేయగలిగే పార్టీలే ఎన్నికలలో విజయం సాధిస్తున్నాయని సిపిఎం ఆందోళన వ్యక్తం చేసింది. దీనికి అడ్డుకట్ట వేయాలంటే ప్రభుత్వాలే పాక్షికంగా ఎన్నికల వ్యయాన్ని భరించాలని సూచించింది. రాజకీయ పార్టీల ఎన్నికల వ్యయ పరిమితిని సవరించాలని కోరింది. ప్రైవేటు మీడియా ఛానల్స్‌లో రాజకీయ పార్టీలకు తమ అభిప్రాయాలు తెలియజేసేందుకు కొంత సమయం కేటాయించాలని అభిప్రాయపడింది. ఈవీఎంలు, వివిపాట్లపై ప్రజలలో నెలకొన్న అనుమానాలను నివృత్తి చేయాలని ఎన్నికల కమిషన్‌ను కోరింది. పోలింగ్ సమాచారాన్ని అందజేయడంలో కచ్చితత్వాన్ని పాటించాలని, జాప్యాన్ని నివారించాలని కోరింది. ఎన్నికల కమిషన్ జారీ చేసే ప్రవర్తనా నియమావళి, ఇతర సూచనలను రాజకీయ పార్టీలు పాటించేలా చూడాలని చెప్పింది.

పాక్ కాల్పుల్లో ఐదుగురు మృతి

- జమ్మూకాశ్మీర్ సీనియర్ అధికారి సహా...
- సైనిక స్థావరాలే లక్ష్యంగా దాడులు
- తిప్పికొట్టిన భారత దళాలు

కమిషనర్ రాజ్‌కుమార్ థాపా (ఫైల్)

న్యూఢిల్లీ : సరిహద్దు ప్రాంతాలను లక్ష్యంగా చేసుకొని పాకిస్థాన్ డ్రోన్లు, ఫిరంగులతో దాడులకు తెగబడుతోంది. శనివారం ఉదయం జమ్మూకాశ్మీర్‌లోని రాజౌరిలో పాక్ దళాలు ఫిరంగులతో జరిపిన కాల్పులలో ఐదుగురు పౌరులు ప్రాణాలు కోల్పోయారు. వీరిలో జమ్మూకాశ్మీర్‌కు చెందిన సీనియర్ అధికారి కూడా ఉన్నారు. 'ఆపరేషన్ సిందూర్' నేపథ్యంలో గురువారం రాత్రి నుంచి పాక్ సరిహద్దు వెంబడి కాల్పులు కొనసాగిస్తున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే శనివారం ఉదయం కూడా దాడిని కొనసాగించింది. పాక్ వైపు నుంచి దూసొకొచ్చిన ఒక ఫిరంగీ గుండు రాజౌరి జిల్లా అభివృద్ధి అదనపు కమిషనర్ రాజ్‌కుమార్ థాపా (55) నివాసంలో పడింది. ఈ దాడిలో ఆయన తీవ్రంగా గాయపడి చనిపోయారు. థాపా జమ్మూ ప్రభుత్వ వైద్య కళాశాల నుంచి 1989లో ఎంబిబిఎస్ పూర్తి చేశారు.

జమ్మూ శివారులోని రాయ్‌పూర్ ప్రాంతంలో జకీర్ హుస్సేన్ అనే వ్యక్తి ఇంటిపై కూడా ఓ ఫిరంగీ గుండు పడింది. ఈ ఘటనలో ఆయన చనిపోగా..కుటుంబ సభ్యులు గాయపడ్డారు. పాక్ దళాల కాల్పులలో ఖేరీ జట్టాన్‌కు చెందిన అశోక్ కుమార్, ఆయన ముగ్గురు బంధువులు కూడా గాయాలపాలయ్యారు. దీంతో వారు సురక్షిత ప్రాంతానికి తరలిపోయారు. తాజా ఘటనలతో జమ్మూ ప్రాంతంలో పాక్ కాల్పులు, డ్రోన్–క్షిపణి దాడులలో మరణించిన వారి సంఖ్య ఐదుకు చేరింది. వీరిలో రాజౌరి పట్టణంలో ఉంటున్న ఇద్దరు బీహారీలు, పూంచ్‌లోని మెంధార్ ప్రాంతానికి చెందిన ఓ మహిళ కూడా ఉన్నారు. పాక్ దాడిలో సామాన్యులు, ఒక అధికారి చనిపోవడం పట్ల జమ్మూ కాశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు సంతాపం తెలిపారు. థాపా శుక్రవారం ఉప ముఖ్యమంత్రి సురీందర్ కుమార్ చౌదరితో కలిసి జిల్లాలో పర్యటించారని గుర్తు చేసుకున్నారు. తన అధ్యక్షతన జరిగిన ఆన్‌లైన్ సమావేశానికి కూడా థాపా హాజరయ్యారని ఒమర్ అబ్దుల్లా చెప్పారు. అంకితభావం కలిగిన అధికారిని కోల్పోవడం పట్ల విచారం వ్యక్తం చేయడానికి కూడా తనకు మాటలు రావడం లేదని సామాజిక మాధ్యమం ఎక్స్‌లో పోస్ట్ చేశారు.

పాకిస్తాన్‌కు గట్టి జవాబు ఇస్తున్నాం

- కల్నర్ సోఫియా ఖురేషి

న్యూఢిల్లీ : పాకిస్తాన్‌కు గట్టి జవాబు ఇస్తున్నామని కల్నర్ సోఫియా ఖురేషి తెలిపారు. శనివారం జరిగిన ప్రెస్‌మీట్‌లో కల్నర్ సోఫియా ఖురేషి మాట్లాడుతూ.. పాకిస్తాన్ రెచ్చగొడుతూ దాడులు చేస్తూనే ఉందన్నారు. 24 చోట్ల ఫైటర్ జెట్లతో దాడికి ప్రయత్నించిందని.. పాకిస్తాన్ భారత సరిహద్దుల వెంట భారీగా దాడులు చేస్తోందని తెలిపారు. శ్రీనగర్, అవంతీపురా, ఉద్ధంపూర్ వైమానిక స్థావరాలపై దాడులు చేసిందన్నారు. ప్రతీగా పాకిస్తాన్ ఎయిర్ బేస్‌లపై భారత్ ప్రతిదాడులు చేసిందన్నా. భారత్ పూర్తి సంయమనంతో వ్యవహరిస్తోందని తెలిపారు. ప్రతిదాడుల్లో భాగంగా బాలిస్టిక్ క్షిపణులను వాడుతున్నామన్నారు. ఎస్–400ను ధ్వంసం చేశామంటూ పాక్ తప్పుడు ప్రచారం చేస్తున్నట్లు తెలిపారు. వింగ్ కమాండర్ వ్యోమిక సింగ్ మాట్లాడుతూ.. పశ్చిమ సరిహద్దుల్లో పాక్ మిస్సైల్ దాడులకు పాల్పడుతుందన్నారు. పాక్ ఫైటర్ జెట్లు పదేపదే భారత భూభాగంలోకి చొచ్చుకువస్తున్నాయన్నారు. పంజాబ్‌లోని పలు కీలకమైన ఎయిర్ బేస్‌లను లక్ష్యంగా చేసుకున్నాయని.. మానవత్వం మరిచి శ్రీనగర్‌లోని స్కూళ్లు, ఆసుపత్రులపై కూడా దాడులకు తెగబడుతోందన్నారు. రాడార్ కేంద్రాలు, ఆయుధ నిల్వ కేంద్రాలను కూడా టార్గెట్ చేస్తున్నట్లు తెలిపారు. శ్రీనగర్‌లోని విద్యా సంస్థలు, వైద్యాలయాలపై దాడులు చేయడం వారి మానవత్వం లేని చర్యలకు నిదర్శనమన్నారు. అయితే భారత సైన్యం పూర్తి అప్రమత్తతతో ఉంటూ శత్రువుల ప్రతి చర్యను తిప్పికొడుతోందన్నారు.

ఢిల్లీలోని హరికిషన్ సింగ్ సుర్జీత్ భవన్‌లో ఆశ్రయం పొందిన విద్యార్థులతో సిపిఎం ప్రధాన కార్యదర్శి ఎంఎ బేబీ

విద్యార్థులకు ఎస్‌ఎఫ్‌ఐ ఆశ్రయం

- సరిహద్దుల నుంచి వచ్చినవారికి ఢిల్లీలో వసతి
- ప్రత్యేక రైళ్లు నడపాలని రైల్వే మంత్రికి లేఖ

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

సరిహద్దు ప్రాంతాల్లో చిక్కుకున్న విద్యార్థులకు ఎస్ఎఫ్ఐ ఆశ్రయం కల్పించింది. ఈ మేరకు ఏర్పాటు చేసిన హెల్ప్‌లైన్ డెస్క్ ద్వారా వందలాది మంది విద్యార్థులు ఎస్ఎఫ్ఐని సంప్రదించారు. చాలా మంది విద్యార్థులను సరైన సమయంలో సురక్షితంగా తమ ప్రాంతాలకు తరలించేందుకు ఎస్ఎఫ్ఐ విజయవంతంగా సహాయపడింది. జమ్మూ కాశ్మీర్, పంజాబ్, చండీగఢ్ మొదలైన ప్రాంతాల నుండి వచ్చిన విద్యార్థులను ఢిల్లీ రైల్వే స్టేషన్‌లోనే ఎస్ఎఫ్ఐ నాయకత్వం రిసీవ్ చేసుకుంది. ఎస్ఎఫ్ఐ సహాయ కార్యదర్శి దీప్షితా దార్, ఢిల్లీ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు సూరజ్ ఎలామోన్, ఐషీఘోష్, కేంద్ర కమిటీ సభ్యులు అభిజిత్ మణిలాల్, స్థానిక నాయకులు మోహినా ఫాతిమా, అనిల్ సేతుమాధవన్‌తో కూడిన ప్రతినిధి బృందం ఢిల్లీ రైల్వే స్టేషన్‌లో విద్యార్థులకు స్వాగతం పలికారు. వారికి ఢిల్లీలోని హరికిషన్ సింగ్ సుర్జీత్ భవన్‌లో వసతి కల్పించారు. అక్కడ, ఎంఎ బేబి విద్యార్థులను కలిసి వారితో మాట్లాడారు. హెల్ప్‌లైన్ ఇప్పటికీ అందుబాటులో ఉందని ఎస్ఎఫ్ఐ అఖిల భారత అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు విపి సాను, మయూక్ బిశ్వాస్ తెలిపారు. జమ్మూకాశ్మీర్, పంజాబ్, రాజస్తాన్, గుజరాత్‌లోని కొన్ని ప్రాంతాలలో ప్రస్తుత పరిస్థితి ఆందోళన కలిగిస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. సరైనా సౌకర్యాలు లేకపోవడంతో విద్యార్థులు తమ ఇళ్లకు వెళ్లలేకపోతున్నారని పేర్కొన్నారు. ఎస్ఎఫ్ఐ ప్రధాన కార్యదర్శి మయూఖ్ బిశ్వాస్, సంయుక్త కార్యదర్శి ఆదర్శ్ ఎం సాజి, ఎస్ శిల్పతో కలిసి భటిండాలోని పంజాబ్ సెంట్రల్ యూనివర్శిటీని, క్యాంపస్‌లోని విద్యార్థులను కలిశారు. పంజాబ్‌లోని భటిండాలో పాకిస్తాన్ సైన్యం డ్రోన్ దాడి చేసిందని, మన సైన్యం ఆ దాడిని విజయవంతంగా తిప్పికొట్టిందని అన్నారు. ఈ సంఘటన పంజాబ్ సెంట్రల్ యూనివర్శిటీ హాస్టల్ సమీపంలో జరిగిందని, విద్యార్థులను సురక్షిత ప్రదేశాలకు తరలించడానికి జోక్యం చేసుకోవాలని ఎస్ఎఫ్ఐ నాయకులు విశ్వవిద్యాలయ అధికారులను కలిశారు. కాగా హింస ప్రభావిత ప్రాంతాల నుండి వచ్చిన విద్యార్థుల కోసం ప్రత్యేక రైళ్లను అందుబాటులోకి తీసుకురావాలని ఎస్ఎఫ్ఐ డిమాండ్ చేసింది. పాఠశాలలు, విద్యా సంస్థలు మూసివేయడంతో ఆయా ప్రాంతాల్లో చదువుతున్న విద్యార్థులు తమ స్వస్థలాలకు వెళ్లేందుకు తగినంత సంఖ్యలో బస్సులు, రైళ్లు అందుబాటులో లేవని, అందువల్ల వారి ఇళ్లకు తిరిగి వెళ్లడం కష్టంగా ఉందని ఎస్ఎఫ్ఐ తెలిపింది.

ఢిల్లీ ఎయిర్‌పోర్టు కార్యకలాపాలు పునఃప్రారంభం

న్యూఢిల్లీ : భారత్ –పాక్ సరిహద్దుల వద్ద ఉద్రిక్తతల నేపథ్యంలో దేశంలో పలు విమానాశ్రయాలను తాత్కాలికంగా మూసివేసిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో ఢిల్లీ ఎయిర్‌పోర్టు కీలక ప్రకటన చేసింది. ఇందిరా గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో శనివారం ఉదయం నుంచి కార్యకలాపాలు పునఃప్రారంభించినట్లు అధికారులు తెలిపారు. అయితే, ప్రయాణికులకు పలు సూచనలు జారీ చేశారు. తమ విమానాల తాజా సమాచారం కోసం ఎప్పటికప్పుడు విమాన సంస్థలను సంప్రదించాలని, అలాగే హ్యాండ్ బాగేజ్, చెక్–ఇన్ లగేజీ నిబంధనలు పాటించాలని తెలిపింది. భద్రతా తనిఖీలకు ముందుగా సమయం కేటాయిస్తూ విమానాశ్రయానికి ముందుగానే చేరుకోవాలని, అధికారిక వెబ్‌సైట్ ద్వారానే సమాచారం నిర్ధారించుకోవాలని తెలిపింది.

కర్రెగుట్టలో ఆపరేషన్ కగార్‌కు బ్రేక్

న్యూఢిల్లీ : కర్రెగుట్టలో ఆపరేషన్ కగార్‌కు బ్రేక్ పడింది. భారత్–పాక్ సరిహద్దుల్లో ఉద్రిక్తతల నేపథ్యంలో ఆపరేషన్ సిందూర్‌లో పాల్గొనేందుకు సిఆర్‌పిఎఫ్ బలగాలను దశల వారీగా వెనక్కి రప్పిస్తున్నారు అధికారులు. సిఆర్‌పిఎఫ్ జవాన్లను ఆదివారం సాయంత్రం లోగా హెడ్క్వార్టర్స్‌కు చేరుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. దీంతో పామునూరు, ఆలుబాక, పెద్దగుట్ట నుంచి బలగాలు వెనక్కి తగ్గాయి. కాగా ఛత్తీస్‌గఢ్ వైపు ఆపరేష్ కగార్ యథావిధిగా కొనసాగనున్నట్లు సమాచారం.

పాకిస్థాన్‌కు ఐఎంఎఫ్ 2.1 బిలియన్ డాలర్ల రుణం

వాషింగ్టన్ : తీవ్ర ఆర్థిక ఇబ్బందులతో కొట్టుమిట్టాడుతున్న పాకిస్థాన్‌కు తక్షణమే బిలియన్ డాలర్ల ఆర్థిక సహాయాన్ని విడుదల చేసేందుకు అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్) సంస్థ ఆమోదం తెలిపింది. ఈ నిర్ణయంతో మొత్తం ఆర్థిక సాయంలో భాగంగా ఇప్పటివరకు సుమారు 2.1 బిలియన్ డాలర్లు పాకిస్థాన్‌కు అందినట్లయింది. ఐఎంఎఫ్ నిర్ణయంపై పాకిస్థాన్ ప్రధానమంత్రి కార్యాలయం హర్షం వ్యక్తం చేసింది. మరోవైపు, పాకిస్థాన్‌కు ఈ ఆర్థిక సహాయం అందించడాన్ని భారత్ తీవ్రంగా వ్యతిరేకించింది. ఈ నిధులను పాకిస్థాన్ సరిహద్దు ఉగ్రవాదాన్ని ప్రోత్సహించడానికి దుర్వినియోగం చేసే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేసింది.

20న సమ్మె విజయవంతం చేయాలి

(మొదటిపేజీ తరువాయి)

కార్యక్రమాలను వివరించారు.

ఈ సదస్సులో బిఎస్ఎన్ఎల్ ఉద్యోగ సంఘం రాష్ట్ర నాయకులు ఎల్ కృష్ణ బాలాజీ, యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు ఎల్ రాజు, బ్యాంక్ అధికారుల సంఘం రాష్ట్ర నాయకులు కెవివిఎల్ నరసింహం, బీమా ఉద్యోగ సంఘం నాయకులు సిహెచ్ కళాధర్ ప్రసంగించారు. సభ ప్రారంభంలో పహల్గాం ఉగ్రదాడి మృతులకు సంతాపం తెలుపుతూ ఒక నిమిషం మౌనం పాటించారు. వీరితోపాటు సదస్సులో ఎఐబిఇఎ, ఎఐబిఒఎ, ఎఐఐఇఎ, బిఎస్ఎన్ఎల్ఇయు, ఎన్ఎఫ్‌టియు, ఎన్ఎఫ్‌పిఇ, ఎఐఎల్ఐసిఇఎఫ్ సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

ప్రత్యామ్నాయ మీడియా గొంతునొక్కే యత్నం

- వైర్, న్యూస్‌లాండ్రీ వెబ్‌పోర్టళ్ల బ్లాక్
- కట్టుకథలతో రెచ్చిపోతున్న గోడీ మీడియాపై సైలెంట్
- కేంద్రం తీరుపై సర్వత్రా విమర్శలు

న్యూఢిల్లీ : ప్రస్తుతం భారతావని యుద్ధం అనే పొగమంచుతో కప్పి ఉంది. సరిహద్దులో ఏం జరుగుతోందో తెలియని పరిస్థితి. అధికారిక సమాచారం వచ్చే వరకూ ఓపికగా వేచి ఉండడం తప్పనిసరి. కానీ బిజెపికి అనుకూలంగా వ్యవహరిస్తున్న కొన్ని మీడియా సంస్థలు (గోడీ మీడియా) హద్దులు దాటేస్తున్నాయి. స్వీయ నియంత్రణ రేఖను కూడా పట్టించుకోకుండా కట్టుకథలు కుమ్మరిస్తున్నాయి. పనిలో పనిగా ఆర్ఎస్ఎస్ హిందూత్వ మతతత్వ అజెండాను జొప్పిస్తున్నాయి. అయితే వీటిపై నోరు మెదపని కేంద్ర ప్రభుత్వం అడ్వయిజరీలతో సరిపెడుతోందే తప్ప చర్యలు తీసుకోవడం లేదు. మరోవైపు స్వతంత్ర మీడియా సంస్థలుగా ప్రత్యామ్నాయ కథనాలను అందిస్తున్న ద వైర్, న్యూస్‌లాండ్రీ వంటి సంస్థలపై బిజెపి ప్రభుత్వం ప్రస్తుత పరిస్థితులను సాకుగా చూపి కక్షపూరిత చర్యలకు పాల్పడుతోంది. ఇప్పటికే ఆ రెండు సంస్థల వెబ్ సైట్లను బ్లాక్ చేసింది. వాటిలోని కొన్ని కథనాలను తొలగించాలని ఆంక్షలు పెట్టింది. వాటిని తొలగించిన తర్వాత వెబ్ పోర్టళ్లపై నిషేధం ఎత్తివేసింది. ఇప్పుడు ఆ రెండు వెబ్ పోర్టళ్లు అందుబాటులోకి వచ్చినా అనధికారిక బ్లాకింగ్ కొనసాగుతోందన్న విమర్శలు వస్తున్నాయి.

గోడి మీడియా 'ఆపరేషన్'

గోడి మీడియాగా ముద్ర పడ్డ బిజెపి, సంఘ్ పరివార్ అనుకూల ఛానెళ్లు, మీడియా సంస్థలు ప్రస్తుత పరిస్థితులకు మతం రంగు పులిమే కథనాలను కుమ్మరిస్తున్నాయి. భావోద్వేగాలను రెచ్చగొడుతూ కట్టుకథలు అల్లుతున్నాయి. టివి ఛానల్స్ అయితే ఓ అడుగు ముందుకేసి సొంతంగా 'ఆపరేషన్' మొదలు పెట్టాయి. పహల్గాంలో ఉగ్రదాడి జరిగిన మరుక్షణం నుంచే టివి యాంకర్లు పాక్‌తో యుద్ధం చేయాల్సిందేనంటూ కథనాలు వండి వార్చారు. ఆ యుద్ధాన్ని ఎలా నిర్వహించాలో కూడా నిపుణుల మాదిరిగా చెప్పేస్తున్నారు. తప్పుడు సమాచారం అందిస్తూ, నాటకీయత జోడిస్తూ చెవులు చిల్లులు పడేలా శబ్దాలు వినిపిస్తూ వీక్షకుల సహనాన్ని పరీక్షిస్తున్నాయి. ప్రభుత్వం, అధికారులు మీడియా సంస్థలకు అడ్వైజరీలు ఇచ్చి ఊరుకుంటున్నారే తప్ప తప్పుడు వార్తలు ప్రసారం చేస్తున్నందుకు చర్యలు తీసుకుంటున్న దాఖలాలు కన్పించడం లేదు. ఆ సంస్థలపై చర్యలు తీసుకునే అధికారం చట్ట ప్రకారం ప్రభుత్వానికి ఉంది. కానీ సున్నితంగా మందలించడం కూడా జరగడం లేదు. ప్రభుత్వం తన అధికారిక బ్రీఫింగ్‌కు భిన్నంగా వస్తున్న వార్తలపై దృష్టి సారించడం ఎంతో అవసరం. నియంత్రణ రేఖకు సమీపంలో నివసిస్తున్న కాశ్మీరీలు పడుతున్న ఇబ్బందులపై గోడీ మీడియాలోని ఏ సంస్థ కూడా కథనాలు ఇవ్వడం లేదు. సరిహద్దు వెంబడి జరుగుతున్న కాల్పులలో మరణించిన వారి వివరాలను 'ది ఇండియన్ ఎక్స్‌ప్రెస్', కాశ్మీర్ టైమ్స్ పత్రిక వంటి కొన్ని మీడియా సంస్థలు మాత్రమే కథనాలు ఇస్తున్నాయి.

8 వేల ఖాతాలు బ్లాక్ చేసిన ఎక్స్

దేశంలోని ఎనిమిది వేల ఖాతాలను బ్లాక్ చేయాల్సిందిగా కేంద్ర ప్రభుత్వం నుంచి సామాజిక మాధ్యమ వేదిక ఎక్స్‌కు ఆదేశాలు అందాయి. వీటిని అనుసరించి ఆ సంస్థ ఆయా ఖాతాలను బ్లాక్ చేసింది. వీటిలో మక్తూర్ మీడియా, బిబిసి ఉర్దూ, ఫ్రీ ప్రెస్ కాశ్మీర్, ది కాశ్మీరియత్‌తో పాటు పాత్రికేయులు ముజామిల్ జలీల్, అనురాధా బాసిన్ ఖాతాలు ఉన్నాయి. అయితే ఎక్స్‌కు చెందిన గ్లోబల్ గవర్నమెంట్ అఫైర్స్ హ్యాండిల్ ప్రభుత్వ నిర్ణయాన్ని తప్పు పట్టింది. ఇది భావ ప్రకటనా స్వేచ్ఛకు విఘాతం కలిగిస్తోందని విమర్శించింది.

చిన్న కారణాలతోనూ సుప్రీంకోర్టుకు వచ్చేస్తున్నారు !

- దిగువ కోర్టుల ఆదేశాలను సవాలు చేస్తూ పిటిషన్లు
- సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నాగరత్న

న్యూఢిల్లీ : సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బి.వి.నాగరత్న ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. సర్వోన్నత న్యాయస్థానం ఫ్యామిలీ కోర్టు నుంచి బెయిల్ కోర్టు వరకు వేర్వేరు పాత్రలను పోషించాల్సివస్తోందని అన్నారు. చిన్న కారణాలతో కూడా న్యాయవాదులు సుప్రీంకోర్టుకు అప్పీలు చేసుకుంటున్నారని తెలిపారు. సర్వోన్నత న్యాయస్థానం దృష్టి సారించాల్సిన కేసులు.. ఆ విషయాన్ని అరుదుగానే పొందుతాయన్నారు. దిగువ కోర్టుల ప్రతి దశ, ఆదేశాన్ని సవాలు చేస్తూ సుప్రీంకోర్టులో పిటిషన్లు నిండిపోయాయి. "హైకోర్టులు తిరిగి పంపిన కేసులు మళ్లీ సుప్రీంకోర్టుకు తిరిగి వస్తాయి. దిగువ కోర్టులు ఇచ్చే వాయిదాలు, వాదనలలో సవరణలను అనుమతించటం కోసం ఇంప్లీడ్మెంట్లకు వ్యతిరేకంగా పిటిషన్లు దాఖలవుతాయి" అని ఆమె అన్నారు. సుప్రీంకోర్టుకు భారీగా కేసులు రావటం వల్ల అసలు దృష్టి, ఉద్దేశ్యం నీరుగారిపోతున్నదని తెలిపారు. "మాకు ఫ్యామిలీ కోర్టు, ట్రయల్ కోర్టు, బెయిల్ కోర్టు, హైకోర్టు కూడా అనే అనేక అవతారాలున్నాయి. ప్రతి ఒక్కదానికీ.. ఇక్కడి పిటిషన్లు దాఖలవుతున్నాయి. వీటన్నిటిలో, ఒక సుప్రీంకోర్టుగా మా న్యాయపరిధి ఎక్కడున్నది?" అని జస్టిస్ నాగరత్న తెలిపారు. కాగా, సీనియారిటీ పరంగా చూస్తే.. నాగరత్న భారత తొలి మహిళా ప్రధాన న్యాయమూర్తి అయ్యే అవకాశం ఉన్నది. కొన్ని సందర్భాలలో హైకోర్టులను తుది కోర్టుగా మార్చాల్సినవసరం ఉన్నదని ఆమె చెప్పారు. అందరూ న్యాయం పొందటం సమ్మతమే అయినా.. సర్వోన్నత న్యాయస్థానంలో పిటిషన్ దాఖలు చేయటానికి ముందు విచక్షణ అవసరమనీ, ఇది కోర్టు పని తీరుపై తీవ్ర ప్రభావాన్ని చూపుతుందని ఆమె అభిప్రాయపడ్డారు. దేశవ్యాప్తంగా సుప్రీం, హైకోర్టులతో పాటు దిగువ న్యాయ స్థానాల్లో పెద్ద ఎత్తున కేసులు పెండింగ్‌లో ఉన్న విషయం విదితమే. ఇలాంటి తరుణంలో జస్టిస్ నాగరత్న వ్యాఖ్యలు ప్రాధాన్యతను సంతరించుకున్నాయి.

అమృత్‌సర్‌లో పాక్ డ్రోన్ల కూల్చివేత

- సోషల్ మీడియాలో వీడియో షేర్ చేసిన భారత ఆర్మీ

అమృత్‌సర్ : భారత్‌లోని సరిహద్దు ప్రాంతాలను లక్ష్యంగా చేసుకొని పాకిస్థాన్ డ్రోన్ దాడులకు తెగబడుతోన్న విషయం తెలిసిందే. శనివారం తెల్లవారుజామున అమృత్‌సర్‌లోని ఖాసా కంటోన్మెంట్ గగనతలంలో భద్రతా బలగాలు పాకిస్తాన్ డ్రోన్‌ను గుర్తించి కూల్చివేశాయి. దీనికి సంబంధించిన వీడియోను, చిత్రాలను సోషల్ మీడియాలో షేర్ చేశారు. అలాగే చండీగఢ్‌లోనూ తెల్లవారుజామున దాడులు జరిగినట్లు అధికారులు పేర్కొన్నారు. పఠాన్‌కోట్‌లో ఉదయం 5 గంటలకు భారీ పేలుళ్ల శబ్దాలు వచ్చినట్లు తెలిపారు. జమ్మూ నుంచి గుజరాత్ వరకు పలుచోట్ల పాక్ దాడులకు పాల్పడగా.. భారత సైన్యం వాటిని సమర్థంగా తిప్పికొట్టినట్లు తెలిపారు. శ్రీనగర్ విమానాశ్రయం, ఎయిర్ బేస్ పైనా డ్రోన్లతో దాడికి పాక్ డ్రోన్లతో దాడికి యత్నించినట్లు తెలుస్తోంది.

ఛార్‌ధామ్ యాత్ర నిలిపివేత

డెహ్రాడూన్ : భద్రతా పరిస్థితుల దృష్ట్యా ఛార్‌ధామ్ యాత్రను నిలిపివేస్తున్నట్లు ఉత్తరాఖండ్ సివిల్ ఏవియేషన్ డెవలప్‌మెంట్ అథారటీ (యుసిఎడిఎ) శనివారం ప్రకటించింది. తదుపరి ఉత్తర్వులు జారీ చేసేవరకూ కేదార్‌నాథ్, బద్రీనాథ్, యమనోత్రి, గంగోత్రికి రవాణా సౌకర్యాలను నిలిపివేస్తున్నట్లు శనివారం యుసిఎడిఎ తన ప్రకటనలో తెలిపింది. అలాగే ఈ నాలుగు థామ్‌ల్లో ప్రత్యేక తాత్కాలిక పోలీస్ స్టేషన్లు ఏర్పాటు చేస్తున్నట్లు ఉత్తరాఖండ్ డిజిపి అభినవ్‌కుమార్ శనివారం ధ్రువీకరించారు.

సిరియాలో తిరిగి ఇళ్లకు చేరుతున్న ప్రజలు

- స్వస్థలాలకు పది లక్షల మంది : ఐరాస

న్యూయార్క్ : నిత్యం బాంబు పేలుళ్లు, దాడులతో సతమతమౌతున్న సిరియాలో ప్రజలు ఒక చోటు నుంచి మరొక చోటుకు వలస వెళ్లడం పరిపాటి. దీనికి తోడు బాంబులు, ఇతర పేలుడు పదార్థాలు, యుద్ధ పరికరాల తయారీ కర్మాగారాలు (ఆర్డినెన్స్), మైనింగ్ కోసం వినియోగించే పేలుడు సామగ్రి కారణంగా సిరియా వ్యాప్తంగా అనేక ప్రాంతాల్లో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటుంటారు. దీంతో ప్రాణ రక్షణ కోసం ఇతర ప్రాంతాలకు వలస వెళ్లడం, పరిస్థితి సానుకూలంగా ఉన్నప్పుడు తిరిగి ఇళ్లకు చేరడం అక్కడ నిత్యకృత్యమైందని ఐక్యరాజ్యసమితికి చెందిన కోఆర్డినేషన్ ఆఫ్ హ్యూమన్ అఫైర్స్ (ఒసిహెచ్ఎ – ఒచా) అధికారులు తెలిపారు. గత ఏడాది నవంబరు నుంచి 6.7 లక్షల మంది ఇలా స్వస్థలాలు వీడి ఇతర ప్రాంతాలకు వలస వెళ్లారని చెప్పారు. అయితే మరో పది లక్షల మంది ఇతరులు తమ స్వస్థలాలకు తిరుగుముఖం పట్టారని పేర్కొన్నారు. పేలుళ్ల, వాటి దుష్ప్రభావాల కారణంగా గతేడాది డిసెంబర్ 8 నుండి 367 మంది చనిపోయారని, మరో 542 మంది గాయపడ్డారని తెలిపారు. బాధితుల్లో మూడింట ఒక వంతు చిన్నారులే కావడం ఆందోళన కలిగిస్తోందని పేర్కొన్నారు. రక్షిత ప్రాంతాలుగా భావించి తాత్కాలిక ఆవాసాలు ఏర్పాటు చేసుకున్న చోట్ల మానవతా సాయం అవసరం చాలా ఎక్కువ ఉందని ఐరాస అధికారులు తెలిపారు. ప్రధానంగా చిన్నారులకు పోషకాహారం, నీటి సరఫరా, జీవనోపాధి అకాశాల కల్పన అవసరమని తెలిపారు. దాదాపు 80 లక్షల మంది సాయం అందజేయాల్సిన అవసరం ఉందని, ఇందుకోసం ప్రపంచ మానవాళి స్పందించాల్సివుందని తెలిపారు.

పాక్ గగనతలంలో అన్ని విమానాలకు అనుమతి

ఇస్లామాబాద్ : తమ గగనతలంలో అన్ని రకాల విమానాల రాకపోకలకు అనుమతి ప్రారంభించినట్లు పాకిస్తాన్ శనివారం ప్రకటించింది. భారత్‌తో కాల్పుల విరమణ ఒప్పందం ప్రకటించిన కొన్ని గంటలకే పాకిస్తాన్ విమానాశ్రయాల అథారిటీ (పిఎఎ) ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేసింది. 'దేశంలో అన్ని విమానాశ్రయాలు సాధారణ విమాన కార్యకలాపాలకు అందుబాటులో ఉన్నాయి. ప్రయాణీకులు తమ విమానాల రాకపోకల తాజా షెడ్యూల్ కోసం సంబంధిత విమానయాన సంస్థలను సంప్రదించాలి' అని ప్రకటనలో తెలిపింది.

ఉద్రిక్తతలు తగ్గించే అంశాన్ని పరిశీలిస్తున్నాం : పాక్ మంత్రి

భారత్ సైనిక దాడులను ఆపితే.. ఉద్రిక్తతలను తగ్గించే విషయాన్ని తమ దేశం పరిశీలిస్తుందని పాకిస్తాన్ విదేశాంగ మంత్రి ఇషాక్ దార్ శనివారం తెలిపారు. పాకిస్తాన్ ప్రతిస్పందిస్తే ఉద్రిక్తతలను తగ్గించకుండా ఉండటానికి కట్టుబడి ఉన్నామని భారత్ ప్రకటించిన తరువాత పాక్ మంత్రి ఈ విధంగా వ్యాఖ్యానించారు. భారత్ దాడులు చేస్తే మా దేశం కూడా దాన్నే అనుసరిస్తుందని తెలిపారు. అమెరికా విదేశాంగ కార్యదర్శి మార్కో రూబియో కూడా ఇదే విషయాన్ని తెలియచేసినట్లు పాక్ మంత్రి తెలిపారు.

కాల్పుల విరమణ

(మొదటిపేజీ తరువాయి)

శాఖ ధృవీకరించింది.

ఉగ్రవాద చర్యలను యుద్ధంగానే చూస్తాం..

ఇక నుండి చోటుచేసుకునే ఉగ్రవాద చర్యలను దేశంపై జరిగే యుద్ధంగానే పరిగణిస్తామని భారత్ ప్రకటించింది. కాల్పుల విరమణ ప్రకటన అనంతరం రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్, త్రివిధ దళాల అధిపతులు, ఉన్నతాధికారులతో ప్రధాని నరేంద్ర మోడీ శనివారం సాయంత్రం ఉన్నత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశం అనంతరం ఈ మేరకు ప్రకటించారు.

ఉగ్రవాదంపై రాజీపడం : జైశంకర్

కాల్పుల విరమణ, సైనిక చర్యలను నిలిపివేయడంపై భారత్, పాక్ శనివారం ఓ అవగాహనకు వచ్చాయని విదేశాంగశాఖ మంత్రి ఎస్ జైశంకర్ పేర్కొనారు. ఉగ్రవాదం విషయంలో భారత్ తన రాజీలేని వైఖరిని కొనసాగిస్తుందని ఎక్స్ వేదికగా పేర్కొన్నారు.

ప్రయత్నం

ఒక స్కూల్లో హేమంతి, ఇందు అనే ఇద్దరు స్నేహితురాళ్లు ఉన్నారు. ఎనిమిదో తరగతి చదువుతున్నారు. ఒకసారి పాఠశాలలో జరిగిన ఫార్మేటివ్ పరీక్షలో హేమంతికి తక్కువ మార్కులు వచ్చాయి. అప్పుడు తను చాలా నిరుత్సాహపడింది. దిగులుగా ఉన్న హేమంతి దగ్గరికి ఇందు వచ్చింది. 'హేమంతీ బాధపడకు. మంచి మార్కులు తెచ్చుకోవాలంటే మరలా ప్రయత్నించాలి. ఎందుకు మార్కులు తగ్గాయో అర్థం చేసుకుని బాగా చదవాలి. మనం తప్పుగా రాయడం వలన, లేదా చేతిరాత బాగోలేక పోవడం వలన, లేకపోతే అన్ని ప్రశ్నలు రాయలేకపోవడం వలన, ఏమైనా తప్పులు జరిగాయా! తెలుసుకోవాలి. ఆ లోపం సరిదిద్దుకొని ఈసారి పరీక్షకు సిద్ధం కావాలి' అంది.

ఆ మాటలతో తన తప్పులు తెలుసుకొని మరలా బాగా చదివింది హేమంతి. తరువాత జరిగిన సమ్మెటివ్ పరీక్షల్లో హేమంతికి తరగతిలో ఫస్ట్ వచ్చింది. ఎప్పుడూ తరగతి ఫస్ట్ వచ్చే ఇందు ఈసారి తరగతి సెకండ్ వచ్చింది. అయినా తన స్నేహితులురాలికి ఫస్ట్ వచ్చినందుకు ఎంతో సంతోషించింది.

'నీలాంటి స్నేహితురాలు దొరకడం నా అదృష్టం' అని సంతోషంగా చెప్పింది హేమంతి. 'నాక్కూడా చాలా ఆనందంగా ఉంది. అయితే చదువులో ఎప్పుడూ పోటీ ఉండాలి. ఈసారి పరీక్షలో నేను ఫస్ట్ తెచ్చుకోవడానికి ప్రయత్నం చేస్తాను' అని ఆత్మవిశ్వాసంతో చెప్పింది ఇందు. 'సరే! అయితే ఈ పోటీకి నేను సిద్ధమే! అయినా మన ఇద్దరిలో ఎవరికి ఫస్ట్ వచ్చినా మన స్నేహం ఎప్పటికీ ఇలానే కొనసాగాలి' అని చెప్పుకుంటూ ఇందు, హేమంతి ఒకరి భుజం మీద మరొకరు చేయి వేసి తరగతి గదికి వెళ్లారు.

– పి.హేమంతి,
7వ. తరగతి,
జిల్లా పరిషత్ హై స్కూలు,
కూండ్రం, అనకాపల్లి.

డా.బి.ఆర్.అంబేద్కర్

దళితవాడలో జన్మించి,
అసమానతల్ని ఎదుర్కొన్న వీరుడు
అణగారిన వర్గానికి ఆదర్శంగా
ప్రతి అడుగూ పోరాటంగా వేసిన ధీరుడు.

చీకటిని చీల్చిన జ్ఞాన జ్యోతి
వెలుగుగా మారిన గ్రంథకారుడు
కులవివక్షను అనుభవించి
చరిత్రను మార్చిన కర్తవ్యవంతుడు.
అంటరానితనాన్ని, అన్యాయాలను ఎదిరించిన
అభ్యుదయ మార్గదర్శకుడు

విద్యను ఆయుధంగా మార్చి
విద్వత్తుతో సమాజాన్ని అలంకరించిన యోధుడు.

దళితుల గుండె ధైర్యంగా నిలిచి,
సమానత్వాన్ని కోరుకున్న ధైర్యవంతుడు
భారత రాజ్యాంగాన్ని రూపొందించి
పరిపాలనకు మార్గదర్శిగా నిలిచిన మహోన్నతుడు
అతడే డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్.

– గాదం అరుణ్ కుమార్,
బి.టెక్.
ప్రథమ సంవత్సరం.

బొమ్మల కొలువు

ఎం.శీర్షిక, 2వ తరగతి,
డా.కెఎల్‌పి పబ్లిక్ స్కూలు, గుంటూరు.

వి. శైలి ప్రణన్య,
5వ తరగతి,
కమల కాన్సెప్ట్ స్కూలు,
మార్కాపురం, ప్రకాశం జిల్లా.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com 83329 25496

JEEVANA జీవన the family

జీవన సౌరభం

గమ్యం స్థిరంగా ఉండాలి.
మార్గం కచ్చితంగా నిర్ణయించుకోవాలి.
ప్రయత్నం రాజీలేని ధోరణిలో సాగాలి.
అప్పుడే విజయం మనదవుతుంది.

జీవిత పాఠాల తొలి గురువు అమ్మ

నేడు మాతృ దినోత్సవం

అమితమైన ప్రేమ.
అంతులేని అనురాగం..
అలుపెరగని ఓర్పు...
అద్భుతమైన స్నేహం....
అపురూపమైన కావ్యం.....
అరుదైన రూపం అమ్మ......

అమ్మ.. పేరులోని ప్రేమని... పిలుపులోని మాధుర్యాన్ని నింపుకున్న అమృతమూర్తి అమ్మ. అమ్మ ప్రేమ గురించి ఎంత చెప్పినా తక్కువే. అమ్మను ఎంత పొగిడినా తక్కువే. త్యాగమూ, ప్రేమా కలిస్తే అందులో నుంచి అమ్మే పుట్టుకొస్తుంది. అమ్మకు ప్రత్యామ్నాయం లేదు. అమ్మ ప్రేమను వర్ణించటం సామాన్యం కాదు. ఆమె త్యాగం అనన్యసామాన్యం. అందుకే 'అమ్మలేకపోతే జననం లేదు.. గమనం లేదు. సృష్టిలో జీవం లేదు' కంటిపాపలా కాపాడే ప్రతి బిడ్డకీ జన్మనిచ్చిన అమ్మలకు మదర్స్ డే శుభాకాంక్షలు.

పాఠ్య పుస్తకాల్లో పాఠాలను టీచర్లు నేర్పితే.. జీవిత పాఠాలను నేర్పేది మాత్రం అమ్మే. అందుకే మనలో ప్రతి ఒక్కరి జీవితంలో అమ్మే తొలి గురువు. బాల్యంలో పిల్లలు బుడిబుడి అడుగులు వేస్తూ... అమ్మ కొంగు పట్టుకుని తిరుగుతూ... ఆమె చేస్తున్న ప్రతి పనీ గమనిస్తూ ఉంటారు. తామూ ఆ పని చేయాలని ఆసక్తి కనబరుస్తూ ఉంటారు. బిడ్డ ఆసక్తి గమనించి గురువులా నేర్పుతుంది. అప్పుడే మనకు తెలియకుండానే ఆమె తొలిగురువైంది. వేలు పట్టుకుని నడక నేర్పుతుంది. చంక నెత్తుకుని లోకాన్ని చూపుతుంది. అమ్మ.. అత్త.. మామ.. తాత.. అంటూ మాటలు నేర్పించే ప్రయత్నం చేస్తుంది. ప్రతి తల్లీ చిన్ననాటి నుంచి తమ బిడ్డ మానసిక పరిజ్ఞానానికి బాటలు వేస్తుంది. మనుషులను, పరిసరాలను, జీవితాలను.. అన్నింటినీ, అందరినీ చదవటం నేర్పిస్తుంది.

పెంపకంలో మార్పులు

పిల్లలు ఈ లోకాన్ని తొలుత అమ్మ కళ్లతోనే చూస్తారు. తల్లిని అనుకరిస్తూ.. అమ్మ ఎటు వెళ్తే అటు వెళ్లాలని తొలి అడుగులు వేస్తారు. అలా బిడ్డల మొదటి ప్రయత్నానికి అమ్మే తొలి గురువు. తన ఒడిలో కూర్చోబెట్టుకుని... బిడ్డ తొలి పలుకులకు నిత్యం ప్రయత్నిస్తూనే ఉంటుంది. బాల్యంలో ఎన్నో కొత్త విషయాలు ప్రయత్నించే క్రమంలో ఎదురుదెబ్బలు తగలటం సహజం. అలా అని అక్కడే ఆగిపోనీయకుండా జీవితంపై ఆశ కల్పిస్తూ ధైర్యం చెబుతుంది. కిందపడిన ప్రతిసారీ లేచి నడవమని ప్రోత్సహిస్తుంది. చేయిపట్టుకుని నడక నేర్పిస్తుంది. పెద్దయ్యేంతవరకూ మానసికంగా, శారీరకంగా, సామాజికంగా బలమైన వ్యక్తిగా మార్చేందుకు నిరంతరం కృషిచేస్తుంది. ఈ క్రమంలో తన జీవితంలో ఎన్నో త్యాగాలకు సిద్ధపడుతుంది. కుటుంబం, సమాజం, వృత్తి, ఉద్యోగుల్లో ఉండే అమ్మలు ఆయా విభాగాల నుంచి వచ్చే సమస్యలను ఎదుర్కొంటూనే ధైర్యంగా తమ పిల్లల భవిష్యత్తుకు మంచి పునాదిరాళ్లు వేస్తున్నారు. ఇప్పుడు అంతా చిన్న కుటుంబాలుగా మారిపోవటంతో వృత్తి, ఉద్యోగ బాధ్యతలను నిర్వహిస్తూనే పిల్లల పెంపకాన్ని ఎంచక్కా బాధ్యతగా నెరవేరుస్తున్నారు.

మంచిబుద్ధులు నేర్పుతూ..

పిల్లలకు ఊహ తెలిసే సమయంలో చిన్న చిన్న కథలు, చందమామ కథలు, రాజుల కథలు, హాస్య కథలు వంటివి చెబుతూ వాటి నుంచి మంచీ చెడూ తారతమ్యాలను బోధిస్తుంటారు. అన్నం తినకపోయినా, అల్లరి చేసినా, అలిగినా, ఏడ్చినా, సామ దాన బేధ దండోపాయాలతో బిడ్డను దారిలో పెడుతుంది. ఇంకాస్త మొరాయిస్తే రెండు దెబ్బలు తగిలిస్తుంది. ఇంటికి అతిథులు, బంధువులు, ఇతరుల వచ్చిన సమయంలో ఎలా మసులుకోవాలో చెబుతుంది. క్రమశిక్షణను నేర్పిస్తుంది. మంచి పద్ధతులు ఒంటబట్టేలా చేస్తుంది. బంధువులు, ఇరుగుపొరుగు వారి పట్ల ప్రేమ, ఆప్యాయతలు, గౌరవాన్ని చూపిస్తూ బంధాలను తెలియజేస్తూ పాటించేలా చూస్తుంది.

ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ

చిన్నప్పుడు ఆటలు, పాటలు, పరిగెత్తినప్పుడు దెబ్బతగలగానే బిడ్డ నోటి నుంచి వచ్చే తొలిపదం 'అమ్మా!' అనే. అలాగే స్నేహితులతో గొడవొస్తే పరిగెత్తుకుంటూ వచ్చి ఆ బాధ చెప్పుకునేది అమ్మతోనే. ఎందుకంటే అమ్మే... న్యాయమూర్తిలా మారి ఎవరిది తప్పో చెప్పి పిల్లల కోపాన్ని, ఆవేశాన్ని తగ్గించి, స్నేహం చెదరనీయకుండా చేసే నేర్పరి. ప్రతి విషయాన్నీ అవతలివాళ్ల వైపు నుంచి కూడా చూడాలంటుంది. శత్రువుల కన్నా స్నేహితులే మిన్న అంటూ కలుపుకుపోయే స్వభావాన్ని అలవరుస్తుంది. మంచిపనిచేశామని చెబితే మెచ్చుకుంటూ.. ముద్దుతో తొలి కానుక ఇస్తూ, ఇష్టమైనది వండిపెట్టి ప్రోత్సహించేది కూడా అమ్మే. స్కూలు నుంచి ఇంటికొచ్చిన పిల్లల దగ్గర కూర్చొని ఓ గైడ్‌లా హోంవర్క్ చేయిస్తుంది. మార్కులు తక్కువొస్తే 'తర్వాత మంచిగా ప్రయత్నించు' అని వెన్నుతట్టి ప్రోత్సహిస్తుంది. నిరుత్సాహపడితే చేయి అందించి నిలబెడుతుంది. తప్పుదారిలో నడిస్తే.. కఠినమైన స్వరంతో మందలిస్తుంది. భవిష్యత్తులో మంచిబాటలో నడిచేలా పునాదులు వేస్తుంది. చిన్న చిన్న విషయాలకు భయపడుతున్న సందర్భాల్లో గుండెలకు హత్తుకుని ఆత్మ విశ్వాసాన్ని నింపుతుంది.

స్నేహితురాలిగా ...

పిల్లలు యుక్త వయస్సులో అమ్మే స్నేహితురాలిగా మారి అర్థం చేసుకుంటుంది. మనసు బాగోనప్పుడు మంచి మాటలు చెప్పి ఓదార్చుతుంది. ధైర్యాన్నిస్తుంది. సామాజిక, మానవతా విలువలకు దారిచూపుతుంది. లక్ష్య సాధనకు పట్టుదలే తొలిమెట్టు అని నేర్పిస్తుంది. పెళ్లయినా జీవితంలో ఏ సమస్య వచ్చినా మొదట గుర్తొచ్చేది అమ్మే. అమ్మతో మాట్లాడాక ఇచ్చిన సలహాకి మన ఆలోచన జోడిస్తే పరిష్కారం కనబడుతుంది. ఎలా ముందుకెళ్లాలో బోధ పడుతుంది. పెద్దయ్యామనీ, జీవితంలో స్థిరపడ్డామనీ, పెళ్లి పేరుతో వేరు కుటుంబంలో ఉంటున్నామనీ కనిపెంచిన అమ్మానాన్నలను దూరం పెట్టొద్దు. వారిని కంటికి రెప్పలా కాపాడుదాం. వృద్ధాప్యంలో వారికి చేదోడు వాదోడుగా నిలిచి అమ్మ రుణాన్ని తీర్చుకుందాం. తమ బిడ్డల జీవితంలో ఎంతో కీలక పాత్ర పోషిస్తున్న అమ్మలకు అభినందనలు.

త్రివిక్రమ్‌తో వెంకటేష్ సినిమా

వెంకటేష్, త్రివిక్రమ్ కాంబోలో ఓ చిత్రం రానున్నట్లు తెలుస్తోంది. "సంక్రాంతికి వస్తున్నాం' హిట్ తరువాత పలు కథలు విన్న వెంకటేష్, త్రివిక్రమ్‌తో కలిసి పనిచేయడానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు సమాచారం. ప్రస్తుతం దర్శకుడు త్రివిక్రమ్ ఈ సినిమా కోసం ప్రత్యేకంగా స్క్రిప్ట్ సిద్ధం చేస్తున్నారు. ఇటీవలే వెంకటేశ్‌తో కలిసి కథా చర్చలు జరిపినట్లు తెలుస్తోంది. ఈ ప్రాజెక్ట్ ఈ ఏడాది చివరిలో సెట్స్ పైకి వెళ్లే అవకాశం ఉంది. ప్రముఖ నిర్మాత ఎస్.రాధాకృష్ణ ఈ చిత్రాన్ని హారికా అండ్ హాసిని క్రియేషన్స్ బ్యానర్‌పై నిర్మించనున్నారు.

కయదు లోహర్‌కు మరో ఛాన్స్

తమిళంలో ప్రదీప్ రంగనాథన్‌తో నటించిన 'డ్రాగన్' సినిమాతో మంచి హిట్ కొట్టిన కోలీవుడ్ నటి కయదు లోహర్‌కు ఇప్పుడు దక్షిణాదిలో మంచి అవకాశాలు వస్తున్నాయి. నాని సినిమా 'ది ప్యారడైజ్'లో ఆమె కథానాయిక. ఈ సినిమాకు శ్రీకాంత్ ఓదెల దర్శకత్వం వహిస్తున్నారు. కోలీవుడ్‌లో నటుడు అధర్వకు జంటగా హృదయం మురళి సినిమాలో నటిస్తున్నారు. తాజాగా శింబు సరసన ఆయన 49వ చిత్రంలో నటించటానికి సిద్ధమవుతోంది. సంగీత దర్శకుడు జీవీ ప్రకాష్‌కుమార్‌తో జతకట్టే ఛాన్స్ కూడా ఆమెను వరించింది. ఈ చిత్రానికి మారియప్పన్ చిన్నా దర్శకత్వం వహించనున్నారు. అరుణ్‌కుమార్ ధనశేఖరన్ నిర్మించనున్న ఈ చిత్రానికి శ్యామ్ సిఎస్ సంగీతాన్ని అందించనున్నారు.



ప్రదీప్ రంగనాథన్ 'డ్యూడ్'

తమిళ హీరో ప్రదీప్ రంగనాథన్, మైత్రి మూవీ మేకర్స్ నిర్మిస్తున్న పాన్ ఇండియా మూవీలో హీరోగా చేస్తున్నారు. ఈ సినిమాతో కీర్తిస్వరన్ డైరెక్టర్‌గా డెబ్యూ చేయబోతున్నారు. 'ప్రేమలు' స్టార్ మమితా బైజు ఈ సినిమాలో హీరోయిన్‌గా కనిపించనున్నారు. సీనియర్ నటుడు శరత్ కుమార్ ఓ కీలక పాత్రలో నటిస్తున్నారు. శనివారం ఈ చిత్ర టైటిల్‌ని చిత్రబృందం షేర్ చేసింది. రిలీజ్ డేట్ గురించి కూడా ప్రకటించారు.

'డ్యూడ్' అనే టైటిల్‌తో ఈ చిత్రం తెరకెక్కుతోంది. 2025 దీపావళి సీజన్‌లో తెలుగు, తమిళ, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో ఈ సినిమా రిలీజ్ కాబోతోంది.

నేడు 'అమ్మ' షార్ట్ మూవీ విడుదల

ఎఆర్ ఫిలిం మేకర్స్ సమర్పణలో 'నాట్యమార్గం' సహకారంతో తెరకెక్కిన చిత్రం 'అమ్మ'. ఆదివారం నాడు మదర్స్ డే సందర్భంగా ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది. ప్రముఖ నృత్యకారిణి అభినయశ్రీ ఇంద్రాణి ఈ చిత్రంలో 'అమ్మ' పాత్రలో నటించారు. ఆమె గతంలో నటించిన 'అందెల రవమిది' చిత్రం విడుదలకు ముందే పలు ప్రతిష్టాత్మక అవార్డులను సొంతం చేసుకుంది. 'అమ్మ'లో ప్రధాన పాత్ర పోషించారు. 'అమ్మ నిస్వార్థ ప్రేమను, త్యాగాన్ని చూపే హృదయస్పర్శి కథ ఈ చిత్రం' అని ఇంద్రాణి పేర్కొన్నారు. కథ, స్క్రీన్‌ప్లే, మాటలు, దర్శకత్వం వహించిన హరీష్ బన్నాయ్ మాట్లాడుతూ 'కొవ్వొత్తిలా కరిగి మనకు దారిచూపే అమ్మకు మనం ఏమిచ్చి రుణం తీర్చుకోగలం? ఇదే మా చిత్ర సందేశం' అని పేర్కొన్నారు. ఈ చిత్రంలో ఇంద్రాణి దవలూరితోపాటు సాంబి, సుధా కొండపు, రీనా బొమ్మసాని తదితరులు నటించారు. కెవి భరద్వాజ్ సంగీతాన్ని సమకూర్చారు. కార్తీక్ కళ్లూరి సినిమాటోగ్రఫీ అందించారు.



కిరణ్ 'కె ర్యాంప్' ప్రారంభం

కిరణ్ అబ్బవరం ప్రస్తుతం నటిస్తున్న తాజా చిత్రం 'కె ర్యాంప్'. కిరణ్ కెరీర్‌లో 11వ ప్రాజెక్ట్‌గా రాబోతున్న ఈ సినిమాకు జైన్స్ నాని దర్శకత్వం వహిస్తున్నారు. ఇందులో యుక్తి తరేజా హీరోయిన్. హాస్య మూవీస్, రుద్రాంశ్ సెల్యూలాయిడ్ బ్యానర్స్‌పై రాజేష్ దండ, శివ బొమ్మకు కలిసి నిర్మిస్తున్నారు. తాజాగా, కిరణ్ అబ్బవరం ఈ సినిమాకు సంబంధించిన పోస్టర్‌ను షేర్ చేశారు. త్వరలోనే ఫస్ట్ లుక్ కూడా రాబోతుందంటూ హింట్ కూడా ఇచ్చారు.

టైటిల్ కొట్టేదెవరో..?

- నేడు భారత్ × శ్రీలంక మహిళల మధ్య ముక్కోణపు సిరీస్ ఫైనల్
- ఉదయం 10.00గం॥ల నుంచి

కొలంబో: ముక్కోణపు సిరీస్ ఫైనల్లో భారత మహిళలజట్టు ఆతిథ్య శ్రీలంకతో టైటిల్‌కై తలపడనుంది. లీగ్‌లో ఆడిన నాలుగు మ్యాచుల్లో మూడు మ్యాచుల్లో నెగ్గి టాప్‌లో ఉన్న భారతజట్టు ఈ లీగ్‌లో శ్రీలంక చేతిలో ఒక మ్యాచ్‌లో ఓటమి పాలైంది. ఆ తర్వాత దక్షిణాఫ్రికా మహిళలపై పోరాడి నెగ్గి ఫైనల్ బెర్త్ ఖాయం చేసుకుంది. మరోవైపు ఆతిథ్య శ్రీలంక జట్టు భారత్‌తో ఒక మ్యాచ్‌లో, దక్షిణాఫ్రికాతో మరో మ్యాచ్‌లో ఓటమిపాలైంది. అయినా 4పాయింట్లతో 2వ స్థానంలో నిలిచి ఫైనల్‌కు చేరింది. ఈ క్రమంలో భారత్-శ్రీలంక జట్ల మధ్య ప్రేమదాస స్టేడియంలో ఆదివారం జరిగే ఫైనల్ మ్యాచ్ హోరాహోరీగా సాగనుంది. ఇక భారతజట్టు విష యానికొస్తే.. టాపార్డర్, మిడిలార్డర్ బ్యాటర్లు సమిష్టిగా రాణిస్తుండడం, బౌలర్లు చెలరేగు తుండడంతో టీమిండియాకు సానుకూ లాంశం. అయితే.. చమరి ఆటపట్టు బృందాన్ని తక్కువ అంచనా వేయడానికి లేదు. లీగ్ దశలో ఇరుజట్లు చెరొక మ్యాచ్ గెలుపొందాయి. టి20 వరల్డ్ కప్‌లో నిరాశపర్చిన భారత జట్టు పుంజుకుంది. ముక్కోణపు సిరీస్‌లో సమిష్టిగా రాణిస్తూ శ్రీలంక, దక్షిణాఫ్రికాలకు చెక్ పెట్టింది. ఆరంభ పోరులో ఓపెనర్లు ప్రతీకా రావల్ అర్ధ శతకంతో రాణించడంతో లంకపై 9 వికెట్ల తేడాతో గెలుపొందింది హర్మన్‌ప్రీత్ సేన ఆ తర్వాత సఫారీలను 15 పరుగుల తేడాతో ఓడించినా.. తదుపరి పోరులో శ్రీలంక చేతిలో 3 వికెట్లతో ఓటమి పాలైంది. ఆ తర్వాత దక్షిణాఫ్రికాను ఓడించిన ఇండియా.. ఫైనల్‌కు దూసుకెళ్లింది. నిరుడు ఆసియా కప్ ఫైనల్లో భారత జట్టు అనూహ్యంగా శ్రీలంక చేతిలో ఓటమిపాలైంది. దీంతో శ్రీలంక జట్టును చిత్తుచేసి టైటిల్‌ను చేజిక్కించుకోవడానికి హర్మన్‌ప్రీత్ సేనకు ఇదే సదవకాశం.

జట్లు(అంచనా)...

భారత్: హర్మన్‌ప్రీత్(కెప్టెన్), ప్రతికా రావల్, మంధాన, హర్లీన్, రోడ్రిగ్స్, దీప్తి, రీచా(వికెట్ కీపర్), శ్రీచరాణి, స్నేహ్ రాణా, కశ్వీ, అరుంధతి.

శ్రీలంక: ఛమారి ఆటపట్టు(కెప్టెన్), హాసిని పెరీరా, విష్మీ గుణరత్నే, హర్షిత, నీలాక్షి-డి-శిల్వ, నసయకర్రా, అనుష్క, విహాంగ, సుగంధిక, మైకి మధారా, ప్రియదర్శిని.

మధురకు స్వర్ణం

- ఆర్చరీ ప్రపంచకప్

షాంఘై: ప్రపంచకప్ స్టేజ్-2లో భారత యువ ఆర్చరీ క్రీడాకారిణి మధుర ధమన్‌గోంకర్ సత్తా చాటింది. శనివారం జరిగిన మహిళల ఫైనల్లో మధుర 139-138పాయింట్ల తేడాతో అమెరికాకు చెందిన కార్సన్ క్రహేపై సంచలన విజయం సాధించింది. మూడోరౌండ్ ముగిసేసరికి 81-85పాయింట్లతో వెనుకబడిన 24ఏళ్ల మధుర.. ఆ తర్వాత రౌండ్‌లలో అద్భుతంగా పుంజుకొని స్వర్ణ పతకం సాధించడం విశేషం. నాల్గోరౌండ్ ముగిసేసరికి 110-110 పాయింట్లతో సమం చేసింది. నిర్ణయాత్మక ఐదో రౌండ్‌లో 139-138పాయింట్లతో ప్రత్యర్థిపై విజయం సాధించింది. చివరిరౌండ్‌లో మధుర పర్ఫెక్ట్ 10 రెండు కొట్టి ఒక 9పాయింట్ల షాట్‌ను కొట్టగా.. క్రాహే రెండు 9పాయింట్లు, ఒక 10పాయింట్ కొట్టింది. అంతర్జాతీయ ఆర్చరీ పోటీల్లో మధురకు ఇదే తొలి పతకం. మహిళల టీమ్ విభాగంలో రజతం, కాంపౌండ్ మిక్స్‌డ్ టీమ్ విభాగంలో అభిషేక్ వర్మతో కలిసి కాంస్య పతకం చేజిక్కించుకోవడంలో మధుర కీలకపాత్ర పోషించింది. మూడేళ్ల తర్వాత మధుర తొలిసారి అంతర్జాతీయ పోటీల్లో పాల్గొంటోంది. దీంతో భారత్‌తో ఈ టోర్నీలో దక్కిన పతకాల సంఖ్య నాలుగుకు చేరింది.

10కి పదిమంది 'రిటైర్డ్ ఔట్'

- క్రికెట్ చరిత్రలో తొలిసారి

దుబాయ్: క్రికెట్‌లో ఒక ప్లేయర్ 'రిటైర్డ్ ఔట్' అనేది చాలా అరుదుగా చూస్తుంటాం. అలాంటిది ఏకంగా పది మంది బ్యాటర్లు ఒకేసారి 'రిటైర్డ్ ఔట్' కావడం ఎన్నడూ చూడలేదు. ఇదే మహిళల టి20 ప్రపంచకప్ అర్హత టోర్నీలో జరిగింది. యుఎఇ 10మంది బ్యాటర్లు ఒకేసారి 'రిటైర్డ్ ఔట్' రూపంలో పెవిలియన్‌కు చేరారు. మహిళల టి20 ప్రపంచకప్-2025 అర్హత టోర్నీలో భాగంగా బ్యాంకాక్ వేదికగా శనివారం యుఎఇ, ఖతార్ జట్లు తలపడ్డాయి. ఈ మ్యాచ్‌లో మొదట బ్యాటింగ్ చేసిన యుఎఇ మహిళల జట్టు 16 ఓవర్లలో ఒక్క వికెట్ కూడా కోల్పోకుండా 192 పరుగులు చేశారు. ఈ క్రమంలో బ్యాంకాక్‌లో వర్షం పడే సూచనలు ఉన్న దృష్ట్యా యుఎఇ జట్టు తమ ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేయాలని నిర్ణయించుకుంది. కానీ టి20ల్లో డిక్లరేషన్ రూల్ లేకపోవడంతో, యుఎఇ మేనేజ్‌మెంట్ తమ బ్యాటర్లందరిని మైదానంలోకి పిలిచి 'రిటైర్డ్ ఔట్' చేయాలని నిర్ణయించుకుంది. దీంతో క్రికెట్ చరిత్రలోనే తొలిసారిగా మొత్తం పది మంది బ్యాటర్లు రిటైర్డ్ ఔటయ్యారు. భారీ ఛేదనలో ఖతార్‌జట్టు 11.1 ఓవర్లలో 29 పరుగులకే కుప్పకూలింది. దీంతో ఖతార్‌పై 163 పరుగల తేడాతో యూఎఇ విజయం సాధించింది. సాహసోపేతమైన నిర్ణయం తీసుకున్న యుఎఇ కెప్టెన్, మేనేజ్‌మెంట్‌పై నెటిజన్లు ప్రశంసల జల్లు కురిపిస్తున్నారు.

సెమిస్‌లో ఓడిన అస్మిత్, ఉన్నతి

- తైపీ ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీ

తైపీ సిటీ(చైనా): తైపీ ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీలో భారత షట్లర్ల పోరాటం ముగిసింది. సెమీస్‌కు చేరి ఆశలు రేపిన యువ షట్లర్లు అస్మిత్ శెట్టి, ఉన్నతి హుడా ఓటమిపాలయ్యారు. తమకంటే మెరుగైన ర్యాంక్ ఆటగాళ్ల చేతిలో వీరిద్దరూ పోరాడి పరాజయాన్ని చవిచూశారు. శనివారం జరిగిన పురుషుల సెమీస్‌లో అస్మిత్ శెట్టి 18-21, 17-21తో చైనీస్ తైపీకి చెందిన 7వ ర్యాంకర్ ఛౌ-టిన్-చెన్ చేతిలో ఓటమిపాలయ్యాడు. ఇక మహిళల సింగిల్స్‌లో ఉన్నతి హుడా 19-21, 11-21తో మియాజకి(జపాన్) చేతిలో పోరాడి ఓడింది. ముఖ్యంతి తొలి గేమ్‌లో పోటా పోటీగా సాగింది. ఆ గేమ్‌ను కోల్పోయిన ఉన్నతి.. రెండో గేమ్‌లో ఆశించిన స్థాయిలో రాణించలేకపోయింది.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68